


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




హైదరాబాద్ | 14-01-2026 బుధవారం | సంపుటి : 26 | సంచిక : 305 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on

# 52,43,023 మంది పుర ఓటర్లు

- జిల్లాలు, మున్సిపాలిటీల వారీగా ఓటర్ల తుది జాబితా విడుదల
- మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి : ఎస్ఈసి
- రిజర్వేషన్ల ఖరారు వెంటనే ఎన్నికల నోటిఫికేషన్
- ఫిబ్రవరి చివరి నాటికి కొత్త పాలకమండళ్లు
- ఈ నెల 16 నుంచే ఎన్నికల ప్రచారం షురూ

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి మూడో వారంలోగా పూర్తి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఫిబ్రవరి చివరి నాటికి కొత్త పాలక మండళ్లకు పురపాలన బాధ్యతలు అప్పగించేలా కసరత్తు జరుపుతున్నది. పుర'పోరు నేపథ్యంలో... రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పనలో కీలక ఘట్టాన్ని పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ ముగిసినట్లు ఎస్ఈసీ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రంలోని మిగతా 12లో

# పది నిమిషాల్లో డెలివరీకి స్వస్తి

**న్యూఢిల్లీ :** గిగ్ వర్కర్ల ద్వారా పది నిమిషాల్లోనే సరుకులను డెలివరీ చేయిస్తామంటూ చేసిన వాణిజ్య ప్రకటనను బ్లింకిట్, జెప్టో, జొమాటో వంటి తక్షణ వాణిజ్య సంస్థలు మంగళవారం నాడు ఉపసంహరించుకున్నాయి. కేంద్ర కార్మిక మంత్రి మనసుఖ్ మాండవీయాతో చర్చల తరువాత ఈ నిర్ణయం తీసుకున్నాయి. డెలివరీ సమయాలకు సంబంధించి తలెత్తుతున్న ఆందోళనలను పరిష్కరించేందుకు బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ సహా పలు ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లు, ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. బ్లింకిట్ తక్షణ స్పందించి, 10 నిమిషాల డెలివరీ హామీని తన బ్రాండ్ నుంచి తొలగించినట్టు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. రానున్న రోజుల్లో ఇతరులు కూడా అదే పని చేస్తారని ఆశిస్తున్నారు, గిగ్ కార్మికుల రక్షణ, భద్రత, పని పరిస్థితుల మెరుగుపరచే లక్ష్యంతో ఈ చర్య చేపట్టారు. గిగ్ కార్మికులు, సంస్థలకు సంబంధించిన ఒక వర్గం, మెరుగైన వేతనాలు, పనిపరిస్థితులను డిమాండ్ చేస్తుండడంతో ఈ ప్రధాన చర్యను సంస్థలు చేపట్టాయి. గిగ్ కార్మికులలో ఒక వర్గం డిసెంబర్ 31న భారీ సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఈ మార్పులో భాగంగా బ్లింకిట్ తన బ్రాండ్ సందేశాన్ని తాజా పరిచిందని తెలుస్తోంది. కంపెనీ ప్రధాన ట్యాగ్‌లైన్‌ను -10 నిమిషాల్లో 10,000+ ఉత్పత్తులు డెలివరీ నుండి మీ ఇంటి వద్దకే 30,000+ ఉత్పత్తులు డెలివరీ అని సవరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్లింకిట్‌ను కొనుగోలు చేసిన జొమాటో సహ వ్యవస్థాపకుడు, యజమాని దీపిందర్ గోయల్ డిసెంబర్ 31 సమ్మెను తోసిపుచ్చుతూ, బ్లింకిట్ 10 నిమిషాల డెలివరీ ఆదేశం అసురక్షిత డ్రైవింగ్‌ను ప్రోత్సహించదని వాదించారు. రైడర్లు గంటకు 16 కి.మీ వేగంతో సగటున కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తారని పేర్కొన్నారు. అంతేకాదు, డ్రైవర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంను కంపెనీ చెల్లిస్తుందని కూడా ఆయన అన్నారు.



### రాఘవ్ చద్దా స్పందన

ఈ చర్యను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ ఎంపి రాఘవ్ చద్దా ఆహ్వానిస్తూ, ఇది అతి వేగవంతమైన డెలివరీ సమయపాలనతో ముడిపడి ఉన్న భద్రతాముప్పులపై ఆందోళన వ్యక్తం చేసిన డెలివరీ భాగస్వాములు, పౌరులదని అభివర్ణించారు. దీనికి సంబంధించిన ప్రకటన వెంటనే చద్దా ఎక్స్‌పై, సత్యమేవ జయతే. కలిసి మనం గెలిచాం. సత్వర వాణిజ్య వేదికల నుంచి 10- నిమిషాలలో డెలివరీ అన్న బ్రాండింగ్‌ను తొలగించేందుకు సకాలంలో, నిర్ణయాత్మకంగా, కరుణతో జోక్యం చేసుకున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి రుణపడి ఉన్నాను అంటూ పేర్కొన్నారు.

మిగతా 12లో

# డ్రోన్లు ఆపండి

## పాకిస్థాన్‌కు హెచ్చరిక

- పాకిస్థాన్ నుంచి రక్షణ డ్రోనుల రాక
- 10, 11, 12 తేదీల్లో తొమ్మిది డ్రోన్లు
- రాజస్థాన్ లోని జైసల్మేర్ జిల్లాలో అనుమానాస్పదంగా కనిపించిన పాక్ డ్రోన్
- పాక్ ను హెచ్చరించిన సైన్యాధ్యక్షుడు ఉపేంద్ర ద్వివేది

**ఢిల్లీ :** పొరుగుదేశం నుంచి భారత్‌లోకి చొరబడుతున్న డ్రోన్లను నియంత్రించమని పాకిస్తాన్‌ను భారత సైన్యాధ్యక్షుడు ఉపేంద్ర ద్వివేది కోరారు. ఈ అంశాన్ని ప్రతివారం జరిగే డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) స్థాయి సమావేశంలో లేవనెత్తడంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.భారతీయ సైన్యం వార్షికంగా నిర్వహించే విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించిన క్రమంలో చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ పై వ్యాఖ్యలు చేశారు. జమ్ము, కాశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నప్పటికీ నియంత్రణలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.పాక్ నుంచి వస్తున్న డ్రోన్ల గురించి వివరాలను అందిస్తూ, అవి చాలా చిన్నవి కావడమే కాదు, లైట్లు వేసుకొని వచ్చాయని, ఎత్తైన ప్రదేశాలలో ఎగరలేదని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. జనవరి 10వ తేదీన ఆరు డ్రోన్లు కనిపించగా, జనవరి 11,12వ తేదీలలో రెండు మూడు కనిపించాయన్నారు.ఇవి రక్షణ డ్రోన్లని, అవి తమకు వ్యతిరేకంగా ఏమైనా చర్యలు తీసుకుంటున్నాయా అనే విషయాన్ని చూసేందుకు యత్నిస్తున్నాయని, అలాగే, ఎక్కడైనా అంతరాలు ఉన్నాయా, భారతీయ సైన్యం ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉందా, తాము తీవ్రవాదులను పంపేందుకు ఎక్కడైనా లొసుగులు ఉన్నాయా అని చూసేందుకు వచ్చినవని తన విశ్వాసమని జనరల్ ద్వివేది చెప్పారు. వారికి ప్రతికూల స్పందన వచ్చిందని తాను నమ్ముతున్నానన్నారు.నేడు వారు తీవ్రవాదులను పంపేందుకు అవకాశం, అంతరం, ప్రదేశం లేవని వారు తెలుసుకొని ఉంటారని జనరల్ ద్వివేది పేర్కొన్నారు.కానీ, ఇది కచ్చితం, నేడు డిజిఎంఒ స్థాయిలో చర్చలు జరిపామని, ఈ విషయాన్ని చర్చించామని, వారికి ఇది అంగీకార యోగ్యం కాదని, కనుక నియంత్రించమని చెప్పాం. దీనినే వారికి తెలియచేశాం.డ్రోన్ల వీక్షణంపాకిస్తాన్ నుంచి వస్తున్నట్టుగా అనుమానిస్తున్న డ్రోన్లను గత ఆదివారం, సోమవారం నాడు రాజస్థాన్‌లోని జయసల్మేర్ జిల్లా, జమ్ము, కశ్మీర్‌లో గల భారత్-పాకిస్తాన్ సరిహద్దులలో చూశారు.రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లాలో సోమవారం రాత్రి గ్యాస్ ఆధారిత థర్మల్ పవర్ కేంద్రంపై అనుమానాస్పద డ్రోన్ కనిపించిందని, ఈ ప్లాంట్ భారతదేశం-పాకిస్తాన్ సరిహద్దుకు దగ్గరగా ఉందని పోలీసులను ఉటంకిస్తూ ఇప్పటికే పత్రికలలో వార్తలు వచ్చాయి.ఈ పరిణామాన్ని ధృవీకరిస్తూ, దర్యాప్తు కొనసాగుతోందని, జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా డ్రోన్లను ఎగురవేయడాన్ని పూర్తిగా నిషేధించామని రామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ భూతారామ్ బిష్ణోయ్ వెల్లడించారు.ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, రాత్రి సుమారు 10 గంటల సమయంలో పవర్ ప్లాంట్ ఆవరణపై ఎగురుతున్న డ్రోన్ కనిపించింది. దాదాపు ఒక గంటపాటు అది చుట్టూ తిరగడాన్ని కొనసాగించిందని స్థానికులు తెలిపారు.ఇదిలా ఉండగా, జమ్ము, కాశ్మీర్‌లోని నౌషేరా- రజౌరీ సెక్టర్‌లోని నియంత్రణ రేఖ పాకిస్తాన్ నుంచి వచ్చినట్టుగా అనుమానిస్తున్నట్టుగా వచ్చిన డ్రోన్లు ఆదివారం కనిపించడంతో సోమవారం సంబా జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేశారు.






ఈ పరిణామం భారత సైన్యాన్ని మానవరహిత వైమానిక వ్యవస్థల ప్రతి చర్యలను చేపట్టడానికి ప్రేరేపించిందని తెలుస్తోంది.జమ్మూ కాశ్మీర్‌లోని నౌషేరా-రజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంట కొన్ని పాకిస్తాన్ ఆర్మీ డ్రోన్లు కనిపించాయి. భారత ఆర్మీ దళాలు మానవరహిత వైమానిక వ్యవస్థలపై దాడులు చేయడంతో అవి తిరిగి వెళ్లవలసి వచ్చింది, అని రక్షణ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

# మేడారం జన సాగరం



✍ జి.లక్ష్మణ్ కుమార్

మేడారం జాతర చరిత్రలో ప్రతి ఒక్కరికి తెలిసేలా.. వన దేవతల గద్దెలు, జంపన్న వాగు ఆధునీకరణ పనులు తరతరాలు నిలిచేలా ప్రజా ప్రభుత్వం సిద్ధం చేయిస్తున్నది. ఆసియా ఖండం లోనే అతి పెద్ద ఆదివాసీ జాతరగా పేర్కొనబడిన "సమ్మక్క – సారలమ్మ మేడారం మహా జాతర" ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ పౌర్ణమి రోజులలో జరుగుతుంది. దశాబ్దాల కాలం నుండి బుధ, గురు, శుక్ర, శని వారాలలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నా ఆచారం. ఈ మహా జాతర ను "తెలంగాణా కుంభమేళా" గా పేర్కొంటారు. ఈ జాతరకు లక్షలాది మంది తరలివస్తారు. కోరిక కోర్కెలు తీర్చే అమ్మవార్లకు ఘనమైన పూజలు చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున జరిగే జాతరకు ఈ సారి మేడారం పున:నిర్మాణం పనుల వలన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఘన కీర్తి.. తెలుగు జాతి చరిత్రలో కాకతీయ సామ్రాజాన్ని స్వర్ణ యుగంగాను, మహోజ్వల ఘట్టంగాను పేర్కొంటారు. చరిత్ర పరిశీలిస్తే కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఓరుగల్లు ను రాజధానిగా చేసుకొని పరిపాలించిన కాలంలో ఆదివాసీలు తమ స్వేచ్ఛ, స్వాత్రంత్యల కొరకు పోరాటం చేసి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆదివాసీ హక్కులను కాపాడిన వీరవనితలుగా సమ్మక్క – సారలమ్మలు చరిత్రలో ప్రసిద్ధిపొందారు.

మిగతా 12లో

# బాట పండగ పాట

హైదరాబాద్-విజయవాడ హైవేపై చౌటుప్పల్ వద్ద





## ప్రతి కుక్క కాటుకు రాష్ట్రాలపై జరిమానా :సుప్రీం

**ఢిల్లీ:** వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటుకు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. "ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి



మిగతా 12లో

# విజయ్‌తో 'కర'చాలనం

- 'జననాయగన్'కు రాహుల్ మద్దతు
- డిఎంకేతోనూ కొనసాగనున్న మైత్రి
- తమిళ రాజకీయాల్లో సంచలన మలుపు

**న్యూఢిల్లీ :** అతడి సినిమా జన నాయగన్ చుట్టూ వివాదం ఏర్పడిన నేపథ్యంలో తమిళ నటుడు విజయ్కు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ బలమైన మద్దతును అందించడం తమిళనాడు రాజకీయాలను ఒక నూతన మలుపు తిప్పాయి. సున్నితమైన సమయంలో ఆయన ఎక్స్‌పై చేసిన వ్యాఖ్యలు విజయకు మద్దతునివ్వ డమే కాక, డిఎంకెతో సన్నిహితంగా ఉన్నప్పటికీ, విజయ్ పార్టీ టీవీకేతో ఒక రాజకీయ అవగా హనను కుదుర్చుకునేందుకు కాంగ్రెస్ సానుకూలంగా ఉందనే ఊహాగానాలను బలోపేతం చేశాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ జన నాయగన్ సినిమా విడుదలను జాప్యం చేసేందుకు యత్నించడం అన్నది తమిళ సంస్కృ తిపై దాడి అని అభివర్ణించారు. తమిళ ప్రజల గొంతుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూసివేయలేరని కూడా ఆయన అన్నారు. కీలకమైన జాతీయ సంస్థలు అన్నీ బీజేపీ, ఆర్ ఎస్ఎస్ నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయన్న ఆయన రాజకీయ వాదనలోకి ఈ తాజా వ్యాఖ్యలు ఇమిడిపోతున్నాయి. ఈ ట్వీట్ చేసిన సమయం కూడా ముఖ్యమే. ఆయన పొంగల్ వేడుకల కోసం నీలగిరులలోని గుడలూర్‌లో ఉన్న సమయంలో ఈ ట్వీట్ చేసి, వియత్నాం నుంచి తిరిగి వచ్చిన తర్వాత తొలి ప్రజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందేశం అటు రాజకీయ బరువు ను, సాంస్కృతిక ప్రతీకను కలిగి ఉంది. జన నాయగన్ అంశం





మిగతా 12లో

# ఇంకా బుద్ధి రాలేదా?

- ప్రజలే మిమ్మల్ని అగ్నిగుండంలో నెట్టెస్తారు
- ఓటమిని జీర్ణించుకోలేక పిచ్చి ప్రేలాపనలు
- మున్సిపల్ ఎన్నికల్లోనే మీకు అదే గతి
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి ధ్వజం




**వుదయం, సత్తుపల్లి/ అశ్వారావుపేట :** ప్రశాంతంగా ఉన్న తెలంగాణను స్వార్థం కోసం మళ్లీ జిల్లాల పేరిట ఉద్యమాలు చేయించి.. అగ్నిగుండాలు చేస్తాం..సామాన్య ప్రజలను బలిచేస్తాం అంటే ఊరుకునే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో అగ్గిపెట్టె పట్టుకుని యువతను రెచ్చగొట్టిన వారు చావలేదు కానీ.. అమాయకపు వేలాది పిల్లల్ని పొట్టనపెట్టుకున్నరని దుయ్యబట్టారు. అయినా రాష్ట్ర ప్రజలు తెలివైన వారనీ వారందరూ గమనిస్తున్నారని చెప్పారు. మీరు ప్రజల్ని రెచ్చగొట్టి అగ్నిగుండం తయారుచేసి చలికాసుకుంటాం అంటే..ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టెస్తారని హెచ్చరించారు. శాస్త్రీయంగా లేని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల విభజనను తప్పకుండా సరిచేస్తామని హామీ ఇచ్చారు. శాసనసభలో చర్చించి, రిటైర్డ్ జడ్జీ ద్వారా కమీటి వేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కేబినెట్ లో చర్చించి ప్రజలకు అనుకూలమైన విధంగా సరైన పునర్వవస్థీకరణ చేస్తామన్నారు. సత్తుపల్లి : పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్ నేతలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోకుండా పిచ్చి కుక్కల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన 81 మంది సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొన్నటి పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూశాక బీఆర్ఎస్

మిగతా 12లో

# సుప్రీంలో సునీత మరో అర్జీ

## తండ్రి హత్య కేసులో సిబిఐ విచారణకు పాక్షిక అనుమతిని సవాలు చేసిన వివేకానందరెడ్డి కుమార్తె

**ఢిల్లీ:** మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత సుప్రీంకోర్టులో మరో అప్లికేషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణ కొనసాగింపునకు ట్రయల్ కోర్టు పాక్షికంగా అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంను ఆశ్రయించారు. సీబీఐ విచారణ అంశంపై నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టును గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు నెలల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. కేవలం ఇద్దరి పాత్రపై మాత్రమే విచారణ జరపాలని పాక్షికంగా ఆదేశాలు ఇచ్చింది. తాము లేవనెత్తిన అంశాలకు విరుద్ధంగా పాక్షిక విచారణకు ట్రయల్ కోర్టు ఆదేశాలిచ్చిందని.. ధర్మాసనం ఇచ్చిన మార్గదర్శకాలను పట్టించుకోలేదని సుప్రీంకోర్టు దృష్టికి సునీత తీసుకెళ్లారు. దీంతో ప్రస్తుత అప్లికేషన్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లపై విచారణను అత్యున్నత న్యాయస్థానం వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.






"అమెరికా, పాశ్చాత్య దేశాలు ఇరాన్‌పై విధిస్తున్న ఆంక్షలు, అక్కడి నిరసనకారులకు ట్రంప్ బహిరంగంగా ప్రకటిస్తున్న మద్దతు టెహరాన్‌ను ఒంటరిని చేయడానికి బదులు మరింత బలోపేతం చేస్తాయి. చైనా, రష్యాలు ఇరాన్‌కు ఇంకా చేరువ అవుతాయి. ఇరాన్ నుంచి చైనా ఆయిల్ కొనుగోలును పెంచి దానికి ఆర్థికంగా తోడ్పడుతుంది. ఇప్పటికే ఇరాన్ నుంచి చైనా భారీగా పెట్రోల్‌ను దిగుమతి చేసుకుంటున్నది."

మాజీ దౌత్యవేత్త అనిల్ త్రిగుణయాత్

## వేమన పద్యం

ఇనుము విరిగెనేని ఇనుమారు ముమ్మారు
కాచి అతుకనేర్చు కమ్మరీడు;
మనసు విరిగెనేని మరి యంట నేర్చునా?
విశ్వదాభిరామ వినుర వేమ!



## సంపాదకీయం

# ఇరాన్ పై మరో ఆంక్ష

ఇరాన్ పై అమెరికా రంకెలు జుగుప్స కలిగిస్తున్నాయి. తాను తలచుకుంటే ఏ దేశానికైనా ఇదే గతి పడుతుందని నిన్న వెనెవెజులా పై ముష్కర దాడి ద్వారా ప్రకటించిన అగ్ర రాజ్య అధ్యక్షుడు ఇప్పుడు ఇరాన్ మీద తన పగ సాధింపు దృష్టిని సారించాడు.అమెరికాకు ముస్లిం దేశాలలోకెల్లా అతి బలమైన శత్రువు ఇరాన్. ఆయతుల్లా ఖమేని నాయకత్వంలోని ఈ మత దేశం చిరకాలంగా దానికి కొరకరాని కొయ్యగా ఉంది. హౌతీ లు, హెజ్బొల్లాలు శక్తులపై గట్టి దానికి పట్టు ఉంది. వంటి ఇంతకుముందు నుంచే తన ఆంక్షల కింద నలిగిపోతున్న ఇరాన్ పై ట్రంప్ తాజాగా మరో పెద్ద ఆర్థిక శిక్ష విధించాడు. ఇరాన్ తో వాణిజ్యాది సమ్మంధాలు పెట్టుకొన్న దేశాల సరకులపై 25 శాతం అదనపు టారిఫ్ ను ట్రంప్ తాజాగా విధించాడు. అంటే ఈ దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే సరకులపై 25 శాతం అదనపు టారిఫ్ ను చెల్లించవలసి వస్తుంది. వాస్తవానికి ట్రంప్ విధించే టారిఫ్ లు అమెరికాలో ఆ సరకుల ధరలను ఆ మేరకు పెంచుతాయి. అవి అమెరికన్ ప్రజల జేబులపై తీవ్ర వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తాయి. ఇరాన్ పై ట్రంప్ విధించిన తాజా 25 శాతం టారిఫ్ చైనా, రష్యా, ఇండియా వంటి ఇరాన్ తో సాన్నిహిత్యం గల దేశాలను బాధిస్తాయి.అదే పనిగా వాయిదా పడుతూ తాజాగా మంగళవారం నాడు మళ్లీ మొదలైన అమెరికా – భారత్ వాణిజ్య ఒప్పందానికి గుదిబండ అవుతుంది. 1979 లో పాశ్చాత్య అనుకూల షా పరి పాలనను అంత మొందించిన ఇరాన్ విప్లవం తర్వాత అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ హయాంలో అమెరికా మొదటి సారిగా ఇరాన్ పై ఆంక్షలు విధించింది,1981 లో వాటిని ఎత్తివేశారు. మళ్ళీ 1983 లో ప్రెసిడెంట్ రోనాల్డ్ రీగన్ ప్రభుత్వం ఇరాన్ పై మళ్ళీ ఆంక్షలు ప్రయోగించింది, అలా క్లింటన్, బుష్, ఒబామా, ట్రంప్ హయాంలలో ఈ విధింపు కొనసాగింది. ఇప్పుడు ఇలా కొనసాగుతున్నది.ఈ ఆంక్షల వల్ల దేశంలో ధరలు పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయిపోయిన నేపథ్యంలో ఇరాన్ లో ప్రజల నిరసన ప్రదర్శనలు చోటు చేసుకొంటున్నాయి.అటువంటి ఒక తాజా ప్రదర్శనకు ఇరాన్ విముక్తి పోరాటంగా పేరు పెట్టి ట్రంప్ బహిరంగ మద్దతు ఇవ్వడం, పదవీచ్యుతుడైన ఇరాన్ షా మనుమడు రెజా పహ్లావి కూడా త్వరలోనే అక్కడ తమ పాలన నెలకోగలదని ప్రకటించడంతో ఈ నిరసనకు విశేష ప్రాతినిధ్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ పై వైమానిక దాడులు చేయగలనని ట్రంప్ బెదిరించడమూ జరిగింది.తమ మీదకి వస్తే తడాఖా చూపిస్తామని ఇరాన్ మత అధినేత ఖమేని ప్రతి హెచ్చరిక చేశారు. ఇరాన్తో చర్చలకు కూడా సిద్ధమని ప్రకటించిన ట్రంప్ చివరికి ఏమి చేస్తాడో చూడాలి. ఇరాన్ లో బలవంతమైన ప్రతిపక్షం, దానికి గట్టి నాయకత్వం ఉంటే దానికి అండగా బలగాలను పంపి అమెరికా కథ నడిపించగలదు. అయితే ఇరాన్ పరిస్థితి భిన్నమైనది , అది వెనెవెజులా వంటిది కాదు. అది లాటిన్, ఇది అమెరికా ఇది పశ్చిమాసియా. ఇరాన్ కు చైనా దన్ను గట్టిగా ఉన్నది. వెనెవెజులా ఆయిల్ నిక్షేపాలను అమెరికా కబ్జా చేసిన నేపథ్యంలో ఇరాన్ చమురును చైనా మరింతగా కొనుగోలు చేస్తుంది, దానికి దన్నుగానూ నిలబడుతుంది. అందుచేత దూరం నుంచి కారాలు మిరి యాలు నూరడమే తప్ప ట్రంప్ ఇప్పట్లో దానిని ఏమీ జాలదని చెప్పవచ్చు.

## రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, సమీక్షలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఎదురు దెబ్బా, చావు దెబ్బా?

## తిరువనంతపురం ఫలితంతో ఉప్పొంగిపోయిన బిజెపికి ఓట్ల శాతంలో ఆశాభంగం

ఇటీవల కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అక్కడ అధికారంలో ఉన్న వామపక్ష సంఘటనకు ఎదురుదెబ్బ తగిలిందన్నది వాస్తవం. దాన్ని చావుదెబ్బగా కొందరు వర్ణిస్తున్నారు. అది నిజమా ? ప్రధాని నరేంద్రమోడీ తిరువనంతపురంలో బిజెపి సాధించిన విజయం గురించి గొప్పలు చెప్పుకున్నారు. కేరళ రాజకీయాల్లో ఒక మహత్తర ఘట్టం అన్నారు. మోడీ సేవలో తరిస్తున్న కాంగ్రెస్ తిరువనంతపురం ఎంపీ శశిధరూర్ చారిత్రాత్మక విజయం అన్నారు. ఎందుకటా నాలుగున్నర దశాబ్దాలుగా తిరువనంతపురం మేయర్ పీఠాన్ని నిలుపుకున్న సిపిఎం అక్కడ ఓడిపోయి 101 సీట్లకు బిజెపి 50 తెచ్చుకున్నందుకు. ఓకే, కాసేపు నరేంద్రమోడీని సంతుష్టీకరించేందుకు అంగీకరిద్దాం, నిజమే కదా ! అయోధ్య రామ మందిరం గురించి దశాబ్దాల పాటు బిజెపి ఎంత హడావుడి చేసిందో చూశాము. దానివల్లనే మూడుసార్లు మోడీ ప్రధాని అయ్యారు. అక్కడ మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లో పదేండ్ల అధికారం తరువాత బిజెపి ఓడిపోయింది, అంతేనా, వారణాసి నియోజకవర్గం, వరుసగా ప్రధాని నరేంద్రమోడీ మూడుసార్లు ఎన్నికయ్యారు. తొలిసారి 3,71,784 ఓట్ల మెజారిటీ తెచ్చుకుంటే రెండవసారి 4,79,505కు పెంచుకోగా మూడవ సారి 1,52,532కు దిగజారింది. దీని గురించి ఏమని వర్ణిస్తారు ? ఒక వాస్తవం ఏమంటే కేరళలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఈసారి పెరగకపోగా స్వల్పంగా తగ్గాయి. దీని గురించి మోడీ నుంచి ఎలాంటి స్పందనా ఉండదు ! స్థానిక సంస్థలలో అనేక అంశాలు పని చేస్తాయి. బిజెపి కేరళలో గతంలో తెచ్చుకున్న ఆరువందలకు పైగా పంచాయతీ వార్డులను ఈసారి పోగొట్టుకుంది. కొత్తగా కొన్ని తెచ్చుకొని గతం కంటే స్వల్పంగా మెరుగుపడింది. ఒకసారి అధికారంలో ఉన్నతరువాత అన్ని పార్టీలకూ వాటి పనితీరును బట్టి వ్యతిరేకత ఉంటుంది. అది ఒక్క సిపిఐ(ఎం)కే కాదు, ప్రతి పార్టీకి వర్తిస్తుంది. కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ పని అయిపోయిందని తరువాత బిజెపిదే హవా అన్నట్లుగా మీడియాలో కొందరు ఊదరగొట్టారు. కేరళలో కమ్యూనిస్టు వ్యతిరేక మీడియాలో మళయాళ మనోరమ ఒకటి. అది 2025 డిసెంబరు 22న ఒక విశ్లేషణ రాసింది. దానికి పెట్టిన శీర్షిక " స్థానిక సంస్థ ఎన్నికల్లో ఇక్కడ బిజెపి తీరుచూసి అమిత్ షా ఎందుకు ఆశాభంగం పొందుతారంటే " దాన్లో ఏముందో చూద్దాం. " స్థానిక సంస్థల ఎన్నికల్లో 25శాతం ఓట్లు తెచ్చుకోవాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా లక్ష్య నిర్దేశం చేశారు. అమిత్ షాలో ఆశావాద వేడి ఎందుకు పుట్టిందంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఏ ఒక్కటే ఇక్కడ 19.40 శాతం ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. అదిప్పుడేమైందంటే నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (బిజెపి–భారత ధర్మ జనసేన–లోక్ జనశక్తి పార్టీ) కేవలం 14.76శాతం ఓట్లనే తెచ్చుకోగలిగింది.(గత స్థానిక ఎన్నికల కంటే 0.24శాతం తక్కువ–వికీపీడియా) యుడిఎఫ్‌కు 38.81, ఎల్‌డిఎఫ్‌కు 33.45శాతం వచ్చాయి. పంచాయత్‌లలో(జిల్లా,బ్లాక్,గ్రామపంచాయతీలు అన్నీ కలిపి) ఎన్‌డిఏకు వచ్చిన ఓట్లు 13.92శాతం, 2020లో వచ్చిన 14.34శాతం కంటే స్వల్పంగా తక్కువ. మున్సిపాలిటీలలో 13.1 నుంచి 19.44శాతానికి పెంచుకుంది.కార్పొరేషన్లలో 19.44 నుంచి 23.58శాతానికి పెంచుకుంది. మొత్తం అన్ని స్థానిక సంస్థలలో వచ్చిన సగటు ఓట్లు 14.76శాతం.2020 ఎన్నికల్లో వచ్చిన 12.92శాతం కంటే స్వల్పంగా పెంచుకుంది. కానీ ఇది తప్పుదారి పట్టించేది,ఎందుకంటే 2020 కంటే బిజెపి అదనంగా ఈసారి 40శాతం సీట్లలో పోటీ చేసింది.ఆ ఏడాది బిజెపి 14వేల వార్డుల కంటే తక్కువే పోటీ చేసింది. ఈసారి ఆ పార్టీ, మిత్రపక్షాలతో కలసి ఎన్నికలు జరిగిన




మొత్తం 23,576 వార్డులలో 89.35శాతం అంటే 21,065 చోట్ల పోటీ చేసింది. బిజెపి ఒక్కటే 19,262 సీట్లలో పోటీ చేసింది. ఇతర ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ 17,497, సిపిఎం 14,802చోట్ల పోటీ చేశాయి. గత ఎన్నికల కంటే ఏడువేల వార్డులలో అదనంగా పోటీ చేయటంతో పాటు మొత్తం 25శాతం ఓట్లు, రెండు కార్పొరేషన్లు, కనీసం పది మున్సిపాలిటీలు,30 బ్లాక్ పంచాయతీలు, 300కు పైగా గ్రామ పంచాయతీలు సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా దానిలో ఒక చిన్న భాగం మాత్రమే చివరికి దక్కింది. ఇరవై ఆరు గ్రామ పంచాయతీలు (తిరువనంతపురం 6, కొల్లం 2, పత్తానంతిట్ట 4, అలప్పూజ 5,కొట్టాయం 3, త్రిసూర్ 1, పాలక్కాడ్ 2, కాసరగోడ్ ),రెండు మున్సిపాలిటీలు(పాలక్కాడ్,తిరుప్పనితుర) ఒక కార్పొరేషన్(తిరువనంతపురం) దానికి దక్కాయి. అయినప్పటికీ కేవలం ఆరుగ్రామ పంచాయతీల్లోనే దానికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ముదక్కల్(తిరువనంతపురం),పండలం–తెక్కెక్కర(పత్తానంతిట్ట) తిరువిలివామల(త్రిసూర్) అకతెత్తెర, పూడూరు(పాలక్కాడ్) మాధూర్(కాసర్‌గోడ్). చివరికి తిరువనంతపురం కార్పొరేషన్‌లో కూడా 101 సీట్లకు గాను సాధారణమెజారిటీ 51కి గాను ఒకటి తక్కువగా 50వచ్చాయి. సీట్ల రీత్యా ఎల్‌డిఎఫ్ కంటే మెరుగ్గావచ్చాయి, గతం కంటే నాలుగుశాతం ఓట్లు పెరిగినప్పటికీ ఎన్‌డిఏకు వచ్చిన 34.52శాతం కంటే మెరుగ్గా ఎల్‌డిఎఫ్‌కు 34.56శాతం వచ్చాయి. 2020లో బిజెపికి కాసరగోడ్ జిల్లాలోని మధుర్, బెల్లూర్ గ్రామపంచాయతీలలో, రెండు మున్సిపాలిటీలు పాలక్కాడ్, పండలంలో స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈసారి రెండింటిలో దానికి మెజారిటీ రాలేదు, పండలంలో అవమానకరంగా నష్టపోయింది.ఈసారి ఎన్‌డిఏ 421 కార్పొరేషన్ వార్డులకు గాను 22.09శాతం(93), 3,240 మున్సిపల్ వార్డులకు గాను పదిశాతం (324), 346 జిల్లా పంచాయత్ వార్డులకు గాను ఒక్కటి, 2,267 బ్లాక్ పంచాయత్ వార్డులకు 54, గ్రామపంచాయతీలలోని 17,337కు గాను 1,447 వార్డులు 8.35శాతం వచ్చాయి.ఒక్క కార్పొరేషన్లలో తప్ప 2020తో పోల్చితే బిజెపి పరిస్థితి పెద్దగా మెరుగైనట్లు ఇవి ప్రతిబింబించటం లేదు. మున్సిపాలిటీలు, జిల్లా పంచాయత్‌లో గతం కంటే తగ్గింది. బిజెపి 2020లో సాధించినవి, ఇప్పటి పరిస్థితి ఇలా ఉంది.కార్పొరేషన్లు 14.25(ఇప్పుడు 22.09), మున్సిపాలిటీలు 10.4(ఇప్పుడు పదిశాతం) జిల్లాపంచాయత్‌లు 0.60(ఇప్పుడు 0.29), బ్లాక్ పంచాయత్ 1.78(ఇప్పుడు 2.38) గ్రామపంచాయతీలు 7.4 (ఇప్పుడు 8.35).ఈ సారి పండలం మున్సిపాలిటీని బిజెపి కోల్పోయింది. ఇది శబరిమలకు దగ్గరగా ఉంది. అంతర్గత కుమ్ములాటలు, పాలనలో అక్రమాల కారణంగా ఇది జరిగింది.గతంలో బిజెపికి 20 సీట్లు ఉంటే ఇప్పుడు తొమ్మిది స్థానాలతో మూడవ స్థానానికి దిగజారింది. పాలక్కాడ్‌లో బిజెపి 2020లో 28 సీట్లు తెచ్చుకొని సంపూర్ణ మెజారిటీ సాధించింది. ఈసారి పెద్ద పార్టీగా ఎన్నికైనప్పటికీ మెజారిటీకి అవసరమైన 27కు గాను 25 తెచ్చుకుంది. తిపురినిత్తుర మున్సిపాలిటీలో గత ఎన్నికల్లో 15 తెచ్చుకుంది(ఎల్‌డిఎఫ్‌కు 21) ఈసారి 21సీట్లతో బిజెపి పెద్ద పార్టీగా ఎన్నికైంది, మెజారిటీ సంఖ్య 27.గత ఎన్నికల్లో రెండవ పార్టీగా ఉన్నప్పటికీ ఓట్లశాతంలో 27.54తో పెద్దదిగా, యుడిఎఫ్ 24.42, ఎల్‌డిఎఫ్ 23.25శాతం తెచ్చుకున్నాయి. మున్సిపాలిటీలలో గుర్తించదగినదిగా బిజెపి ఉనికి ఉన్నప్పటికీ కొన్ని జిల్లాల్లో దాని ఓట్ల వాటా పెరిగింది. ఎర్నాకుళంలో 9.08 నుంచి 12.65, పత్తానంతిట్టలో 16.18 నుంచి 18.02, త్రిసూర్‌లో 19.14 నుంచి 21.86, పాలక్కాడ్‌లో 18.28 నుంచి 23.96కు పెరిగాయి. కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో క్రైస్తవ అభ్యర్థులతో అది ప్రయోగం చేసింది. మున్సిపాలిటీలలో దాని ఓట్ల వాటా పెరిగింది.కొట్టాయంలో 11.5 నుంచి 15.1, ఇడుక్కిలో 12.53 నుంచి 14.88శాతానికి పెరిగింది. ఎల్‌డిఎఫ్ వాటా 21.63శాతానికి దగ్గరగా వచ్చింది.అయితే కొన్ని జిల్లాలోని మున్సిపాలిటీలలో దాని ఓట్ల వాటా తగ్గింది. తిరువనంతపురంలో 24.49 నుంచి 23.48కి, అలప్పూజలో 19.08 నుంచి 18.19, కాసరగోడ్‌లో 15.36 నుంచి 14.52కు తగ్గాయి. కొల్లం కార్పొరేషన్‌లో ఆరు నుంచి పన్నెండు సీట్లకు పెరిగాయి. ఆ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఓట్ల శాతం స్థిరంగా ఉంది, ఇప్పుడు 15.92 రాగా 2020లో 15.9శాతం వచ్చాయి. కొల్లం కార్పొరేషన్‌లో కూడా ఓట్లశాతం స్థిరంగానే ఉంది. తిరువనంతపురంలో 30.92 నుంచి 34.52,కొచ్చిలో 10.95 నుంచి 14.41కి, కన్నూరులో 11.61 నుంచి 14.06కు పెరిగాయి. మిగిలిన మూడు కార్పొరేషన్లలో 2020లో వచ్చిన మేరకే తిరిగి వచ్చాయి. కొల్లంలో 22.02 నుంచి 22.61కి,త్రిసూర్‌లో 18.86 నుంచి 18.54, కోజికోడ్‌లో 22.29 నుంచి 22.43శాతంగా ఉంది. పైన పేర్కొన్నదంతా మళయాళ మనోరమ విశ్లేషణలోని అంశాలే. తిరువనంతపురంలో బిజెపి గెలుపు గురించి మీడియాలో వచ్చిందేమిటో చూశాము. శబరిమల అయ్యప్ప ఆలయం సమీపంలో ఉన్న పండలం మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా గత ఎన్నికల్లో బిజెపి పద్దెనిమిది తెచ్చుకుంది. ఈ సారి తొమ్మిది వార్డులతో మూడ స్థానానికి పడిపోయింది. అనేక మంది రాష్ట్ర నేతలు ఇక్కడ తిష్టవేసి ఎలాగైనా నిలబెట్టుకోవాలని చూశారు. ఎల్‌డిఎఫ్ 14, యుడిఎఫ్ 11 తెచ్చుకున్నాయి. అయ్యప్పస్వామి ఆలయ ప్రవేశ వివాదంతో గతంలో బిజెపి పొందిన లబ్ధి ఇప్పుడు తుడిచిపెట్టుకుపోయింది. ఇటీవల అయ్యప్ప ఆలయంలో జరిగిన బంగారు తాపడాల అక్రమాన్ని ప్రచారం చేసి మరింతగా లబ్ధిపొందాలని చూసి భంగపడింది. ఈ మున్సిపాలిటీ మాత్రమే కాదు, దాని పక్కనే ఉన్న కులంద గ్రామ పంచాయతీ 15 సంవత్సరాలుగా బిజెపి ఆధీనంలో ఉంది. ఈ సారి అక్కడ ఎల్‌డిఎఫ్ 8,బిజెపి, ఇతరులు నాలుగు చొప్పున, యుడిఎఫ్‌కు ఒక స్థానం వచ్చింది. శబరిమల ఆలయం ఉన్న రన్నీ–పెరునాడ్ పంచాయతీ శబరిమల వార్డులో బిజెపి మూడవ స్థానంలో ఉంది. యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్‌కు సమంగా ఓట్లు రావటంతో లాటరీలో ఎల్‌డిఎఫ్‌కు వచ్చింది. ఈ పంచాయతీని పదివార్డులతో ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బిజెపి 101కి గాను 50వార్డులతో అధికారానికి వచ్చింది. సిపిఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ వెల్లడించిన వివరాల ప్రకారం ఓట్ల రీత్యా అక్కడ సిపిఐ(ఎం) ప్రథమ స్థానంలో ఉంది. మీడియాకు ఈ వివరాలు తెలిసినప్పటికీ అది పెద్ద ప్రాధాన్యత కలిగిన అంశం కాదన్నట్లుగా మౌనంగా ఉంది.లోక్‌సభ ఎన్నికలు 2024లో బిజెపికి తిరువనంతపురంలో 2,13,214 ఓట్లు వస్తే కార్పొరేషన్ ఎన్నికల్లో అవి 1,65,891కి తగ్గాయి. యుడిఎఫ్ ఓట్లు 1,84,727 నుంచి 1,25,984కు పడిపోగా ఎల్‌డిఎఫ్ ఓట్లు 1,29,048 నుంచి 1,67,522కు పెరిగాయి, అంటే బిజెపి కంటే స్వల్పంగా ఎక్కువ తెచ్చుకుంది. బిజెపి గెలిచిన 50 వార్డులలో 40 చోట్ల యుడిఎఫ్ మూడవ స్థానంలో ఉంది. ఇరవై అయిదు వార్డులలో కాంగ్రెస్‌కు కనీసం వెయ్యి ఓట్లు కూడా రాలేదు. కొన్నింటిలో ఐదువందలకు లోపే వచ్చాయి. ? కొన్ని చోట్ల బిజెపి వంద ఓట్లకంటే తక్కువ మెజారిటీతో గెలిచింది. దీని అర్థం ఏమిటి ? పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటర్ల తీరులో తేడా ఉంటుందన్నది వాస్తవం. అక్కడ గెలిచిన కాంగ్రెస్ నేత శశిధరూర్ ఆ పార్టీలో ఉంటూనే బిజెపితో చెలిమిచేస్తున్న సంగతి బహిరంగ రహస్యం. తన పార్టీ తీరుతెన్నులను మరిచి పోయి బిజెపి చారిత్రాత్మక విజయం సాధించిందని పొగిడారంటే ఏం జరిగిందో చెప్పనవసరం లేదు. అనేక చోట్ల రెండు పార్టీలు సిపిఎంకు వ్యతిరేకంగా కుమ్మక్కు కావటం గతంలో జరిగింది, ఇప్పుడు కూడా పునరావృతం అయినట్లు కనిపిస్తోంది !



ఎం కోటేశ్వరరావు
8331013288

# గోదా రంగనాథ కల్యాణం

మధురకు యాభై మైళ్ళ దూరాన శ్రీవిల్లిపుత్తరు అనే చిన్న ఆవాసం, నిత్యం రంగానాథుడిని సేవించే విష్ణుచిత్తుడనే పరమ భక్తుడుండేవాడు. విష్ణుచిత్తుడు లేదా పెరియళ్వార్ (9 వ శతాబ్దం) హిందూ మతంలో వైష్ణవ సంప్రదాయానికి అనుబంధంగా పేరుగాంచిన దక్షిణ భారతదేశం లోని పన్నెండు మంది ఆళ్వారులలో ఒకడు. పెరియళ్వార్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. విష్ణుచిత్తుడు అంటే "విష్ణువును మనస్సులో నిలుపుకున్న వాడు". ఆజన్మ బ్రహ్మచారిగా జీవించిన ఆయనకు గోదాదేవి తులసి వనంలో లభించింది. ఆమెకు "కోదై" (పూలమాల) అనే పేరు పెట్టాడు. లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన చుట్టూ ఉన్న ఆధ్యాత్మిక ప్రభావ కారణాన శ్రీరంగ నాథుడినే ఆమె భర్తగా పొందాలనుకుంది. స్వామికి సమర్పించే మాలలన్నీ ముందుగా తాను ధరించి, దేవదేవునికి సమర్పింప చేస్తూ, "ఆముక్త మాల్యద" అయింది. విషయాన్ని గమనించిన విష్ణుచిత్తుడు వేరే మాలలు సమర్పిస్తే, ఆ స్వామి గోదాదేవి ధరించి విడిచిన మాలలే కావాలన్నాడు. రంగనాథుని భర్తగా పొందేందుకు ఆమె ధనుర్మాస వ్రతం ఆచరించింది. "ఆండాళ్ అని ఆమెను విష్ణుచిత్తుడు సంబోధించాడు. అంటే "రక్షకురాలు" అని అర్థం. సర్వం త్యజించి స్వామిపైనే మనసు లగ్నం చేయడానికి గోదాదేవి కాత్యాయనీ వ్రతం చేసింది.

వటపత్రశాయి అయిన శ్రీమహా విష్ణువును గూర్చి రోజుకొక్క పాశురం గానం చేసి, శ్రీ నివాసునికై కాత్యాయనీ వ్రతమాచరించి, శ్రీరంగ నాథుడిని పరిణయ మాడిన ఆండాళ్ కోదై, ఆముక్త మాల్యద, చోడిక్కొదుత్త నాచ్చియార్ అనే పేర్లతో ప్రసిద్ధ నొందినది గోదాదేవి. ఆమె అయోనిజ. జనకునికి సీతాదేవి భూమినుండి లభించినట్లు విష్ణు చిత్తునకు గోదాదేవి దైవ దత్తంగా దరి చేరింది. కలి యుగాన శ్రీవిల్లిపుత్తూరు నందు గోదాదేవి, వటపత్రశాయిని సాక్షాత్ శ్రీకృష్ణునిగా ఎంచి, అక్కడి ఆలయాన్ని గోప భవనంగా భావించి తనతో పాటు తోటి చెలికత్తెలందరినీ గోపికలుగా విశ్వసించి, ధనుర్మాస వ్రత మాచరించింది. పూర్వజన్మలో సత్యభామనని తెలిసి కొని, లీలామానస విగ్రహుని తలచుకుని వియోగ వ్యథతో తపించింది. ద్రవిడ భాషలో తాను రాసిన పాశురాలను గానం చేస్తూ స్వామికి అర్పించింది. గోదాదేవి వరాహావతారాన సముద్రంలో నుండి కోరలతో ఎత్తబడి బయట పడిన భూదేవి. పూర్వ జన్మ స్మృతితో స్వామి దివ్య లీలలను గానం చేస్తూ స్వామిని చూడాలనే తహతహతో తపించింది. రంగనాథుని ఆదేశానుసారం విష్ణుచిత్తుడు పల్లకిలో గోదాదేవిని గైకొని, శ్రీరంగం వెళ్ళాడు. కావేరీ స్నానమాచరించి, దేవాలయానికి వెళ్ళి విశ్వక్సేనుడిని, గరుడాళ్వారుని దర్శించాడు. శ్రీరంగ నాథుని భక్తితో స్తుతించాడు. గోదాదేవిని తనకిచ్చి వివాహం చేయాలని రంగనాథుడు... బ్రహ్మ శివుడు, సరస్వతి, రుద్రాణి, విష్వక్సేనుడు ఆదిగా విష్ణుచిత్తుని వద్దకు పంపారు. పెళ్లికూతురిగా గర్భగుడిలోకి ప్రవేశించిన గోదాదేవి, అందరూ చూస్తుండగా ఆ రంగనాథునిలో ఐక్యమైపోయింది. లక్ష్మీదేవి తొలుత భృగు నందన, పాల సముద్రుని తనయ, తర్వాత వైకుంఠ నాథుని దేవేరి అయింది. ఇదంతా మకర సంక్రాంతికి ముందు భోగిరోజు జరిగింది. అందుకే ధనుర్మాసం చివరి రోజైన భోగి రోజున గోదా రంగనాథుల కళ్యాణోత్సవాలను ప్రతీ వైష్ణవ క్షేత్రంలోను వైభవోపేతంగా నిర్వహిస్తారు.






రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# మొట్టమొదటి రేడియో సందేశం

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. బోలోనా విశ్వ విద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు "మార్కోనీ" కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కోనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు.

# కాశ్మీర్‌కు ఆధునిక హంగులు

నేలపై వెలసిన అద్భుత అందాల స్వర్గం నా కాశ్మీరం. భరత మాత శిరస్సుపై హిమాలయ రత్నాలు పొదిగిన కిరీటం మన కాశ్మీరం. సకల అందాల కాశ్మీరంలో ప్రతికూల వాతావరణాలు, ప్రమాదకర కొండలు లోయలు, కొండచరియలు విరిగి పడడం లాంటి ప్రకృతి ప్రకోపాలు నిత్యకృత్యం కావడంతో ప్రజలు నలిగిపోతున్నారు. అలాంటి జమ్ము–కాశ్మీర్‌కు నేడు ప్రపంచవ్యాప్త గుర్తింపుతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధులకు, పర్యాటకుల కనువిందులకు, త్రివిధ దళాల సురక్షిత ప్రయాణాలకు మార్గం సుగమం అవుతున్నది. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తున ప్రతిష్టాత్మకంగా రూ:42,000 కోట్ల బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్డు మార్గాలతో పాటు రైలు మార్గాల్లో బ్రిడ్జెస్(వంతెనలు), టనెల్స్(సొరంగ మార్గాలు), రోప్‌వేస్(తాడు ఆధార రవాణా మార్గాలు) నిర్మాణాలతో ఆ ప్రాంత రవాణా అత్యంత సురక్షితం, సులభం కానున్నది. ఇప్పటికే 41,141 కిమీ రోడ్ల నిర్మాణంతో (అందులో 1,735 కిమీ జాతీయ రహదారి) పాటు 410 వంతెనలు కూడా పూర్తి చేయడం జరిగింది. ఇప్పటికే జె అండ్ కె ప్రాంతంలో 17,839 కిమీల రోడ్డు నిర్మాణాలతో 2,131 గ్రామాలను కలపడం జరిగింది. "పర్వత్‌మాలా పథకం" కింద 18 రోప్‌వే ప్రాజెక్టులను కూడా చేపట్టడం జరిగింది.

### 'దేవుడి గడ్డి మైదానం'గా పిలువబడే సోన్‌మార్గ్ వద్ద జెడ్–మొర్ సొరంగం

"ఉద్దంపూర్ – కాశ్మీర్ – బలరాముల్లా రైల్ ప్రాజెక్ట్ (యూఎస్‌బిఆర్‌ఎల్)" కింద 272 కిమీ రైలు మార్గం పూర్తి అయిన సందర్భంగా ఆ అత్యద్భుత ఇంజనీరింగ్ మార్వెల్ గూర్చి తెలుసుకొని భారతీయ పౌర సమాజం గర్వపడుతున్నది. "దేవుడి గడ్డి మైదానం(మెడివ్ ఆఫ్ గాడ్)"గా పేరొందిన సోన్‌మార్గ్ వద్ద నిర్మించిన జెడ్–మొర్ సొరంగ మార్గంతో కాశ్మీర్–లేహ్ కార్గిల్‌ల మధ్య రోడ్డు మార్గం సులభం అవుతున్నది. సముద్ర మట్టానికి 8,650 అడుగుల ఎత్తున 12 కిమీ సోన్‌మార్గ్ టనెల్ ప్రాజెక్టు రూ: 2,700 కోట్ల బడ్జెట్‌తో పూర్తి కావడం, ప్రారంభోత్సవం కూడా జరగడం సంతోషదాయకం. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ




మాట్లాడుతూ నేడు జరుగుతున్న రవాణా వ్యవస్థ అభివృద్ధితో జె అండ్ కె ప్రాంతం "కాశ్మీర్ టనెల్స్, బ్రిడ్జెస్, రోప్‌వేస్ హబ్"గా మారిందని సగర్వంగా ప్రకటించడం కూడా హర్షదాయకం. కాశ్మీర్‌లో రోడ్డు/రైలు రవాణా మార్గాల విస్తరణకు జోజిలా, చెనానీ–నశ్రీ టనెల్, సోన్‌మార్గ్ టనెల్, యూఎస్‌బిఆర్‌ఎల్ ప్రాజెక్టులు చేపట్టడం జరిగింది. భరతమాతకు కిరీటంగా నిలబడిన కాశ్మీర్ నేటి అత్యాధునిక ప్రాజెక్టులు పూర్తి కావడంతో ఆ కిరీటంలో పొదిన తళతళ మెరిసే వజ్రాల వలె భరతమాత అందాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

### 'టనెల్స్, బ్రిడ్జెస్, రోప్‌వేస్ హబ్'గా జమ్ము – కాశ్మీర్

ప్రపంచంలోనే అత్యంత ఎత్తున నిర్మించబడిన టనెల్, రైలు బ్రిడ్జ్, రైల్వే లైన్ నిర్మిత ప్రాంతంగా రికార్డు సృష్టించడం విశేషం. సోన్‌మార్గ్ వద్ద నిర్మించిన "జెడ్–మోర్ టనెల్, చెనాబ్ రైలు బ్రిడ్జ్"లు మన ఇంజనీరింగ్ నిపుణుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాత్రా – బనిహాల్ ప్రాంతాలను కలిపే 11 కిమీ రైలు మార్గాన్ని సుగమం చేయడానికి రియసీ జిల్లాలో చెనాబ్ నదిపై వంతెన నిర్మాణం పూర్తి అయ్యింది. 359 మీటర్లు లేదా 1,178 అడుగుల ఎత్తున నిర్మింపబడిన 1.3 కిమీ పొడవైన రైలు వంతెన అత్యంత ఎత్తైనదిగా పేర్కొనబడుతున్నది. 120 ఏండ్ల పాటు సేవలందించే సదుద్దేశంతో పదేళ్లలో అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ రైలు వంతెన ఈఫిల్ టవర్ కన్న 35 మీటర్లు అధిక ఎత్తున నిర్మింపబడి రానున్న రేజుల్లో ప్రపంచ పర్యాటకంగా కేంద్రంగా కూడా నిలువనున్నది. ఈ వంతెనలు, సొరంగ మార్గాలు, రోప్‌వేలతో జమ్ము కాశ్మీర్ ప్రాంతం అన్ని సీజన్లలో పర్యాటకుల రాకకు ఆహ్వానాన్ని పలకడంతో పాటు కాశ్మీర్ – లేహ్ కార్గిల్ రవాణా మార్గాల ప్రయాణం తక్కువ సమయంలో సురక్షితంగా పూర్తి చేసుకోవచ్చని తెలుస్తున్నది. రానున్న రోజుల్లో పూర్తి కానున్న 'జోజిలా టనెల్'తో శ్రీనగర్–లేహ్ మధ్య దూరం తగ్గడమే కాకుండా వాహన వేగం గంటకు 30 నుంచి 70 కిమీ వరకు పెరగనుంది.

ఇలాంటి అత్యద్భుత మౌళిక వనరుల కల్పన ద్వారా జె అండ్ కె ప్రాంతం పర్యాటకంగా అనేక రెట్లు పెరగడం, స్థానిక ప్రజల జీవనోపాధులకు ఊపిరిలూదడం, ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి, సామాజిక–సాంస్కృతిక వికాసం జరగడం, సాహసక్రీడలు పెరగడం నిశ్చయంగా జరుగుతుంది. సమీప భవిష్యత్తులో శంకరాచార్య దేవాలయం, శివ్‌కోరి, బల్తాల్–అమర్‌నాథ్, కాత్రా–ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టులు కూడా పూర్తి కానున్నాయి. కాశ్మీర్ నుంచి ఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కూడా నడవనుంది. ఇలాంటి అత్యాధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఇంజనీరింగ్ అద్భుత వంతెనలు, సొరంగాలు, రోప్‌వేలతో జమ్ము–కాశ్మీర్, లేహ్ కార్గిల్ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలని కోరుకుందాం, లోయ ప్రాంతాల రవాణాకు సరికొత్త నిర్వచనం ఇద్దాం.



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## సీఎం ప్రజావాణిలో 285 దరఖాస్తులు



హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 285 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 74, రెవెన్యూ శాఖకు సంబంధించి 27, ఇందిరమ్మ ఇండ్ల కోసం 146, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 36 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

### పాడైన ఎలక్ట్రాన్ వస్తువుల సేకరణకు

## అనూహ్య స్పందన



వుదయం , మేడిపల్లి : బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ఆదేశాల మేరకు సర్కిల్లో సోమ, మంగళ వారాల్లో నిర్వహించిన పాడైన ఎలక్ట్రాన్ వస్తువుల( పాడైన ఫ్రిడ్జ్ లు, టీవీలు, మిక్సీలు, మొబైల్ ఫోన్ లు, చార్జర్ లు, హెయిర్ డ్రైయర్స్, ఇతర విద్యుత్ తో నడిచే వస్తువులు) సేకరణకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది, పీర్జాదిగూడ మేడిపల్లి బోడుప్పల్ చెంగిచెర్ల డివిజన్లోని వార్డ్ ఆఫీసర్లు ప్రతి కాలనీలో తిరుగుతూ పాడైన ఎలక్ట్రానిక్ వస్తువుల గురించి ప్రజలకు వివరిస్తూ, వాటిని ఆరుబయట తగలబెడితే జరిగే అనార్ధం గురించి వారికి వివరించి, వాటిని సేకరించి వాటిని సంచులలో భద్రపరిచి వాటిని నిల్వ కోసం ఏర్పాటు చేసిన పలు సెంటర్లకు తరలించారు. ఈ కార్యక్రమం ఇంతటి విజయవంతం కావడానికి వార్డ్ ఆఫీసర్ల కృషి వెలకట్టలేనిదని సర్కిల్ లోని ప్రజలు ప్రశంసించారు.

## పేట బల్దియా పై కమలం జెండా పక్కా

### 14 వరకే అభ్యర్థుల దరఖాస్తులకు గడువు



వుదయం, నారాయణపేట టౌన్ : నారాయణపేట మున్సిపాలిటీ పై ఈ సారి బిజెపి జెండా ఎగరడం ఖాయమని బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ ధీమా వ్యక్తంచేశారు.మంగళవారం ఆయన పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శులు వడ్డే దత్తు,నక్క సత్యనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ నారాయణపేట పట్టణ మున్సిపాలిటీ ఎన్నికలకు గాను వార్డులలో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేస్తామని ఇప్పటికీ 84 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నెల 14వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని స్పష్టం చేశారు. పోటీ చేయు ఆశావాహులు రేపటి వరకు తమ తమ దరఖాస్తులు సమర్పించగలరని తెలిపారు.

దాదాపు ప్రతి వార్డుకు 34 గురు పార్టీ నుండి పోటీ చేయుటకు ఆసక్తి చూపుతున్నారని పోటీ తీవ్రంగా ఉందన్నారు.ఎన్నికల్లో టికెట్ ఎవరికి వచ్చిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని వార్డు కౌన్సిలర్ గా గెలిపించాలని కోరారు. నారాయణపేట మున్సిపల్ చైర్మన్ గా ఈసారి భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టడానికి పట్టణ ప్రజలు ఆసక్తిగా ఉన్నారనీ అన్నారు. బిజెపి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోబోతుం దని ధీమా వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం, డి.కే. అరుణమ్మ నాయకత్వం లో నారాయణపేట పట్టణాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని పట్టణ ప్రజలను కోరారు.

## యువత క్రీడల్లో రాణించాలి



వుదయం, అందోల్: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో మంగళవారం యువజన క్రీడల్లో రాణించి అద్భుతమైన ప్రతిభను చూపిస్తే గ్రామానికి మంచి గుర్తింపు లభిస్తుందని అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి అన్నారు. గడి పెద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను కొప్పుల శేషారెడ్డి ఘనంగా ప్రారంభించారు.ముందుగా క్రీడాకారులకు అభినందనలు తెలిపి టాస్ వేసి తొలి మ్యాచ్ ను ప్రారంభించారు.అనంతరం బ్యాట్ చేత పట్టి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా శేషారెడ్డి యువతను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరకధృఢతవని క్రమశిక్షణనీ పెంచుతాయని పేర్కొన్నారు.గెలుపు ఓటములు కంటే క్రీడాస్ఫూర్తితో ఆడటం ముఖ్యమని యువతకు సూచించారు. గ్రామంలో ప్రతిభావంతులైన క్రీడకారులను గుర్తించి భవిష్యత్తులో వారికి తనవంతుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ , మాజీ ఎంపీటీసీ విఠల్ రెడ్డి, మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు అఖిలేష్ రెడ్డి, జైపాల్, వార్డు మెంబర్ సత్యనారాయణ, ఆర్గనైజేషన్ ఆజాం, మోహన్, వెంకట్, మల్లేశం, డోల్లారి రాజు గౌడ్, ఉప సర్పంచ్ శ్రీశైలం, వార్డ్ మెంబర్ కిష్టయ్య, రోషన్, నాభి, క్రీడాకారులు నాయకులు కార్యకర్తలు యువకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## నర్సరీలను సందర్శించిన ఎంపీడీఓ



వుదయం, ఊర్కొండ : ఊరుకొండ మండలం ఈరోజు ఊర్కొండపేట, నర్సంపల్లి, గుండ్లగుంటపల్లి గ్రామాల్లోని నర్సరీలను సందర్శించడం జరిగింది. బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయుటకు, నాణ్యమైన విత్తనాలు తెప్పించి నాటుటకు సూచనలు చేయడం జరిగింది. అలాగే గ్రామాల్లో ఉన్న సెగ్రిగేషన్ షేడ్ లలో తడిపొడి చెత్తను వేరుచేసి కంపోస్ట్ ఎరువు తయారు చేయుటకు సూచించడం జరిగింది. ఈ సందర్భనలో గౌరవ సర్పంచులు శ్రీ అబ్దుల్ రషీద్, శ్రీమతి శైలజ, పంచాయతీ కార్యదర్శులు శ్రీ ఇబ్రహీం, కుమారి సాయిరూప, శ్రీ లక్ష్మణ్, ఎంపీఓ, శ్రీ నర్సింహా, ఏపీఓ గార్లు పాల్గొన్నారు. మరియు అందరు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్, టి.ఏ. లతో సమీక్షా సమావేశం నిర్వహించి సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టి, రోడ్లు, మురుగు కాలువలు, కంపచెట్ల తొలగింపు, పిచ్చి మొక్కలు తొలగించడం, త్రాగు నీటి వనరులైన ఓవర్ హెడ్ ట్యాంక్ దగ్గర, కుళాయిల దగ్గర, బ్లీచింగ్ పౌడర్ చల్లుటకు, దోమలు రాకుండా ఫాగ్గింగ్ చేయుటకు సర్పంచుల సహకారంతో తగిన చర్యలు తీసుకొనుటకు సూచనలు చేయడం జరిగింది.



# గ్రేటర్ హైదరాబాద్



### ఉల్లి గడ్డ రైతుల సమస్యలపై

# జియంఆర్ రాస్తారోక





నారాయణఖేడ్, వుదయం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన ఉల్లి గడ్డ రైతులు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు జి యం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మచ్చేందర్ అన్నారు. ఉల్లి పంట సాగు కోసం విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. అయినప్పటికీ రైతులు పండించిన పంటకు సరైన ధర లభించకపోవడంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ఈపరిస్థితి రైతుల జీవనాధారాన్ని పూర్తిగా దెబ్బతీస్తోంది. ఈసమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గం జి యం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మచ్చేందర్ అనంతరం వినతి పత్రం సబ్ కలెక్టర్ సమర్పించడం జరిగింది.

ఈ సందర్భంగా మచ్చేందర్ మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ అంశం కాదని,పూర్తిగా రైతు బతుకు కోసం సాగుతున్న న్యాయమైన పోరాటమని స్పష్టం చేశారు.ఉల్లి విత్తనాల ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయని,కానీ ప్రభుత్వం విత్తనాల ఖర్చులను భరించకపోవడం వల్ల రైతులు అప్పులు చేసి పంట సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్ర అప్పుల భారంలో కూరుకుపోతున్నారని తెలిపారు.

ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి ధరలు తీవ్రంగా పడిపోయాయని, రైతుకు కనీసం క్వింటాలుకు ఏడు వందల ఇరవై రూపాయల ధర కూడా రావడం లేదని పేర్కొన్నారు.ఉల్లి రైతులకు కనీస మద్దతు ధరను క్వింటాలుకు ఏడు వందల ఇరవై రూపాయలుగా ప్రకటించకపోతే ఉల్లి సాగు పూర్తిగా నష్టసాధనంగా మారుతుందని హెచ్చరించారు .ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రైతులు ఉల్లి సాగును వదిలివేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు.

అలాగే ప్రతి మండలంలో ఉల్లి గిట్టుబడి ధర లేకపోవడంతో రైతులకు పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. ఉల్లిగడ్డ నిల్వ చేసే సౌకర్యాలు లేకపోవడంతో రైతులు వెంటనే పంటను అమ్ముకోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని దళారులు అవకాశంగా మార్చుకుని అతి తక్కువ ధరలకు పంటను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతుండగా దళారులు మాత్రమే లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎగుమతులు ప్రారంభిస్తే మార్కెట్లో ధరలు స్థిరపడతాయని, రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఉల్లి కొనుగోలు చేపట్టి రైతును ఆదుకోవాలని, దళారుల దోపిడీకి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని కోరారు. రైతు లేకపోతే సమాజానికి ఆహారం ఉండదని, రైతే దేశానికి పునాది అని గుర్రపు మచ్చేందర్ స్పష్టం చేశారు. రైతు శ్రమకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని తెలిపారు.సబ్ కలెక్టర్ ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని వినమ్రంగా కోరారు.రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే నారాయణఖేడ్ నియోజకవర్గ రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రైతులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటి మాజీ డైరెక్టర్ మారుతి, మాజీ ఎంపీ టీసీ అమ్బురనాయక్, నమిలిమెట్ మాజీ సర్పంచ్ సత్యపాల్ రెడ్డి కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి హన్మంతరావుపేట సర్పంచ్ అంబటి రాజు వివిధ గ్రామాల సర్పంచులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 3 మున్సిపాలిటీ లకు 45కోట్ల బడ్జెట్

### ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్



అలంపూర్, వుదయం ప్రతినిధి: అలంపూర్ నియోజకవర్గ మున్సిపాలిటీలకు 45 కోట్ల బడ్జెట్ ను ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ఏ సంపత్ కుమార్ కేటాయించుకొని వచ్చారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షేక్ శావలి ఆచారి తెలిపారు. అందులో ఐజ మున్సిపాలిటీకి 15 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపు, అదనంగా మరో 5 కోట్లు కేటాయించుకొని వచ్చారు. మీడియా సమావేశంలో మాస్టర్ షేక్షావలి ఆచారి మాట్లాడుతూ ఏఐసీసీ కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సంపత్ కుమార్ ఆదేశానుసారం రాబోవు మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యకర్తల చేత సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాస్టర్ షేక్షావలి ఆచారి మాట్లాడుతూ గడచిన పదేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి కాలరాసి స్వంత లాభాలకి పట్టం కట్టారని విమర్శించారు. ఐజ మున్సిపాలిటీలో గత పదేళ్లుగా జరగని అభివృద్ధిని ఎండగడుతూ నేడు సంపత్ కుమార్ అలంపూర్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలకు 45 కోట్లను తీసుకురావడమే కాకుండా ఐజకు అదనంగా మరో 5 కోట్లను కేటాయిస్తూ మొత్తం 20 కోట్ల రూపాయల బడ్జెట్ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.

ఇప్పటికే గడిచిన 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో ఐజ మున్సిపాలిటీ ఎంతో నష్టపోయింది. ఈ నష్టాన్ని సరిదిద్దుకోవాలంటే రాబోవు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐజ మునిసిపాలిటిపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ఈ సమావేశంలో సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దొడ్డప్ప, ఆర్ శ్రీధర్, ప్రకాష్ గౌడ్, జనార్దన్ రెడ్డి, రాముడు, మద్దిలేటి, మధు కుమార్ మాట్లాడుతూ ఇంతవరకే అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను గెలిపించి నష్టపోయామని తెలిపారు. మన ఐజ పట్టణం అభివృద్ధి జరగాలంటే ఈ ఎన్నికల్లో ఐజ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, మాజీ కౌన్సిలర్లు గిత్తల దేవరాజు, రాణమ్మ , రాజు నారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సులోచనమ్మ, అధికార ప్రతినిధి మైనర్ బాబు, బసవరాజు, దేవేంద్ర, పాండురంగ, తదితర నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి



మక్తల్, వుదయం ప్రతినిధి : మక్తల్ పట్టణం మున్సిపల్ పరిధి లో పలు అభివృద్ధి పనులకు మంత్రి వాకిటి శ్రీహరి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పలు వార్డు లను సందర్శించి నిర్మాణ దశలో ఉన్న పనులను పర్యవేక్షించారు.సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్న కాలనీల్లో మంత్రి పర్యటించి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వారికి వివరించారు. పట్టణంలోని 1,11, 14 వ వార్డ్ లలో 2కోట్ల 50 లక్షల తో చేపట్టిన డ్రైనేజీ, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 26 ఏళ్ళ వయస్సులో మక్తల్ సర్పంచ్ గా ఎన్నికయ్యానని ఎంపీటీసీ గా,జడ్పీటీసీ గా, ఎమ్మెల్యే గా, మంత్రి గా అయ్యానంటే అది మక్తల్ ప్రజల దయతోనే అన్నారు. పీఏసి లో సభ్యునిగా గొప్ప అవకాశం రావడం, ఖమ్మం జిల్లాకి ఇంచార్జి మంత్రి గా ఉండడం కూడా నియోజకవర్గ ప్రజల చొరవ తోనే అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక నేను మంత్రి ని అయిన కొన్ని రోజుల వ్యవధి లోనే 1035 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కస్టమర్ల ఆదరణతోనే ఉన్నత స్థాయికి





అలంపూర్, వుదయం ప్రతినిధి: కస్టమర్ల ఆదరణ ఉంటేనే వ్యాపార సంస్థలు అభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి చేరుకుంటాయని, ఆదాని సిమెంట్ సీఎస్ఓ బాలాజీ రావు పేర్కొన్నారు. డీలర్ శ్రీనివాస ట్రేడర్స్ ఆధ్వర్యంలో మంగళవారం అయిజ పట్టణంలో సబ్ డీలర్లు, తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ సమయంలో తాపీ మేస్త్రీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్మాణానికి నాణ్యమైన మెటీరియల్ వాడాలన్నారు. తాపీ మేస్త్రీల రక్షణ కోసం తమ సంస్థ హెల్మెట్లు, డ్రెస్ కిట్లు అందజేస్తుందని తెలిపారు. ఆదాని కంపెనీ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇండియా లెవెల్ లో నిర్వహించే ధనవర్ష కాంటెస్ట్ లక్కీ డిప్ లో అయిజ శ్రీనివాస ట్రేడర్స్ రూ. 15 లక్షలు క్యాష్ ప్రైజ్ గెలుచుకుందని తెలిపారు. అనంతరం డీలర్ శ్రీనివాస్ రెడ్డి ని కంపెనీ ప్రతినిధులు అభినందించి ప్రైజ్ మనీ చెక్కు అందజేశారు. సబ్ డీలర్లకు మార్కెటింగ్ విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీలర్ శ్రీనివాస్ రెడ్డి, రవి ప్రకాశ్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు మధుకర్ బాబు, సీతారాం, నరేందర్ రెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## భూకబ్జాదారులను కఠినంగా శిక్షించాలి

### అదెల్లి రవీందర్



వుదయం, పటాన్చెరు: పేదల భూములను అక్రమంగా ఆక్రమించే భూకబ్జాదారులను తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పటాన్చెరు నియోజకవర్గ ఇన్చార్జి అదెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. పేదల భూములను భూకబ్జాల నుంచి రక్షించాలని ఆయన అధికారులను కోరారు.

పెద్ద కంజర్ల గ్రామంలో బీజేపీ నాయకులు రవీందర్ యాదవ్ కుటుంబానికి చెందిన సర్వే నంబర్లు 125/101/102లో ఉన్న భూమి గత 50 సంవత్సరాలుగా వారి కబ్జాలో ఉందని, పాసు పుస్తకాలు కూడా కలవని, రైతుబంధు కూడా పొందుతున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ భూమిపై కొంతమంది కబ్జాదారులు కన్నేసి రాత్రికి రాత్రే గుండాలతో కలిసి రాళ్లు పాతి అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

సమాచారం అందుకున్న వెంటనే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్, పటాన్చెరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్త, మండల అధ్యక్షులు వీరేశం, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా కబ్జాదారులు పాతిన రాళ్లను తొలగించారని, అక్కడ పెట్టిన కంకర, ఇసుక మొదలైనవి కూడా కలిచేసి వెళ్లిపోయారని వెల్లడించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ, భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి తక్షణమే కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్, పటాన్చెరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్త, మండల బీజేపీ అధ్యక్షులు వీరేశం, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన ముగ్గుల పోటీలు



వెల్దండ: జనవరి 13 (వు దయం ప్రతినిధి) మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం గ్రామ సర్పంచ్ మూడవత్ శారద హరికిషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిలు పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలో పాల్గొని వేసిన రంగురంగుల ముగ్గులు పలువురుని ఆకర్షించా యి .ప్రథమ బహుమతి మాధ వి శిరీషలకు 5000 నగదు,.ద్వితీయ బహుమతి పూజిత అనిత 3000 .తృతీయ బహుమతిని పల్ల వి నికిత ల 2000 అందజేశారు. పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు సర్పంచ్ మూడ వత్ శార ద హరికిషన్ నాయక్ మాజీ సర్పంచ్ రామచంద్రా రెడ్డి ఉపసర్పంచ్ శైలజ శేఖర్ గౌడ్ లు అంద జేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అరుణ వార్డు సభ్యులు రవీందర్ సోనీ మౌనిక లక్ష్మి శివ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేట మున్సిపాలిటీ బారిలో ఏఐఎంఐఎం



నారాయణపేట, వుదయం ప్రతినిధి: నారాయణపేటలో రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ఏఐఎంఐఎం పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ ఖాదీర్ ముండా ఘర్ తెలిపారు. యునైటెడ్ జిల్లా ఇన్చార్జ్ జనాబ్ జాబర్ బిన్ సయీద్ అల్జబీరీ సాహెబ్ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా మజ్లిస్ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ నారాయణపేట ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణపేట మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో వార్డు నంబర్లు 7, 11, 12, 13, 14, 19, 23, 24లలో ఏఐఎంఐఎం పోటీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికలలో ఏఐఎంఐఎం కి ఏ ఇతర రాజకీయ పార్టీలతోనూ ఎలాంటి పొత్తు (అలయన్స్) లేకుండా పోటీ చేయనున్నట్లు వారు తెలిపారు. పార్టీ తన స్వంత బలంపై నమ్మకంతో స్వతంత్రంగా (ఇండిపెండెంట్గా) ఎన్నికల బరిలో పోటీ చేయనున్నట్లు వార్డు వారీగా టికెట్ల కేటాయింపుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఈనెల 13 నుండి ప్రారంభించినట్లు వారు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా పార్టీ కార్యాలయం దర్గా రోడ్ బహార్పేట్ నారాయణపేటలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తకి చాంద్, షరీఫ్ చాంద్, అజీజ్, మహమ్మద్ చాంద్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు

## ధన్వంతరి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



అలంపూర్ , (వుదయం ప్రతినిధి): అలంపూర్ నియోజకవర్గం ఐజ మండలం ఉత్తనూరు గ్రామంలో జనవరి 21 నుంచి 26 వరకు శ్రీశ్రీశ్రీ ధన్వంతరి వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ పవిత్ర ఉత్సవాలకు అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ విజయుడుని హాజరు కోవాలని ఆహ్వానించారు. ఈ ఆలయం చారిత్రక ప్రాముఖ్యత కలిగినట్టు పురావస్తు ఆధారాలు సూచిస్తున్నాయి.

**ఆహ్వానించిన నాయకులు**

ఉత్తనూరు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహా రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామన్ గౌడ్, బసవ రాజ్, రఘునాథ్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## నేటి నుండి 'అరైవ్ అలైవ్-2026'



అలంపూర్, వుదయం ప్రతినిధి: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్, రవాణా, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా "అరైవ్ అలైవ్ - 2026" పేరిట ఈరోజు నుండి రాష్ట్ర స్థాయి 10 రోజుల రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం ఉండవెల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఉండవెల్లి గ్రామంలో జిల్లా అదనపు ఎస్పీ కె శంకర్ హాజరై గ్రామీణ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా అరేయ్ ఆలైవ్ ప్రోగ్రాం లో భాగమై గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. గద్వాల పట్టణంలోని డీఎస్పీ ఆఫీస్ దగ్గర ఆటో డ్రైవర్లకు, ఇంకా మిగతా వాహన దారులకు, ఈ రెండు ప్రదేశాల్లో ప్రజలకు ఈ రోడ్డు భద్రత నియమాల గురించి క్లుప్తంగా వివరించారు. జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, సీటుబెల్ట్ ప్రాధాన్యత, ఫస్ట్ ఎయిడ్ వినియోగం, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి కూలంకుషంగా వివరించారు. అంతే కాకుండా ప్రమాద బాధిత కుటుంబాలతో పరస్పర చర్చలు, అవగాహన కల్పించి, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని డి.ఎస్పీ మొగిలయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమలలో జిల్లా అదనపు ఎస్పీతో పాటు గద్వాల్ డిఎస్పి వై మొగిలయ్య, అలంపూర్ సర్కిల్ ఆఫీసర్ జి రవిబాబు, గద్వాల్ సర్కిల్ ఆఫీసర్ టంగుటూరి శ్రీను, ఉండవెల్లి ఎస్ఐ ఆర్ శేఖర్, గద్వాల్ టౌన్ ఎస్ఐలు కళ్యాణ్ కుమార్, జహంగీర్, సతీష్ రెడ్డి, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాలచంద్రుడు, పోలీస్ స్టేషన్ సిబ్బంది ట్రాఫిక్ సిబ్బంది, వైద్యాధికారులు, గ్రామాధికారులు, గ్రామస్థులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులు పాల్గొన్నారు.

## బైరన్ దిబ్బలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



అందోల్, వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని బైరన్ దిబ్బ గ్రామంలో సర్పంచ్ వీరన్న ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన వట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ముగ్గులను తిలకించి , మహిళ సోదరీమణులను అభినదించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంబురాలలో మహిళ సోదరీమణులు భాగస్వాములు కావడం అభినందనీయం అని, మన సంస్కృతీ సంప్రదాయాలను, సంక్రాంతి పండుగ విశిష్టత ను నేటి తరం వారికి తెలియచేయడం ఈ ముగ్గుల పోటీ ప్రత్యేకత అని ,సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమని వ్యవసాయం మార్కెట్ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి తెలియజేశారు.సంక్రాంతి వాతావరణం ముందే వచ్చినట్టు కనిపిస్తుందని,సంక్రాంతి పండుగను పల్లె వాతావరణం ను ప్రతిబించేలా ఈ ముగ్గులు ఎంతగానో గొప్పగా వర్ణించారు సంక్రాంతి పర్వదినం ను ప్రతిబించేలా చిత్రపటంతో కూడిన వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని వాటిని వేసిన వారిని ప్రత్యేకంగా అభినదించడం జరిగినది. అదేవిధంగా చూడ చక్కని ముగ్గులు వేయడం చాలా గొప్ప విషయం అని ,ఈసందర్భంగా స్థానిక ప్రజలకు అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించిన బృందాన్ని మరియు మహిళ కమిటీ సభ్యులను వట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో అల్లాదుర్గం సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షురాలు సౌమ్య సురేష్ గౌడ్, సర్పంచ్ వీరన్న, జైపాల్, విశ్వేశ్వర్, చెన్నప్ప, పాపయ్య, బక్కన్న, అంజయ్య, శ్రీకాంత్, నర్సింలు, స్వరూప, వీరమని, నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి

## శిరోధారం... ప్రాణ దారం మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్

**(వుదయం ప్రతినిధి) పాపన్న పేట జనవరి:13**




రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలనిమెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అర్రైవ్ అ లీవ్" కార్యక్రమం ద్వారా ప్రజలకు రోడ్డు భద్రత, నియమాలు, నిబంధనల పై నేటి నుండి పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్న తలంపుతో చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రమైన పాపన్న పేట గ్రామ పంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్టు ఉపయోగించకపోవడంవల్లజరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారుడు ప్రతి పౌరుడు బాధ్యతగావ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చునని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రాంగ్ రూట్లో నడపకూడదని తెలియజేశారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించొద్దని, సెల్ ఫోన్ లో ఇతరులతో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. చలికాలంలో మంచు కారణంగా ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ జార్జ్, పాపన్న పేట ,ఉప సర్పంచ్ సద్దాం హుసేన్, మాజీ ఉప సర్పంచ్ ఖలీం, వార్డు సభ్యులు, పోలీసు సిబ్బంది, వాహన చోదకులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

**నాగర్ కర్నూల్ జనవరి 13**

**(వుదయం ప్రతినిధి)**



జిల్లాలోనితాడూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో భాగంగా ఎద్దుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ రైతుల పండుగ అని, రైతుల శ్రమ ఫలించిన ఆనందాన్ని ప్రతిబింబించేదే ఈ సంబరాలు అని అన్నారు. గ్రామీణ క్రీడలు, సంప్రదాయ కార్యక్రమాలు మన సంస్కృతికి ప్రతీకలని, వీటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వ్యవసాయ రంగాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తూ రైతులను ఆదుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రైతుల్లో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా గ్రామీణ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు గారు,సర్పంచ్ సంధ మల్లయ్య గారు , కౌన్సిలర్స్ , ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, రైతులు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం

**వెల్దండ జనవరి 13 (వుదయం ప్రతినిధి)**



ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని డివిజన్ ఉద్యాన వన శాఖ అధికారి మహేశ్వరి పేర్కొన్నారు మంగళవారం ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో వెల్దండ మండలంలోని కంటోనిపల్లి గ్రామంలో వర్షాధార ప్రాంతం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు తేనెటీగల పెంపకం పై మరియు కూరగాయల సాగులో మెలుకువలు కొత్త పద్ధతులు పాటిస్తూ రైతు యొక్క దిగుబడిని మరియు ఆదాయాన్ని పెంచడంలో భాగంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు. ఈ పథకంలో ఒక్కో రైతుకి కూరగాయల నారు ఎరువుల ఖర్చుకు కూలి ఖర్చులకు కలిపి పదివేల రూపాయలు రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. మరియు ఒక్కో రైతుకు 18 కూరగాయల బుట్టలు, రెండు తేనె పెట్టెలు మరియు రెండు వర్మి బెడ్స్ అందజేసినట్లు తేనెటీగల ద్వారా పంట దిగుబడి మరియు తేనె విక్రయం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు .వ్యవసాయంలో తేనెటీగలు కీలకపాత్ర పోషిస్తాయి ఇవి పరాగసంపర్కం ద్వారా పంటల దిగుబడి నాణ్యతను గణనీయంగా పెంచుతాయి. అలాగే తేనె ఉత్పత్తి ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారువ్యవసాయంలో పాడి పంట రెండు ఉండాలని పశువుల పెంపకం వల్ల రైతులు ఎరువులు తయారు చేసుకోవచ్చు ఆగ్రో ఫారెస్ట్రీ వల్ల కూడా రైతులకు ఎంతో ఉపయోగాలు ఉన్నాయని పాత పద్ధతుల్లో వ్యవసాయం చేసే విధానం అలవర్చుకోవాలని పురుగుమందులు, ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరి డివిజన్ ఉద్యాన శాఖ అధికారి, డాక్టర్ ఆదిశంకర్ ఉద్యాన శాఖ సైంటిస్ట్, వెలుగు రమేష్ (మాస్టర్ ట్రైనర్ ఇన్ ఎపి కల్చర్), శివలీల, సర్పంచ్ మమత లక్ష్మణ స్వామి, సురేందర్ శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

# ఊట్కూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు...

## గెలుపొందిన అభ్యర్థులకు బహుమతుల అందజేత

**వుదయం, నల్లగొండ జిల్లా:**



విశ్వహిందూ పరిషత్ (మాతృ శక్తి–దుర్గా వాహిని) నకిరేకల్ అఖండ పి మన్మధరెడ్డి గంజి కల్పన హరితల సహకారంతో పాటు పన్ను చెల్లింపుదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని ఊట్కూరు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శివాంజనేయ స్వామి గుడి ఆవరణంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామ ప్రజల విస్తృత భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిశాయి. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మకతను, సంప్రదాయాలపై ఉన్న అభిమానాన్ని రంగుల ముగ్గుల ద్వారా చాటారు.ఈ పోటీలు సంక్రాంతి పండుగకు మరింత శోభను చేకూర్చడమే కాకుండా గ్రామంలో ఐక్యతను, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయని నిర్వాహకులు తెలిపారు.ముగ్గుల పోటీల్లోమొదటి బహుమతి – కప్పల పద్మ,రెండో బహుమతి – గుండ్ల దివ్య,మూడో బహుమతి – పిట్టల అశ్వినివిజేతలుగా నిలిచారు. విజేతలకు గ్రామ ప్రజల తరపున అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, సహకరించిన గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక సహకారం అందించిన విశ్వ హిందూ పరిషత్‌కు, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన పన్ను చెల్లింపుదారుల హక్కుల సంఘానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతి పరిరక్షణతో పాటు, ప్రజల మధ్య ఐక్యతను మరింత బలపరుస్తాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం

**మంథని, జనవరి 13:**




మంథని మండలం పోతారం గ్రామంలో ఎడ్ల వెంకటమ్మ స్మారక ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం పోతారం మాజీ సర్పంచ్ ఎడ్ల శ్రీలత, మాజీ ఎంపీటీసీ ఎడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలకు అనుహ్య స్పందన లభించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు రావడంతో పోటీల్లో యువతులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటా పోటీగా వేసిన ముగ్గులు పరువురిని ఆకట్టుకున్నాయి. సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ముగ్గులు వేసిన మహిళలకు, పోటీల్లో గెలుపొందిన సౌతాకరి కీర్తి, దాసరి లక్ష్మి , కారంగుల రమాదేవి, దాసరి హేమలతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు తోపాటు ప్రోత్సాహక బహుమతులు, నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొట్టమొదటిసారిగా ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళల్లో చైతన్య స్ఫూర్తిని నింపేలా కృషిచేసిన నిర్వాహకులు ఎడ్ల సంతోష్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోతారం సర్పంచ్ ఎడ్ల ఆదిత్య, ఉపసర్పంచ్ దాసరి వెంకటస్వామి, నాగారం సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తంగిలో ముగ్గుల పోటీలకు హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్

**సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు**



ముత్తంగి డివిజన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సీనియర్ నాయకులు ఆబేద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి.. అత్యుత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి ఎం ఆర్ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం పట్ల ఆబేద్ ను అభినందించారు. బహుమతులు గెలుచుకున్న విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

**నారాయణపేట టౌన్ జనవరి 13( వుదయం ప్రతినిధి)**



108 అంబులెన్స్లో మహిళ ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సిబ్బంది తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన నాగేశ్వరికి మంగళవారం తెల్లవారు జాము పురిటి నొప్పులు రావడంతో దామరగిద్ద 108అంబులెన్స్ కి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో గడ్డి మున్కన్ పల్లి గ్రామ సమీపంలో అంబులెన్స్ లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ లో ప్రథమ చికిత్స అందించిన 108 సిబ్బంది ఈఎంటి మహమ్మద్ తాజుద్దీన్, పైలట్ రాజు సకాలంలో తగిన చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర వైద్యులు పరిశీలించిన తర్వాత తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు. అంబులెన్స్ సిబ్బందిని వారు అభినందించారు.

# ఉచిత కరెంటు పై అధికారుల కరపత్రాల ప్రచారం

**నారాయణపేట టౌన్ జనవరి 13 వుదయం ప్రతినిధి)**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత కరెంట్ గృహ జ్యోతి పతాకంపై విద్యుత్ అధికారులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో కరపత్రాలు పంచుతూ 2 వందల యూనిట్ల వరకు ఇళ్లకు ఉచిత కరెంట్,రైతు సంక్షేమానికి నాణ్యమై విద్యుత్తు సరఫరా చేస్తున్నామని తెలుపుతూ ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం అన్న అంచలంచల విశ్వాసంతో పని చేస్తున్న రైతు ప్రభుత్వం అని వివరిస్తున్నారు. రైతాంగం వ్యవసాయం రంగంలో అభివృద్ధి బలోపితం చేసే ప్రజాహికా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగించేందుకు కట్టుబడే ఉన్నామనివిద్యుత్ అధికారులు స్థానిక ఏ ఈ మహేష్ గౌడ్ లైన్మెన్ నరహరి గౌడ్, లైన్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఆర్టిజెన్ ఎండి పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ నవనీత, బి కే ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది పరిషత్ క్యాలండర్ ఆవిష్కరించిన నామాజీ

**నారాయణపేట జనవరి 13 వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా కేంద్రం లోనీ తన నివాసంలో మంగళవారం బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు, సీనియర్ న్యాయవాది నాగురావు నామాజీ న్యాయవాది పరిషత్ నూతన కాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన న్యాయవాదులకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్,కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్, సహాయ న్యాయవాది బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ, కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది కుర్మన్న గౌడ్,న్యాయవాదులు ప్రహ్లాద్ గౌడ్, భీం రెడ్డి, కృష్ణ, నర్సింహులు, వినోద్, ప్రవీణ్ నామాజీ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మట్టా

**సత్తుపల్లి జనవరి 13 (వుదయం ప్రతినిధి)**



సత్తుపల్లి మున్సిపల్ లోని బైపాస్ రోడ్డు 20 వ వార్డు లో మరియు అయ్యగారి పేట యెహోవా చర్చ్ వద్ద డ్రైనేజీ మరియు సప్త పనులకు సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ శంకుస్థాపనలు చేశారు....సత్తుపల్లి మండలం సదాశివుని పాలెం గ్రామంలో సంక్రాతి పండుగ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు పోటీల కార్యక్రమంలో పాల్గొని ముగ్గులు విక్షించి, ప్రజలు అందరికి సంక్రాతి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన మహిళలకు రాగమయి డాక్టర్ మట్టా దయానంద్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ నరసింహారావు ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు చల్లగుళ్ళ కృష్ణయ్య కమల్ పాషా గాదె చెన్నారావు కార్యకర్తలు, మహిళా, యూత్, నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

**ములుగు, జనవరి 13 (వుదయం ప్రతినిధి):**

సామాజిక న్యాయ వేదిక క్యాలెండర్ ములుగు జిల్లా కేంద్రం లో ఆవిష్కరించారు.ములుగు జిల్లా సంక్షేమ భవన్ లో సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షులు బాణాల ప్రభాకర్ అధ్యక్షతన ములుగు జిల్లా బిసి సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ తో కలిసి క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. సామాన్య ప్రజల కోసం సామాజిక న్యాయ వేదిక పని చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసానీ రామ్మూర్తి, నలువాల నర్సయ్య, అజ్మీరా మంజి నాయక్ లంబాడి న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షులు శ్యామ్ నాయక్ దండోరా న్యాయ వేదిక జిల్లా అధ్యక్షులు యాకన్న మాదిగ కళాకారులు సామల్ నాయక్ విజయ్ బాలాజీ (బబ్లూ) యాద వ్ల తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారుసామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా సామాజిక తెలంగాణ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని ప్రభాకర్ తెలిపారు.

# కార్మికుడి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే జిఎంఆర్..

**సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు**



రెండు నెలల క్రితం పరిశ్రమలో ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని రాణే డై కాస్టింగ్ పరిశ్రమంలో రెండు నెలల క్రితం జరిగిన ప్రమాదంలో కృష్ణ సింగ్ అనే కార్మికుడు మృతి చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే కార్మికుడు మృతి చెందాడని.. మెరుగైన నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. ఇందుకు అనుగుణంగా పరిశ్రమ యాజమాన్యం 20 లక్షల రూపాయల నష్టపరిహారం అందించేందుకు అంగీకరించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు నష్టపరిహారానికి సంబంధించిన 15 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు. మరో ఐదు లక్షల రూపాయలు అతి త్వరలో అందజేయనున్నట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కార్మికుల సంక్షేమం ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సంజయ్ సింగ్, సునీల్ సింగ్, ప్రిన్స్, టీంకు, తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

## ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ జనవరి 13**

**(వుదయం ప్రతినిధి)**



బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బాలసదన్ భవనం నిర్మాణం ద్వారా అనాధ మరియు ఆశ్రయం లేని పిల్లలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు పట్టణ పరిధిలోని ఎండబెట్ల ప్రాంతంలో ₹1.5 కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా మంజూరు అయిన బాలసదన్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, బాలల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, బాలసదన్ భవనం నిర్మాణం ద్వారా అనాధ మరియు ఆశ్రయం లేని పిల్లలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఆధునిక వసతులతో ఈ భవనం నిర్మాణం జరగడం వల్ల పిల్లల భవిష్యత్తు మరింత భద్రమవుతుందని తెలిపారు.అభివృద్ధి పనుల్లో భాగంగా నాగర్‌కర్నూల్ పట్టణంలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మాజీ కౌన్సిలర్స్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకు లు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానికప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 4వ,రోజు మోకాళ్ల పై రిలే నిరాహార దీక్ష

**ఊర్కొండ న్యూస్ 13 వుదయం ప్రతినిధి**




ఊరుకొండ మండలాన్ని కల్వకుర్తి రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలి – కల్వకుర్తి తాలూకాను నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలి –ఊరుకొండ మండలం పట్ల(M.LA)అనిరుద్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను వెనుకకు తీసుకోవాలి పై మూడు ప్రధాన విషయాలపై ఉర్కొండ JAC 4 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తుంది మండలంలో ఉన్న ప్రజలందరూ ఈ ఉద్యమంలో కలిసి రావాలని jac పిలుపునిస్తుంది ఈ రిలే దీక్షలు వాగుల్ దాస్ నిరంజన్ గౌడ్ జిల్లా ఓబీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నావి ఈరోజు 4 వ రోజుకు రిలే నిరాహార దీక్ష చేరుకున్న సందర్భంగా jac నాయకులు కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్లోనే ఊరుకొండ మండలం ఉండాలి కల్వకుర్తి తాలూకాను జిల్లాగా ఏర్పాటు చేయాలని వారు మాట్లాడడం జరిగింది . దీనిపైన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గారు అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన మాటలను వాపస్ తీసుకోవాలని మాట్లాడడం జరిగింది. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఇంకా తీవ్రతరం చేస్తామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి తాలూకా జేఏసీ చైర్మన్ కానుగుల జంగయ్య గారు, MRPS జిల్లా అధ్యక్షుడు రాజు ,తాడెం చిన్న గారు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు బోలె జగన్, బోల్గాం నరేందర్ గౌడ్,బీసీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ, తెలంగాణ ఉద్యమకారుడు బొజ్జయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ ఆలకుంట వెంకటేష్. పరశురాములు ,దుబ్బ రాములు మాదిగ, బచ్చల కూర మల్లేష్,బుడుమ జంగయ్య, పయ్యావుల జంగయ్య పత్రిక విలేకరులు, బండారి శివుడు, డాన్ శివ, కటికం ఆనంద్ గౌడ్, రాజునారంరెడ్డి, కటికం చిన్నబాలకిష్టయ్య గార్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ల్యాండ్ సర్వే అధికారి (AD) కి వినతిపత్రం అందజేత

**జైపూర్ జనవరి 13(వుదయం విలేకరి)**



తెలంగాణ సర్వే అకాడమీ నుండి శిక్షణ పొందిన పాత లైసెన్స్ సర్వేయర్స్ జిల్లా అధికారి వి. శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి అమలులో భాగంగా లైసెన్స్ సర్వేయర్స్ సేవలు వినియోగించుకోవడం కోసం సిద్ధమైన విషయం వీధితమే. ఈ విషయంలో భాగంగా స్పెల్ –1 శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్స్ తో పాటు కొద్దిమంది పాత లైసెన్స్ సర్వేయర్స్ కి మండలాలు కేటాయించడం జరిగింది. ఇంకా చాలా మందికి లైసెన్స్ ఉండి ప్రయివేట్ గా సర్వే పనులు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, మా అందరికి కూడా మండల్ అలాట్మెంట్ చేయాలనీ కోరగా వారు సానుకూలంగా స్పందిస్తూ తదుపరి లిస్ట్ లో తప్పకుండా అవకాశం కలిపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ లైసెన్స్ సర్వేయర్స్ సదయ్య, సుధాకర్,మల్లేష్,లక్ష్మణ్, మేరాజ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# కోరమీసాల వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి క్రుషి చేస్తా

## కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న బండి సంజయ్

**హుస్నాబాద్, జనవరి,13(వుదయం ప్రతినిధి)**



కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా క్రుషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు స్థానిక బీజేపీ నేతలు కోలాటాలు, డప్పులతో ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్దకు రాగానే టెంపుల్ నిర్వాహకులు, పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన బండి సంజయ్ అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు. ప్రక్రుతితో ముడిపడిన ఈ పండుగను తెలుగు ప్రజలందరూ సంతోషంగా, సంబురంగా జరుపుకుంటాం. విదేశీ సంస్క్రుతికి అలవాటుపడి మన సంస్క్రుతిని మర్చిపోతున్న ఈ తరుణంలో ముగ్గుల పోటీలు, సంక్రాంతి పోటీలు నిర్వహిస్తూ తెలుగు సంస్క్రుతి, సాంప్రదాయాలను గుర్తు చేయడం చాలా ఆనందంగా ఉంది.కొత్తకొండ వీరభద్రస్వామి స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏటా రావడం ఆనవాయితీ. అందులో భాగంగా ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్న. కోరిన కోర్కెలు తీర్చే కోరమీసాల స్వామి వీరభద్రుడు. చాలా సందర్భాల్లో ఇవి నిరూపితమైంది. కోర మీసాల స్వామి కాబట్టి సమాజాన్ని నాశనం చేయాలనుకునేవాళ్లకు, చెడు ఆలోచనలు ఉన్న వాళ్లలో మార్పు తీసుకొచ్చే స్వామి వీరభద్రుడు. ఈ జిల్లా, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నా. అందరం కలిసి నరేంద్రమోదీ సంకల్పంతో భారత్ ను విశ్వగురుగా తీర్చిదిద్దేందుకు వికసిత్ భారత్ పేరిట శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారు. ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ మోదీకి అండగా నిలవాలని కోరుకున్నా. ఉభయ తెలుగు రాష్ట్రాల తోపాటు మహారాష్ట్ర, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు వస్తుంటారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తూనే ఉన్నా... భవిష్యత్తులో దేవాలయ అభివృద్ధికి నా వంతు క్రుషి చేస్తా.అని అన్నారు.

# ఇండియన్ ఆర్మీ సిద్ధం

- 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోంది
- నియంత్రణలోనే జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు
- ఈశాన్య రాష్ట్రాలల్లోనూ పరిస్థితులు స్థిరం
- భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



**న్యూ ఢిల్లీ :** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలు లక్ష్యంగా గత ఏడాది చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోందని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా సమర్థవంతంగా తిప్పికొడతామని హెచ్చరించారు. 2026లో తొలిసారి ద్వివేది మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పాకిస్థాన్ ఎలాంటి పొరపాట్లు చేసిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇండియన్ ఆర్మీ మోహరించిన బలగాలు భూతల దాడులు చేసేందుకు కూడా సన్నద్ధంగా ఉన్నా యని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని నౌషెరా–రాజౌరి సెక్టార్‌లో తాజాగా పాకి స్థాన్ వైపు నుంచి వచ్చిన డ్రోన్‌ల సంచారాన్ని గుర్తించడంపై మాట్లా డుతూ, ఈ అంశం మంగళవారం నాడు పాకిస్థాన్‌తో డీజీఎంఓ స్థాయిలో ప్రస్తావనకు వచ్చిందని, పాక్‌ను కంట్రోల్‌లో ఉండాల్సిందిగా చెప్పామని అన్నారు. ఎలాంటి పరిస్థితులైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షిపణి, రాకెట్ ఫోర్స్‌ను ఇండియన్ ఆర్మీ సిద్ధం చేస్తోందన్నారు. జమ్మూకశ్మీర్‌లో జనవరి 10న సుమారు ఆరు డ్రో న్‌లు, జనవరి 11,12 తేదీల్లో రెండు నుంచి మూడు డ్రోన్‌లు కనిపించాయని చెప్పారు. అవి చాలా చిన్న డ్రోన్‌లని, లైట్లు వెలుగుతూ తక్కు వ ఎత్తులో ఎగురుతున్నాయని, డిఫెన్సివ్ డ్రోన్‌లు కావచ్చని అన్నారు.

జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగా ఉన్నా ప్రస్తు తం అవి నియంత్రణలోనే ఉన్నాయని, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల్లోనూ పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని ద్వివేది చెప్పారు. ఇదే సమ యంలో జమ్మూకశ్మీర్‌లో 2025లో మొత్తం 31 మంది ఉగ్రవాదులను హతమార్చామని, వారిలో 65 శాతం మంది పాకిస్థాన్ సంతతి వారేనని తెలిపారు. వీరిలో ఆపరేషన్ మహాదేవ్ సమయంలో పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు నిందితులు కూడా ఉన్నారని తెలిపారు. ఉగ్రవాద శ్రేణుల్లోకి కొత్తగా నియామకాలు దాదాపు లేవన్నారు. 2025లో కేవలం రెండే కేసులు ఉన్నాయని చెప్పారు. 'ఎనిమిది ఉగ్రవాద శిబిరాలు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయి. వీటిలో రెండు అంతర్జాతీయ సరిహద్దుకు ఎదురుగా, ఆరు నియంత్రణ రేఖ వెంబడి ఉన్నాయి. ఎలాంటి కదలికలు కానీ శిక్షణా కార్యకలాపాలు కానీ ఉన్నట్టు గుర్తించినట్లయితే అవసరమైన ఏ చర్యనైనా తీసుకుంటాం' అని ద్వివేది చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో 88 గంటల పాటు సైన్యం అత్యంత సమర్థవంతంగా పనిచేసిందనిన్నారు. కవ్వింపు చర్చలకు దిగితే కచ్చితంగా పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని పాక్‌ను హెచ్చరించారు.

# తమిళ సంస్కృతిపై కేంద్రం దాడి

**ప్రధాని మోదీపై విమర్శలు**

- విజయ్ సినిమా వాయిదాపై స్పందించిన రాహుల్
- 'జన నాయగన్' అడ్డుకోవడంపై విపక్ష కాంగ్రెస్ నేత ట్వీట్..





**చెన్నై :** తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రం సెన్సార్‌కు నోచుకోకుండా వాయిదా పడటంతో తమిళనాట రాజకీయ దుమారం రేగుతోంది. దీనిపై లోక్‌సభలో విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒక ట్వీట్‌లో స్పందించారు. తమిళ సంస్కృతిపై కేంద్రం దాడి జరుపుతోందని విమర్శించారు. 'జన నాయగన్' సినిమాను అడ్డుకోవడం ద్వారా తమిళ సంస్కృతిపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ దాడి చేస్తోందని రాహుల్ విమర్శించారు. తమిళ ప్రజల వాణిని అణిచివేయాలని మోదీ చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావని అన్నారు. పొంగల్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జనవరి 9న 'జననాయగన్' విడుదల కావాల్సి ఉంది. అయితే సెన్సార్ చిక్కుల వల్ల సినిమా వాయిదా పడింది. దీనిపై కోర్టులను ఆశ్రయించినప్పటికీ విడుదలలో జాప్యం తలెత్తింది. అయితే సర్టిఫికేషన్ నిబంధనల పేరుతో కేంద్ర సమాచార, ప్రచార శాఖ సినిమా క్లియరెన్స్‌ను అడ్డుకుందనే ప్రచారం జరుగుతోంది. సామాజిక న్యాయం, రాజకీయ జవాబుదారీతనం, మాస్ లీడర్‌షిప్ వంటి ప్రధాన అంశాలతో పాటు తమిళ రాజకీయ చరిత్ర, సాంస్కృతిక నేపథ్యంతో 'జన నాయగన్' రూపొందినట్టు ప్రచారం జరగడంతో సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో ఉత్సుకత నెలకొంది. అయితే సినిమా సెన్సార్ చిక్కుల్లో పడటంపై విపక్ష నేతలు, తమిళ సినీ పరిశ్రమ వర్గాలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కానీ, సాంస్కృతిక అణిచివేత ఆరోపణలపై కానీ కేంద్రం ఇంతవరకూ స్పందించలేదు. అయితే 'జననాయగన్' సినిమాపై తీసుకునే ఎలాంటి చర్యలైనా సినిమాటోగ్రఫీ చట్టం, సర్టిఫికేషన్ గైడ్‌లైన్స్ కింద అమలులో ఉన్న చట్టాలు, రెగ్యులేటరీ విధానాలకు లోబడే ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# షక్స్‌గామ్ వ్యాలీ భారత్‌లో భాగమే

**పాక్-చైనా ఒప్పందం చెల్లదు..**

- ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం..
- చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం

**చైనా వాదనను మరోసారి తిప్పికొట్టిన భారత్**



**న్యూఢిల్లీ :** వివాదాస్పద షక్స్‌గామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వివాదంపై స్పందించారు. ''షక్స్‌గామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా–పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం'' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు.

షక్స్‌గామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ''పాకిస్థాన్–చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్స్‌గామ్ వ్యాలీ మా దేశంలో భాగమే'' అని స్పష్టం చేసింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది.

### అసలేంటీ షక్స్‌గామ్ వ్యాలీ..?

షక్స్‌గామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్ర్యం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనిని చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా–పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.

**జాతీయం అంతర్జాతీయం**

### భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు

**జమ్ము కాశ్మీర్ :** కథువా జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం నుంచి భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్ కౌంటర్ కొనసాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన జైష్–ఎ–మహమ్మద్ ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఆర్మీ, సీఆర్పీపీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీసు ప్రత్యేక బృందం సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం నజోట్ అటవీ ప్రాంతంలో ఈ కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ అటవీ ప్రాంతంలో ఇద్దరు లేదా ముగ్గురు ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి.

# ప్రతి కుక్క కాటుకు పరిహారం చెల్లించాల్సిందే

- మోటార్‌సైకిల్ నడిపిన ముఖ్యమంత్రి
- మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర



**నాగపూర్:** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ నాగపూర్‌లో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య మోటారుసైకిల్ నడుపుతూ సీఎం సందడి చేశారు. భారత్ మాతా చౌక్ నుంచి ప్రారంభమైన ఈ రోడ్‌షో మహల్ ఏరియాలోని శివాజీ విగ్రహం వరకూ సాగింది.

బీజేపీ రోడ్‌షో సందర్భంగా బడ్కాస్ చౌక్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ చౌక్ నుంచి 200 మీటర్ల దూరంలో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉంది. ముఖ్యమంత్రి రోడ్‌షోకు ముందు ఇదే మార్గంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కాన్వాయ్ కూడా వెళ్లింది. రోడ్‌షో మార్గంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, తదితర సీనియర్ నేతల పోస్టర్లు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

### ముంబై మేయర్ పదవి బీజేపీకే..

రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలోనూ మహాయుతి కుటమి విజయం సాధించనుందని, ముంబై మేయర్ పదవిని తమ కూటమి చేపడుతుందని దేవేంద్ర ఫడ్నవిస్ ఈ సందర్భంగా తెలిపారు. బీజేపీ చేపట్టిన పనులు, ప్రగతిని నాగపూర్ ప్రజలు చూశారని, గతంలో విపక్షాలు కేవలం మాటలకే పరిమితమై ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని అన్నారు. బీఎంసీ సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లలో ఈనెల 15న పోలింగ్ జరుగుతుంది. 16న ఫలితాలు వెలువడతాయి.

## ఇరాన్‌లో ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు

**ఇరాన్ ప్రభుత్వం బల ప్రదర్శన**

- ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద గుమిగూడిన ప్రదర్శనకారులు
- దృశ్యాలను ప్రసారం చేసిన అధికారిక మీడియా



**టెహ్రాన్ :** ఇరాన్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు మొదలయ్యాయి. తమ బలాన్ని ప్రదర్శించేందుకు ఇరాన్ ప్రభుత్వం సోమవారం లక్షల మంది ప్రభుత్వ మద్దతుదారులను వీధుల్లోకి సమీకరించింది. టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ వద్ద వేల మంది ప్రదర్శనకారులు గుమిగూడారు. దేశాధ్యక్షుడు పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తదితరులూ ఇందులో భాగమయ్యారు. జాహెదాన్, కెర్మన్, రష్త్ తదితర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలను ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. 'అమెరికన్– ఇజ్రాయెల్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇరాన్ తిరుగుబాటు'గా ఈ ప్రదర్శనలను పేర్కొంది. తమ దేశంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని అబ్బాస్ అరాఘ్చి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

### బయటకు వెళ్లొద్దు..: విక్రమ్ మిస్రీ

ఇరాన్ పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ''ఇరాన్‌లో ప్రవాస భారతీయులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. స్థానికంగా ఆంక్షలు ఉన్నప్పటికీ.. రాయబార కార్యాలయం విద్యార్థులను సంప్రదించగలిగింది. వారందరూ క్షేమంగా ఉన్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని గుర్తించింది. భారత పౌరులు బయటకు వెళ్లొద్దని, అల్లర్లలో చిక్కుకోవద్దని సలహా ఇచ్చాం'' అని మీడియా సమావేశంలో చెప్పారు.

## లక్ష మందికి పైగా వీసాల రద్దు!

- నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించం
- దేశ భద్రత, పౌరుల రక్షణే ప్రధానం
- స్పష్టం చేసిన డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన కఠిన వలస విధానాలతో మరో సంచలనానికి తెరలేపారు. 2025 సంవత్సరంలో అమెరికా విదేశాంగ శాఖ ఏకంగా లక్షకు పైగా విదేశీయుల వీసాలను రద్దు చేసినట్లు ప్రకటించింది. 2024తో పోలిస్తే ఈ సంఖ్య 150 శాతం అధికం కావడం గమనార్హం. దేశ భద్రత, పౌరుల రక్షణే తమకు ప్రధానమని, నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. రద్దయిన వీసాలలో సుమారు 8,000 మంది విద్యార్థులు, 2,500 మంది ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఉద్యోగులు (హెచ్–1బీ వంటివి) ఉన్నారు. డ్రంకెన్ డ్రైవ్, దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడటం, వీసా గడువు ముగిసినా దేశంలోనే అక్రమంగా నివసించడం వంటి కారణాలతోనే ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు సర్కారు వెల్లడించింది. ముఖ్యంగా ఉద్యోగుల వీసాల రద్దులో 50% కేసులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లేనని గణాంకాలు చెబుతున్నాయి. విదేశీయుల కదలికలపై నిఘా ఉంచేందుకు 'కంటిన్యూయస్ వెట్టింగ్ సెంటర్' అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇది సోషల్ మీడియా పోస్టులను కూడా పరిశీలిస్తోంది. అమెరికా చట్టాలను గౌరవించని వారిని దేశం నుంచి పంపించి వేయడమే లక్ష్యంగా ఈ చర్యలు కొనసాగుతాయని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

## ఆందోళనలో వందలు కాదు.. వేలాది మంది మృతి?

- ఇరాన్‌కు చెందిన ఓ వెబ్‌సైట్ సంచలన కథనం
- ఆందోళన వ్యక్తం చేసిన యూఎన్ఓ మానవ హక్కుల సంఘం



**టెహ్రాన్ :** ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం రాగా.. ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని యూఎన్ఓ మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది.

### మరణశిక్ష భయం..?

దేశవ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమీ లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు.

### కనీవినీ ఎరుగని హింస..!

దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది.

## టెక్నాలజీ రంగంలో గూగుల్‌కు గుత్తాధిపత్యం

**యాపిల్-గూగుల్ మధ్య బిగ్ ఏఐ డీల్‌పై ఎలాన్ మస్క్ ఆందోళన**



**వాషింగ్టన్ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో రెండు బిగ్ టెక్ కంపెనీలు గూగుల్, యాపిల్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. యాపిల్ అభివృద్ధి చేస్తున్న 'ఫౌండేషన్ మోడల్స్' (యాపిల్ ఇంటెలిజెన్స్) ఇకపై గూగుల్ జెమినై ఏఐ మోడల్స్‌తో పనిచేయనున్నాయి. ఇందుకు గూగుల్ క్లౌడ్ టెక్నాలజీని యాపిల్ వినియోగించుకోనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు దీర్ఘకాలిక ఒప్పందాన్ని ప్రకటించాయి. దీనిపై ఎలాన్ మస్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. టెక్నాలజీ రంగంలో గూగుల్‌కు గుత్తాధిపత్యం లభిస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ఏఐ రేసులో వెనకబడిపోయాయన్న అపవాదు వేళ.. గూగుల్, యాపిల్ మధ్య ఈ ఒప్పందం కుదరడం గమనార్హం. ఈ ఒప్పందం ప్రకారం.. యాపిల్ మోడళ్లు జెమినై మోడళ్లు, క్లౌడ్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తాయి. దీనివల్ల యాపిల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిరి మరింత మెరుగవ్వనుంది. అంటే యాపిల్ సిరి మరింత శక్తిమంతం కానుంది. ఇరు సంస్థల మధ్య ఈ మేరకు మల్టీ ఇయర్ ఒప్పందం కుదిరింది. యాపిల్ గోప్యతా ప్రమాణాలు కొనసాగుతాయి. అంటే డేటా గూగుల్‌కు ఇవ్వరు. ప్రాసెసింగ్ మొత్తం యాపిల్ డివైజులు, ప్రైవేట్ క్లౌడ్‌లోనే జరుగుతుందని యాపిల్ పేర్కొంది.

### ఆండ్రాయిడ్, క్రోమ్‌లానే..

ఈ డీల్‌పై ఎక్స్ ఏఐ (గ్రోక్) అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. గూగుల్ ఇప్పటికే ఆండ్రాయిడ్, క్రోమ్ ద్వారా టెక్నాలజీ రంగాన్ని నియంత్రిస్తోందన్నారు. తాజా ఒప్పందం వల్ల మరింత గుత్తాధిపత్యం సంక్రమిస్తుందన్నారు. ఓ రకంగా ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్‌కు కూడా ఈ ఒప్పందం ఎదురుదెబ్బగా టెక్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదే యాపిల్ సంస్థ గతంలో ఓపెన్‌ఏఐతో జట్టు కట్టినప్పుడు ఇదే తరహా ఆందోళన వెలిబుచ్చారు. సిరి, ఇతర యాపిల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌లో చాట్‌జీపీటీని ఆప్షనల్ ఫీచర్‌గా ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకించారు. యాపిల్ విధానాలు ప్రత్యర్థుల ఎదుగుదలకు అవరోధంగా మారుతున్నాయంటూ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై దావా కూడా వేశారు.

## ఉత్తరాది రాష్ట్రాల్లో బాలికలు ఇంటి పనులకే పరిమితం

- బాలికల అభ్యున్నతికి తమిళనాడు ప్రాధాన్యం
- డీఎంకే ఎంపీ దయానిధి మారన్
- ఉత్తరాది అమ్మాయిలను ఇళ్లకే పరిమితం చేస్తున్నారంటూ సంచలన వ్యాఖ్యలు



**చెన్నై:** బాలికల విద్య, కెరీర్ విషయంలో తమిళనాడు ఎంతగానో ప్రోత్సహిస్తోందని, అయితే పలు ఉత్తరాది రాష్ట్రాల్లో బాలికలను గడప కూడా దాటనీయకుండా ఇంటి పనులకే పరిమితం చేస్తున్నారని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అన్నారు. ద్రవిడ ఉద్యమం, డీఎంకే ప్రభుత్వ విధానాల కారణంగానే మహిళా విద్యలో రాష్ట్రం ప్రగతిపథంలో ఉందన్నారు. ఉత్తరాది అమ్మాయిలను ఇళ్లకే పరిమితం చేస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనమవుతున్నాయి.

చెన్నైలోని క్వాయిడ్–ఈ–మిల్లత్ ప్రభుత్వ మహిళా కళాశాల మంగళవారం నాడు జరిగిన కార్యక్రమంలో మారన్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అందజేసిన ల్యాప్‌టాప్‌లతో లబ్ధిదారులు చదువుకోవడం, ఇంటర్వ్యూలకు హాజరవడం జరుగుతోందని, ఇందుకు తాము గర్విస్తున్నామని చెప్పారు. ఉత్తరభారతంలోని కొన్ని రాష్ట్రాల్లో మహిళలను ఉద్యోగాలకు వెళ్లనీయకుండా, ఇళ్లకు, వంటింటి గదులకు, పిల్లలను కనడానికి మాత్రమే పరిమితం చేస్తున్నారని అన్నారు. కానీ ద్రవిడ రాష్ట్రమైన తమిళనాడు మాత్రం బాలికల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. బయట పనులు చేసుకుంటున్న మహిళల ఆర్థిక స్వాలంబనకు తమిళనాడు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని తెలిపారు.

### ఎంకే స్టాలిన్ ఇండియాలోనే ఉత్తమ సీఎం..



ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై మారన్ ప్రశంసలు కురిపిస్తూ.. ఇండియాలోనే ఆయన ఉత్తమ సీఎం అని, అత్యుతమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రం తమిళనాడు అని ప్రశంసించారు. ద్రవిడియన్ మోడల్ పాలన, సంఘ సంస్కర్త పెరియార్ ఐడియాలజీ వెల్లూనుకున్న తమిళనాడులో మహిళా విద్య, సామాజిక సమానత్వానికి ప్రాధాన్యత చెక్కుచెదరదని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ 'ఉలగం ఉంగల్ కైయిల్' పథకం కింద ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు 900 ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

## 'గ్రీన్‌లాండ్ విలీనం - రాష్ట్ర హోదా' పేరుతో అమెరికా బిల్లు

**స్వాధీనం చేసుకునే దిశగా ట్రంప్ ముమ్మర ప్రయత్నం**



**గ్రీన్‌లాండ్ :** గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తాజాగా రిపబ్లికన్ పార్టీకి చెందిన చట్టసభ సభ్యుడు రాండీ‌ఫైన్ 'గ్రీన్‌లాండ్ విలీనం – రాష్ట్ర హోదా' పేరుతో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుతో ఆ ద్వీపాన్ని అమెరికాలో విలీనం చేసుకునేలా ట్రంప్ చర్యలు చేపట్టేందుకు అవకాశం లభిస్తుందని రాండీ అభిప్రాయం వ్యక్తంచేశారు. అమెరికా విరోధులు ఆర్కిటిక్‌లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని, తాము అలా జరగనివ్వబోమని వ్యాఖ్యలు చేశారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాను ఎదుర్కోవడానికి ఈ చర్యలు కీలకమని వెల్లడించారు.

వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురో నిర్బంధం తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై కన్నేశారు. ఆ ద్వీపాన్ని డెన్మార్క్ నుంచి దూరం చేసేందుకు.. అక్కడి ప్రజలకు డబ్బును ఎరగా వేయాలని యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఒక్కో వ్యక్తికి 10వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.9 లక్షల నుంచి రూ.90 లక్షల) మధ్య డబ్బు ఇచ్చేందుకు అమెరికా అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఇంకో 20 రోజుల్లో ఈ ద్వీపం గురించి మాట్లాడదామంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. యూఎస్ నగదు చెల్లింపు ప్రణాళికలను గ్రీన్‌లాండ్ నాయకులు తిరస్కరించారు. తమ ప్రాంత భవిష్యత్తును విదేశాలు నిర్ణయించలేవని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. నాటో దేశాలు కూడా యూఎస్ ప్రణాళికపై ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ ద్వీపంలో మొత్తం 57 వేల మంది ప్రజలు ఉన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి..జిల్లా కలెక్టర్

**వుదయం, (బెల్లంపల్లిప్రతినిధి)**



ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లు/పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేసేందుకు పంట సాగుకు అవసరమైన వ్యవసాయ అధునాతన పరికరాలను అర్హులైన రైతులకు అందించి పంట దిగుబడి పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమం ఎస్.ఎం.ఎ.ఎం. 2025-26 లో భాగంగా అర్హులైన రైతులకు యాంత్రికరణ పరికరాలను అందించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతులు అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా లబ్ది పొందేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ రాక కోసం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**సూర్యాపేట జనవరి 13**

**(వుదయం)**



రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూర్యాపేట జిల్లా, మఠం పల్లి మండలం, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనార్థం మట్టపల్లి పుణ్యక్షేత్రానికి రానున్నందున పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మట్టపల్లి లో గవర్నర్ రాక ఏర్పాట్ల పై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కు ఆలయ పండితులు, ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు.రాష్ట్ర గవర్నర్ పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవా దాయ శాఖ అధికారులను,ధర్మకర్తలను ఆదేశించారు. మట్ట పల్లి గ్రామ ప ంచాయ తీ పరిధిలో రోడ్లు, కాలువలు, నది ప రివాహ క ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని, రోడ్ల పై ఎక్కడైనా గుంతలు లేకుండా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, అవసరం ఉన్న చోట అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉండడమే కాకుండా, అత్యవసర మందులు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ హెలి ప్యాడ్, పార్కింగ్, ట్రాఫిక్,బందోబస్తు చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ, అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో జ్యోతి, జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# దమ్మపేట పోలీస్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమం

**దమ్మపేట జనవరి 13**
**(వుదయం ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర డిజిపి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు గాను ప్రారంభించిన " ఎరైవే అలీవ్ కాంపెయిన్ - A ప్రైమైస్ టూ అవర్ ఫామిలీస్" లో భాగంగా.. మంగళవారం. కొత్త గూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దమ్మపెట పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని ముస్టి బండ గ్రామంలో రోడ్డు ప్రమాద నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఐ నాగ రాజు, ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్టు ప్రాముఖ్యత, మద్యం సేవించి డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే అనర్ధాలను గతంలో ఈ ప్రాంతంలో జరిగిన సంఘటనను ఉదహరిస్తూ వివరించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించవలసిందిగా గ్రామస్తులను కోరినారు. ఆ తర్వాత గ్రామస్తులందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞను ఏమంటారు ప్రతిజ్ఞను చేపించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరైవ్ అలైవ్ ఉద్యమంలా సాగాలి..జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట జనవరి 13**
**వుదయం ప్రతినిధి)**



దేశములోనే మెదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ము, డీజీపీ రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అరైవ్ అలైవ్ అనే ఒక వినూతన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందనీ ఇది ఉద్యమంలా సాగాలని జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్ అన్నారు.ఈ అవగాహన కార్యక్రమాలు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిదిలో ఘనంగా ప్రారంభమయ్యాయనీ జనవరి 13 నుండి 24 వరకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.ఈ ప్రత్యేక కార్యక్రమాలలో మొదటి రోజులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ని ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతు ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం డ్రైవర్లకు, ప్రజలకు తెలియ జేశారు. నారాయణ పేట జిల్లా లో ఈ మహత్తర కార్యక్రమం ఈ ఆరైవ్ ఆలైవ్ అనే కార్యక్రమం కేవలం ఒక నినాదం కాకుండా అందరిలో రోడ్డు ప్రమాదాలు నివారించే ఒక ఉద్యమంలా ముందుకు సాగాలి అని అన్నారు. ప్రతి ఒక వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరాలనే వారి కుటుంబ సభ్యుల ఆశను తీర్చే కార్యక్రమం కావాలినీ రోడ్డు ప్రమాద సంఘటనలో బాధి తుల బాధలను, మరణం సంభవించిన వారి కుటుంబ సభ్యుల బాధలను, స్వయం గా తెలియచేశారు . అలాంటి పరిస్తితి మరొక కుటుంబ ములో జరగకుండా మన అందరమూ రహదారి భద్రత నియమ నిబంధనలను పాటించవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికాలు కావు, అవి మన నిర్లక్ష్యం, అతివేగం,అజాగ్రత్త వల్ల జరుగుతాయి. హెల్మెట్ ధరించడం అనేది కేవలం చలానాల నుండి, చట్టం నుండి తప్పించుకోవడానికి కాదు, అది మీ ప్రాణాన్ని కాపాడే ఆయుధం అని ప్రతీ ఒక్క వాహనదారుడు గ్రహించి విధిగ దరించాలి. మద్య సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాద మరణాలు జరిగి ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయి. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలి. మొబైల్ వాడకం, ఓవర్ స్పీడ్, మరియు రాంగ్ దిశలో డ్రైవింగ్ ఎట్టి పరిస్తితులలో చేయవద్దని ఎస్పీ గారు సూచించారు. అంతకు ముందు రోడ్ సేఫ్టీ పై రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులు, రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులతో స్వయంగా మాట్లాడించారు.
వారి బాధ వర్ణనాతీతంగా ఉందని ఇలాంటి బాధలు ఎవరికి ఉండకూడదు అని అధికారులు తెలిపారు. అదేవిధంగా డాక్టర్లతో రోడ్డు ప్రమాదానికి గురైతే ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి ట్రీట్మెంట్ తీసుకునే సమయంలో కోలుకోవడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుంది. డబ్బులు ఖర్చు అవుతాయని వాళ్లతో అవగాహన కల్పించి ఇలాంటి బాధలు ఎవరికి ఉండరాదని, మీ కోసం మీ కుటుంభ సభ్యులు ఇంటివద్ద ఎదురుచూస్తున్నారు అన్న విషయం గుర్తించుకొని జాగ్రత్తగా ప్రయాణాలు కొనసాగించండి అనే సందేశాన్ని ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమాలు జిల్లాలోని ప్రతీ ఒక పోలీసు అధికారి విస్తృతంగా పాల్గొని అవగాహన కల్పించాలని ఇలా ఈ నెల 24 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి అని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ బాధ్యతగా వాహనాలు నడపాలని కోరారు. ప్రజలకు, వాహనదారులకు డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ప్రమాణం చేస్తూ అవగాహన ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, డి టి ఓ మెగా గాంధీ, ఆర్తో డాక్టర్ ప్రసాద్ శెట్టి, ప్రభుత్వ మార్చురీ డాక్టర్ తవ్ సిఫ్, ఎక్లాస్పూర్, జాజాపూర్ సర్పంచ్ లు ఆర్ యి ఏ మెంబర్ పోషల్ రాజేష్, ప్రజలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేద్దాం

## ప్యారా లీగల్ వాలంటరీ రూప

**నారాయణపేట జనవరి 13**
**వుదయం ప్రతినిధి)**



బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్యారా లీగల్ వాలంటరీ రూపిక అన్నారు. నారాయణపేట జిల్లా మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ దగ్గర మంగళవారం నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు బాల్య వివాహలపై విద్యార్థులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహానికి చట్టబద్ధమైన వయసు అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్స రాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయా లని సూచించారు. ఈ వయసు రాకముందే పెళ్లి చేసుకోవడం చట్ట విరుద్ధం, సురక్షితం కాదని, ఇది అనేక సమస్యలైన మానసిక, శారీరిక ఆరోగ్యం కలలను సాకారం చేసుకోలేకపోవడం, నిరక్షరాస్యత నిరు ద్యోగం పెరిగిపోవడం, కేరీర్ అంశాలు తగ్గి పోవడం లాంటి సమస్యలకు దారి తీయవచ్చున నిన్యాయ విజ్ఞాన సదస్సులోఅన్నారు. మీ గ్రామంలోని పిల్లలు ఎవరైన చట్టబద్ధ వయసు రాకముందు పెళ్లికి ప్రయత్నిస్తున్నారని మీకు తెలిస్తే దయచేసి గళం విప్పండి మీరు సమాచారం తెలియజేయాలని అనుకుంటే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కు ఫోన్ చేయాలన్నారు. మన మందరం కలిసి నారాయణపేటను బాల్య వివాహరహిత జిల్లాగా మార్చగలమన్నారు. అబ్బాయి అమ్మా యిలు బాగా చదువుకొని పెద్ద కలలు కనే సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో జీవించే జిల్లాగా నారాయణపేట ను మారుద్దాం అని వారితో చెప్పడం జరిగింది. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి విజయ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా పై రాజకీయ పార్టీల సమావేశం

**మధిర,జనవరి13, (వుదయం ప్రతినిధి)**



మధిర మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మధిర మున్సిపాలిటి పరిధిలోని అన్ని వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రల ముసాయిదా జాబితా పై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించడం జరిగింది.గత చేసింది మున్సిపాలిటీ ఎన్నికలో శిధిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రంల భవనములు మార్చడం జరిగినది.మార్చిన పోలింగ్ కేంద్రంలు 4వ వార్డులోని ఇల్లెందులపాడు ఓటర్లు ఎంపీయుపిఎస్ స్కూల్ ఒక పోలింగ్ కేంద్రం మరియు 4వ వార్డులోని చెరుకుమల్లి వారి వీధి ఓటర్లు సిపిఎస్ చిన్న స్కూల్ రెండోవ పోలింగ్ కేంద్రం.9వ వార్డు పోలింగ్ కేంద్రంలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసు మరియు ఇందిరా మహిళ డెయిరీ ఆఫీసు.10వ వార్డు పోలింగ్ కేంద్రంలు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల.12వ వార్డు పోలింగ్ కేంద్రంలు హరిజనవాడ చిన్న స్కూల్. 19వ వార్డు పోలింగ్ కేంద్రాలను సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ వద్దకు మార్చడం జరిగినది.మిగతా వార్డులన్నీ పాత మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ కేంద్రాలలో జరుగును పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.ఈ సమావేశములో పట్టణంలోని అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## చౌడవరంలో ముగ్గులు పోటీలో విజేతలకు బహుమతులు

**సత్తుపల్లి జనవరి 13 (వుదయం ప్రతినిధి)**




వేంసూరు మండల పరిధిలోని సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చౌడవరం గ్రామ సర్పంచ్ నల్లిబోయిన అంజమ్మ చిన్నికృష్ణ ఉప సర్పంచ్ గొర్ల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు లైన్స్ క్లబ్సత్తుపల్లి ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని చిన్న పెద్ద మహిళలు పురుషులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ ముగ్గుల పోటీలో రకరకాల ముగ్గులు ఎంతో అందంతో శ్రద్ధగా మహిళలు భోగి సంక్రాంతి పండుగ గుర్తుకొచ్చే విధంగా నిర్వహించారు.

## సంతూర్ సంక్రాతి సంబరాలు

**అలంపూర్ జనవరి 13**
**(వుదయం ప్రతినిధి)**



కాంగ్రెస్ నాయకుడు మేడికొండ లక్ష్మీ కాంతరావు ఆధ్వర్యంలో విప్రో కంపెనీ వసంత్ శ్రీ ఏజెన్సీస్ గద్వాల్ కంపెనీ వారు సంక్రాంతి పండుగ సందర్భంగా మేడికొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. విప్రో సంతూర్ సోప్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన వారు మొదటి బహుమతి రేవతి, రెండో బహుమతి జయమ్మ, మూడో బహుమతి పల్లవి, నాలుగో బహుమతి శిరీష, ఐదో బహుమతి జ్ఞానఅక్షిత మొదలగువారు బహుమతులు గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్, ఉప సర్పంచ్, విప్రో డిస్ట్రిబ్యూటర్ రాజేష్, శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## మండల అధికారులకు ఘన సన్మానం

**వెల్దండ జనవరి 13 (వుదయం ప్రతినిధి)**

మండల పరిధిలోని తిమ్మి నోని పల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంపీ ఓ లక్ష్మణ్ ల ను గ్రామ సర్పంచ్ శారద హరికిషన్ నాయక్ లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్య క్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్, శైలజ శేఖర్ గౌడ్, కార్యదర్శి అరుణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మధిర అభివృద్ధి కోసం కృషి చేస్తుంది

## భట్టి విక్రమార్కే: మల్లు నందిని విక్రమార్క

**మధిర జనవరి 13, (వుదయం ప్రతినిధి)**



మధిర నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన తొలి రోజు నుండి కృషి చేస్తున్న నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అని అమ్మ ఫౌండేషన్ చైర్పర్సన్ మల్లు నందిని అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 16 వ వార్డులో పార్టీ ముఖ్య కార్యకర్తలు నాయకులు స్థానిక ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మధిర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టడం జరుగుతున్నదని ఈ పనులు అనివార్య కారణాల వలన కొంత ఆలస్యంగా కొనసాగుతున్న పరిస్థితి నెలకొన్నది అన్నారు. దీనివలన ప్రజలకు కొంత ఇబ్బంది కలిగిన పరిస్థితి ఉన్నదని ప్రస్తుతం ఈ పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తు పట్టణీకరణ చర్యలో భాగంగా చేపడుతున్న ఈ పనులను విమర్శిస్తూ రాజకీయ పార్టీలు అభివృద్ధి వ్యతిరేకులు విమర్శలు చేస్తున్నారని ఈ పనులు పూర్తయితే పరిశుభ్రమైన పట్టణంతో ప్రజలు సంతోషిస్తారు అన్న విషయాన్నితెలియచేయాలని కోరారు. మధిర పట్టణానికి సంబంధించి అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయలను విడుదల చేయడం జరుగుతుందని ఇది కేవలం మున్సిపల్ ఎలక్షన్ల కోసం మాత్రమే అనుకోవడం ప్రతిపక్ష పార్టీల నాయకుల అవివేకమని ఆమె అన్నారు. ప్రజలు భట్టి విక్రమార్కని నమ్మి ఓట్లేసి గెలిపించాలని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మధిర పట్టణంతోపాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం హోదాలో నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు ఆయనతోపాటు ముఖ్యమంత్రి మంత్రులు అధికారులు చేస్తున్న కృషి అన్నిర్వచనియమైనదన్నారు. బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక అభివృద్ధి పేరు తో ఏడు లక్షలకోట్ల రూపాయలను అప్పులను చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన పరిస్థితి నుండి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు రెండేళ్ల కాలంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని నందిని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త ప్రభుత్వం చేస్తున్న కృషిని మధిర నియోజకవర్గంలో భట్టి విక్రమార్క మోడల్ పట్టణంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలను ప్రజలకు తెలియచేయవలసిన బాధ్యతను గుర్తించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో హాజరైన టౌన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మిరియాల రమణ గుప్తా,డివిజన్ అధ్యక్షులు మైలవరపు కోటేశ్వరరావు చక్రి ,ఆత్మ కమిటీ డైరెక్టర్ మైలవరపు శ్రీలక్ష్మీ స్వాతి, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి,తూమాటి నవీన్ రెడ్డి,పారుపల్లి విజయ్ కుమార్,దేవిశెట్టి రంగారావు, కరివేద సుధాకర్,బోయపాటి వెంకటేశ్వరావు,సిద్ధంశెట్టి సందీప్,జూలకంటి ప్రసాద్, దైవజ్ఞాచారి,నాయినిన రసింహారావు, చల్లగుండ్ల సత్యవతి,ములకలపల్లి మోహన్ రావు,జంగాల గురువులు, ఎర్రగర్ల చిన్న రామారావు, సముద్రాల పురుషోత్తం, బోనాల నాగేశ్వరావు, మహంకాళి శ్రీనివాసరావు, పారుపల్లి కోటేశ్వరరావు, దేవి శెట్టి శ్రీనివాసరావు, శ్రీరామోజీ రమా దేవి, సిద్ధంశెట్టి తేజ, గుర్రాల అనురాధ, ఆదిరాజు కామేశ్వరి, చలువాది వినీల్, చలవాది సత్యం, గోపాలరావు, వేములపల్లి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# డయాబెటిక్ అల్సర్ పై ప్రత్యేక అవగాహన

**మధిర, జనవరి13, (వుదయం ప్రతినిధి)**



మంగళవారం ఉదయం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అదికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,భారీ విధ్యుత్ శాఖ, ప్రణాళిక శాఖమంత్రివర్యులు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఖమ్మం శ్రీరక్ష హాస్పిటల్ యజమాని ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ద్వారా శ్రీ కృష్ణంరాజు మెమోరియల్ (యూకే ఐ డి ఎఫ్ ఎఫ్ )ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహణ బృందం ఆధ్వర్యంలో మండలంలో వున్న పీహెచ్ సీ దెందుకూరు. పీహెచ్ సీ మాటూరుపేట.పిపి యూనిట్ లో పని చేస్తున్న వివిధ పారా మెడికల్ సిబ్బందికి ఫీల్డ్ లో గమనిస్తున్న షుగర్ పుండ్లు కల్గిన పాదాలు కల్గి ఇబ్బందులు పడుతున్న పేషెంట్ సౌలభ్యం కోసం వారిని గుర్తించి ఏ విధంగా ఆరోగ్య సేవలు అందించాలని డాక్టర్ జీ వెంకటేశ్వర్లు సంపూర్ణ ముగా పారా మెడికల్ సిబ్బందికి వివరించినారు. ఈనెల 20వ తేదీ న స్థానిక రెడ్డి గార్డెన్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు మేరకు భారీ షుగర్ వ్యాది గ్రస్తుల నివారణ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుదని ఈ క్యాంపును షుగర్ వ్యాది గ్రస్తులు ఎక్కువగా ఉపయోగించుకొనే విధంగా చూడాలని వివరించినారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ పృథ్వి, డాక్టర్ వీరబాబు,డాక్టర్ రామ్మోహన్ నాయక్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు,సుభాషిణి వివిధ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు..ఎస్పీ నరసింహ

**సూర్యాపేట జనవరి 13**

**(వుదయం)**



సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు, ఉత్సవాలు అందరూ కలిసి మెలిసి నిర్వహించుకోవాలని ఎవరు కూడా గొడవలు పెట్టుకోవద్దని కోరారు. కుటుంబసభ్యులతో కలిసి వైభవంగా మూడు రోజులపాటు బోగి, సంక్రాంతి, కనుమ పండుగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలి అని కోరారు.పందాల నిర్వహణపై పూర్తి నిషేదమని దీనిపై పోలీసు నిఘా ఉన్నది అన్నారు. కోడి పందాలు జూదం నిర్వహించిన ఆడిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో క్రీడా పోటీల నిర్వహణ ముగ్గుల పోటీల నిర్వహణ సమయంలో యువత ఆదర్శంగా ఉండాలి ఎవరు గొడవలు పెట్టుకోకూడదు అని అన్నారు. అపరిచితులు ఎవరైనా అడ్రస్ అడుగుతూ మెడలో బంగారు ఆభరణాలు దొంగతనాలు చేసే అవకాశం ఉంది ఇలాంటి వారి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి, బయట ముగ్గులు వేసే సమయంలో జాగ్రత్త పాటించాలి కోరారు.

# టాటా ఏసీ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థిని మృతి

**నారాయణఖేడ్ జనవరి 13**
**(వుదయం ప్రతినిధి)**



సంగారెడ్డి నుండి నారాయణ ఖేడ్ వెళ్తున్న టీ జి యస్ ఆర్ టీ సి బస్సు సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి లోని వైకుంత పురం సమీపంలో బస్సు ప్లేక్సీలను తరలించే ఆటో ను వెనుక నుండి ఢీ కోన్న ఘటనలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని రాయకల్ గ్రామానికి చెందిన పూజ 17 నిజామాబాద్ నియోజకవర్గంలోని బాసర లోని ట్రిబుల్ ఐటీ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని మృతి చెందటంతో ఆమెతోపాటు బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురు ప్రయాణికులకు గాయపడిన ఘటన పై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన లో తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించే సమయంలో చనిపోయిన పూజ 17 నిజామాబాద్ నియోజకవర్గంలోని బాసర లోని ట్రిబుల్ ఐటీ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని మృతి సమాచారం తెలుసుకోని మంత్రి విచారం వ్యక్తం చేసారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురు ప్రయాణికులకు మెరుగైన వైద్యాన్ని అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా వైద్య శాఖాధికారి ని అదేశించారు.స్వల్పంగా గాయపడిన ఇతర ప్రయాణికులకు చికిత్స అందించి అండగా నిలవాలని మంత్రి అదేశించారు.

# గద్వాల పట్టణానికి రూ. 18.70 కోట్ల నిధులు మంజూరు..

## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జనవరి 13 (వుదయం ప్రతినిధి)**



గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసం, పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తాను అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లె.నెం.880140/2026/82 తేదీ. 10-01-2026 ప్రాకారం నిధులు, పనులు వివరాలు తెలిపారు. గద్వాల మున్సిపల్ లోని వివిధ ప్రదేశాలలో సీ.సీ డ్రెయినేజీ నీటి డ్రెయినేజీ నిర్మాణంకు రూ 4.75 నాలుగు కోట్ల 75 లక్షలు. మున్సిపల్ లోని వివిధ ప్రదేశాలలో సీసీ రోడ్ల నిర్మాణంకు రూ 1.80 ఒక కోటి 80 లక్షలు. మున్సిపల్ లోని వివిధ ప్రదేశాలలో బి.టి రోడ్ల రీకార్పెటింగ్ కు రూ 6.00 ఆరు కోట్లు. మున్సిపల్ లో చింతల పేట ప్రధాన రహదారిని వెడల్పు చేసి, తారు వేయడం ద్వారా అభివృద్ధి చేయడంకు రూ 2.30 రెండు కోట్ల 30 లక్షలు. మున్సిపల్ లో బాల రక్షా భవన్ దగ్గర పైప్ కల్వర్టు నిర్మాణం, అవుట్లెట్ ఎస్ డబ్యూడి నిర్మాణంకు రూ 0.80 యనబై లక్షలు. మున్సిపల్ లోని వివిధ ప్రదేశాలలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంకు రూ 1.55 ఒక్కా కొట్టి యాబై ఐదు లక్షలు. మున్సిపల్ లోని మేళ్ల చెరువు ఎక్స్ రోడ్ నుండి ఐవి ఎన్ ఎమ్ సి. వరకు స్టార్మ్ వాటర్ డ్రెయినేజీ నిర్మాణంకు రూ ఒక కోటి యాబై లక్షలు, భవిష్యత్తులో గద్వాల పట్టణం మరింత అభివృద్ధి చేసే విధంగా నా వంతు సహాయ శక్తుల కృషి చేస్తున్న అని పేర్కొన్నారు.

# సిసి రోడ్ల నిర్మాణాలను ప్రారంభించిన తూంకుంట నర్సారెడ్డి

**వుదయం న్యూస్ కుకునూర్ పల్లి ప్రతినిధి జనవరి 13**



కుకునూర్ పల్లి మండల పరిధిలోని మంగోల్,కొనాయిపల్లి,ముద్దాపురం,లకుడారం గ్రామాలల్లో ఎస్సీ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి గాను మంగళ వారం రోజు కొబ్బరికాయకొట్టి పనులు ప్రారంభించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళల కట్టుబడి ఉందన్నారు. ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలు సమానత్వంగా జీవించాలనే ఆలోచనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల తోనే గ్రామాల్లో ఎస్సీ వార్డులలలో ఈ రోజు సీసీ రోడ్ల నిర్మాణాలను మొదలు పెట్టడం జరిగింది అన్నారు నర్సారెడ్డి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు శ్రీకాంత రెడ్డి, చింతల శిల్పా నర్సింలు, మంగోల్ సర్పంచ్ కరుణాకర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు బచ్చల రవీందర్, మెరుగుజు కరుణాకర్ చారి, అందాలమ్మ, మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుజాత, పత్తిరి రాము స్వామి, కుమ్మరి చంద్రం, మజీదు, కంకణాల మల్లేశం, కంకణాల కిష్టయ్య, కందూరి నర్సింలు, మంజ స్వామి, బాబు, బచ్చలి బాబు, దయాకర్, ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

**గద్వాల జనవరి 13 (వుదయం ప్రతినిధి)**



వేసవికాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ నూర్-ఉల్-హక్ పేర్కొన్నారు. మంగళవారం గద్వాల మండలం వీరాపురం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో నీళ్ల ట్యాంకులను తరచూ శుభ్రం చేసుకోవాలని బ్లీచింగ్ పౌడర్ను తగిన మోతాదులో కలిపి ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని నీళ్ల ట్యాంకులను, చేతిపంపులను ఏఈ పరిశీలించారు. తాగునీటి పరీక్షల నిమిత్తం తాగునీటి శాంపిల్లను జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల సిబ్బంది సేకరించడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచి నీలం మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాజారాణి, నీటి నాణ్యత ప్రయోగశాల సిబ్బంది నరేష్ కుమార్, అన్వర్ అహ్మద్, వార్డ్ మెంబర్లు సుంకులమ్మ, దస్తగిరమ్మ, ఆంజనేయులు, హరికృష్ణ, నాయకులు నీలం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటి అభివృద్ధి నా బాధ్యత

***-బెల్ట్ షాపులు నడిపితే కటిన చర్యలు...-ఆర్కే ఫోర్ గడ్డ ఏరియాను ఓసి ప్రభావిత ప్రాంతంగా గుర్తిస్తాం...- కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి***

**రామకృష్ణాపూర్ /జనవరి 13(వుదయం ప్రతినిధి)**

ఆర్కేపి ఉపరితల గని ప్రభావిత ప్రాంతమైన ఆర్కే ఫోర్ గడ్డ ఏరియా ప్రజలకు పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తానని, వార్డులలో ఉన్న సమస్యలను, ప్రజా సమస్యలను సైతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి పార్టీ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ లో మంత్రి వివేక్ పాల్గొన్నారు. ప ట్టణ ంలోని 3,4,17,18,19 వార్డ్ లలో పర్యటించారు. రానున్న రోజుల్లో రామకృష్ణాపూర్ ఉపరితల గని రెండో దఫా పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పించాలని మంత్రిని ఆర్కే ఫోర్ గడ్డ ప్రజలు కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. మంత్రి వెంట మార్నింగ్ వాక్ లో పాల్గొన్న మందమర్రి ఏరియా సింగరేణి జిఎం రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు లకు ఉపరితల గని బాధితులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ఆదేశించారు.3,18 వార్డుల్లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. పలు కాలనీలో బెల్ట్ షాపులతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలపగా వెంటనే బెల్ట్ షాపులను అరికట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. సింగరేణి ప్రాంతంలో నిలిపివేసిన 76 జీవోను అమలు చేసి ఇండ్ల క్రమబద్ధీకరణ చేయాలని వార్డుల్లోనీ ప్రజలు



కోరగా , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో ఫోన్లో మాట్లాడి సింగరేణి భూముల్లో ఉన్న ఇండ్ల స్థలాలకు పట్టాలను ఇచ్చేలా కృషి చేయాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మార్నింగ్ వాక్ లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే పర్యటిస్తున్నానని మునిసిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అన్నారు. మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి ఎస్సై కవిత

**సత్తుపల్లి జనవరి 13 (వుదయం ప్రతినిధి )**



వేంసూరు మండల పరిధిలోని మర్లపాడులో డిజిపి సీపీ, ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ కవిత వాహనదారులతో రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కవిత మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే సమయంలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోతున్నాయని, కుటుంబాలు నష్టపోకుండా చూసుకోవాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకపోతే చలాన్ విధిస్తామని చలాన్ కట్టిన తర్వాత హెల్మెట్ కొని తీసుకువస్తేనే వాహనం తిరిగి ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా పోలీసులకు సహకరించాలని కోరారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**జైపూర్: జనవరి 13 (వుదయం విలేకరి)**

జైపూర్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు,అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ( సి.ఎం.ఆర్.ఎఫ్) కింద చెక్కుల సర్పంచ్ కామెర మనోహర్ అందజేశారు,మిట్టపల్లి గ్రామానికి చెందిన జునుగురి అజయ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా సి.ఎం.ఆర్.ఎఫ్ సహాయ నిధి కింద రూ.55,000 మంజూరు కావడంతో బాధితులకు సర్పంచ్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మనోహర్ మాట్లాడుతూ, మిట్టపల్లి గ్రామంలో ఇప్పటివరకు అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సి.ఎన్.ఆర్.ఎఫ్ సహాయనిధి ద్వారా సుమారు రూ.60 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. నిరుపేద ప్రజలుప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడం వల్ల భారీ ఖర్చులు ఎదురవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజలు తనను సర్పంచ్‌గా ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారి కష్టసుఖాల్లో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

# ధర్మపురి అభివృద్ధిపై మాజీ మంత్రికి కాంగ్రెస్ సవాల్

**ధర్మపురి, జనవరి 13(వుదయం ప్రతినిధి):**



గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ధర్మపురి నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం అప్పుల ఖజానాను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించా రని మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంఘనబట్ల.దినేష్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దినేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం టియుఎఫ్ఐడిసి నిధులు రూ.15 కోట్లు, మున్సిపల్ నిధులు మరో రూ.15 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు నేతలు వెల్లడించారు.పట్టణంలో తాగునీటి ఎద్దడి కలగకుండా అమృత్ పథకం పనులు వేగవం తం చేశామని,మూతపడిన నైట్ కాలేజీని పునఃప్రారంభించి విద్యార్థులకు మేలు చేశామని పేర్కొన్నారు. త్వరలోనే ధర్మపురిని రెవెన్యూ డివిజన్ గా మార్చడంతో పాటు బస్ డిపో,రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుకు మంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో మాతా శిశు భవన కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకుండాఎగ్గొడితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ బకాయిలు తీర్చిందని గుర్తు చేశారు.బిఆర్ఎస్ హయాంలో వేసిన రోడ్లు కేవలం ఒక లేయర్‌తో నాసిరకంగా ఉండటం వల్లే ఇప్పుడు పాడైపోయాయని, శాస్త్రీయత లేకుండా నిర్మించిన శ్మశాన వాటిక గోదావరి వరదలకు కొట్టుకుపోయిందని ధ్వజమెత్తారు.గతంలో కళ్యాణ లక్ష్మి ,సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల కోసం కరీంనగర్ వెళ్లి లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు క్యాంపు కార్యాలయంలోనే పారదర్శకంగా లబ్ధిదారులకు సేవలు అందుతు న్నాయని వివరించారు.పదేళ్ల పాటు మంత్రిగా ఉండి కొప్పుల ఈశ్వర్ సొంత అభివృద్ధి చూసుకు న్నారే తప్ప, ధర్మపురికి చేసిందేమీ లేదని వారు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ఏం సి వైస్ చైర్మన్ సంఘ నరసింహు లు,సర్పంచులు చిలుముల లక్ష్మ ణ్,రాందేని. మొగిలి,ఎఎంసి డైరెక్టర్ ఎండి రఫీయోద్దీన్,మం డల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి,జే.సుముఖ్,గుడ్ల రమేష్,గాజు సాగర్, గరిగే రమేష్, బొల్లారం పోశయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత గ్రామీణ స్థాయి క్రీడలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి

**వెల్దండ జనవరి 13 (వుదయం ప్రతినిధి)**

యువత గ్రామీణ స్థాయి క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకట గౌడ్ , నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, సంజీవ యాదవ్ లు పేర్కొన్నారు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మంగళవారం వైబిఆర్ వర్సెస్ ఎం వి హెచ్ లో ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు కార్యక్రమంలో ఏ న్నం భూపతిరెడ్డి యువసేన అధ్యక్షులు వై శ్రీనివాస్ రెడ్డి,, రషీద్, కృష్ణ ముదిరాజ్, బసవని శ్రీనివాస్, రమేష్, పుల్లయ్య, జోగయ్య, నిరంజన్, ప్రభాకర్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ జనవరి 13 వుదయం ప్రతినిధి)**



ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల సమీపంలో చేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఐఐటి నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమి పూజా చేయనున్న స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. తదుపరి మహబూబ్‌నగర్ లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ నిర్వహించనున్న ముఖ్యమంత్రి పబ్లిక్ మీటింగ్, ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

సభ నిర్వహణ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అన్ని ఏర్పాట్లు సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అదనపు ఎస్పీ ఎన్. బి. రత్నం, డి.ఎస్.పి. వెంకటేశ్వర్లు, డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ టీ.ప్రవీణ్ కుమార్, రెడ్డి, టీ.డబ్లు. ఐ.డి.సి. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామచందర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహ రెడ్డి, మహబూబ్ నగర్ అర్బన్, రూరల్ తహసిల్దార్లు, తదితర సంబంధిత శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# మున్సిపల్ ఎలక్షన్లలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరడం ఖాయం

**నాగర్ కర్నూల్ జనవరి 13**

**(వుదయం ప్రతినిధి)**

**బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నిడనూరి దిలీప్ విశ్వకర్మ జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు**



రాబోయే మున్సిపల్ ఎలక్షన్ భారతీయ జనతా పార్టీ జెండా ఎగరడం ఖాయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నిడనూరు దిలీప్ విశ్వకర్మ,, జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రవు ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూతు నిర్మాణ అభియాన్ కార్యాశాల మున్సిపల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ విశ్వకర్మమాట్లాడుతూ గత ఎన్నికల లో 24 వార్డులకు అభ్యర్థులను ఖరారు చేయగా అప్పటిఅధికార పార్టీ మరియు ప్రతిపక్ష పార్టీ అయిన పార్టీలు మా అభ్యర్థులకు ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీ మారలేదని అలాగే విరమించుకోలేదని అన్నారు. భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే బలమని ప్రతి కార్యకర్త వందమందితో సమానమని అన్నారు భారతీయ జనతా పార్టీ తరపున వార్డుల్లో నిలబడ్డ అభ్యర్థులు అందరూ ఉన్నత చదువులు చదివిన వారే కాబట్టి ఎవరు కూడా పార్టీలకు పాల్పడలేదని తెలిపారు గత ఎన్నికల్లో పోటీ చేయడం వల్లనే పార్లమెంట్ ఎన్నికల్లో 52,వేల ఓట్లు సాధించడమే కాకుండా పట్టణంలో లీడ్ ఇవ్వగలిగామని అన్నారు. నాగర్ కర్నూల్ పట్టణ ప్రజలు విజ్ఞులు గనక భారతీయ జనతా పార్టీ పైన ఉన్న నమ్మకంతో ఈ ఎన్నికల్లో పార్టీ తరపున బరిలో ఉన్న అభ్యర్థులను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులకు తాను కచ్చితంగా ప్రచారం చేస్తానని గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని కార్యకర్తలకు వాగ్దానం చేశారు అనంతరం జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణము అవలంబించవలసిన విధివిధానాలు వేయవలసిన ఎత్తుగడల గురించి కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డులకు దాదాపుగా ఇద్దరు చొప్పున పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్నారని కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ వార్డుల్లో పరిస్థితిలను విపులంగా వివరిస్తూ ఎన్నికల్లో అవలంబించాల్సిన పరిస్థితులను వివరించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ తిరుపతయ్య మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన విధి విధానాలను కచ్చితంగా అవలంబిస్తే విజయం సాధించడం కష్టమేమి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి దొడ్ల రాజవర్ధన్ రెడ్డి రాజా రామేశ్వరరావు విష్ణు వివిధ మండలాధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపాలెంలో ముగ్గుల పోటీ విజేతలకు నగదు బహుమతి

**సత్తుపల్లి జనవరి 13 (వుదయం ప్రతినిధి )**



వేంసురు మండల పరిధిలోని రామన్న పాలెం గ్రామంలో నూనె హరిబాబు యాదవ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కావ్య పాల్గొని విజేతలు నిర్ణయించి సర్పంచి జంజునూరి కృష్ణవేణి, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్ రెడ్డి, బహుమతులు పంపిణీ చేశారు మొదటి బహుమతి 5116/- జుంజునూరి భూలక్ష్మి , రెండవ బహుమతి 3116/- పడకంటి రమాదేవి, మూడో బహుమతి ఇడుపులపాటి దీక్షిత 2116/- ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కూడా కన్సోలేషన్ బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది,జుంజునూరి వరప్రసాద్, కుక్కపల్లి శ్రీనివాసరావు, వెలగపూడి శ్రీనివాసరావు, కొమరబోయిన శ్రీనివాసరావు, పదిలం శివయ్య, బండి ముత్తయ్య, ఇడుపుల పాటి గోపి, కొప్పుల యహాను మరియు గ్రామస్తులు పిల్లలు పెద్దలు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్‌లో వైభవంగా ముగ్గుల పోటీలు

**ధర్మపురి జనవరి13(వుదయం ప్రతినిధి):**



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ రామాలయం లో మంగళ వారం ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ నలుమసు పుష్పలత- వైకుంఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 35 మంది మహిళలు పాల్గొని తమ ప్రతిభతో రంగురంగుల, భావాత్మకమైన ముగ్గులను తీర్చిదిద్ది చూపరులను మంత్రముగ్ధులను చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బుగ్గారం శ్రీలత,పాత వీణ వ్యవహ రించారు.ముగ్గుల నాణ్యత, సృజ నాత్మకతను పరిశీలించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురిని విజేతలుగా ప్రకటించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పాలత మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో ఇలాంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోదానపు. శారద, బొజ్జ మహేష్,ముత్తుర్ల ప్రభాకర్, కుమ్మరి సురేష్,ప్రణ య్,కాళ్ల పవన్కుమార్,అజయ్,ఆసం. సురేష్,కాసెట్టి.హరీష్,గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కీర్తిశేషులు శివరావు శేట్కర్ – చంద్రమ్మ శేట్కర్ గార్ల 30వ వర్ధంతి

**నారాయణఖేడ్ జనవరి 13 (వుదయం ప్రతినిధి)**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని స్వర్గీయ శివరావు శేట్కర్ సమాది వద్ద కీర్తిశేషులు శివరావు శేట్కర్ – చంద్రమ్మ శేట్కర్ మాజీ శాసనసభ్యులు స్వతంత్ర సమరయోధులు 30వ వర్ధంతి సభ సర్వదర్మ సమ్మేళనము కార్యక్రమంలో పాల్గొనీ పుష్పాంజలి అర్పించారు.దివంగత మహానుభావునికి నివాళుల ర్పించారు. నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్,కుటుంబ సభ్యులు,నారాయణఖేడ్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నూతన సర్పంచ్లు,ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మితిమీరిన వేగం ప్రమాదాలకు కారణం..జిల్లా కలెక్టర్

**వుదయం, (బెల్లంపలి ప్రతినిధి)**



రహదారులపై మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందని, వాహనం నడిపేటప్పుడు నిర్దేశిత వేగాన్ని పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. రహదారి భద్రత మాసోత్స వాలలో భాగంగా మంగళవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో తాండూర్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సుకు డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, రహదారులపై నిర్దేశిత వేగంతో మాత్రమే వాహనాలను నడపాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండి అర్హత కలిగిన వారు లైసెన్స్ పొందాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ తనిఖీలలో పట్టుబడినట్లైతే లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, అయినప్పటికీ వాహనాలు నడిపినట్లయితే సదరు వ్యక్తికి సంబంధించిన లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించాలని, కుటుంబ సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు.తాండూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధితురాలి కూతురు స్వాతికి బెల్లంపల్లి శాసనసభ్యులు 10 వేల రూపాయలు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సదర్మాట్ బ్యారేజి ప్రారంభోత్సవానికి సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

**నిర్మల్ జిల్లా 13 జనవరి 2026 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 16వ తేదీన (శుక్రవారం) మామడ మండలం పొన్కల్ గ్రామంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నందున, ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సదర్మాట్ బ్యారేజి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజి ప్రాంగణం పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. హెలిప్యాడ్ ను పరిశీలించారు. హెలిప్యాడ్ నుండి బ్యారేజి వరకు సరైన రోడ్డు సౌకర్యం ఉండాలన్నారు. అధికారులు, విఐపి లకు అనువైన పార్కింగ్ ను ఏర్పాటు చేయాలని చెప్పారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, టెంట్, షామియానా, సరిపడినన్ని కుర్చీలు, తదితర వసతులు కల్పించాలని సూచించారు. అత్యవసర వైద్య బృందం సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ, వారికి కేటాయించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సదర్మాట్ బ్యారేజి పరిసర ప్రాంతాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు సిబ్బందికి, భద్రత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, నీటిపారుదల శాఖ అధికారి అనిల్, డిపిఓ శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.ఎ రజాక్, అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, పోలీసు శాఖల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రేపు శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణం

**గద్వాల జనవరి 13 (వుదయం ప్రతినిధి)**




గద్వాల పట్టణంలోని కేఎల్ఐ క్యాంప్ లో గల శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉదయం 9 గంటలకు శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం 11:30 గంటలకు విద్వత్ గద్వాల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పరిషత్ శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయ చరిత్ర గ్రంధావిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి అవార్డు గ్రహీత బాలస్వామి రాజవంశీయులు లక్ష్మీ చెన్నకేశవరెడ్డి, రిటైర్డ్ తెలుగు పండితులు రామ్మోహన్రావు, పద్య కవి నాగేశ్వర చారి, నందకిషోర్ కుమార్, గోవర్ధన్ శెట్టి, తదితరులు హాజరవుతారని తెలిపారు.

# భూములిచ్చిన రైతులందరికీ ధన్యవాదములు.. జిల్లా కలెక్టర్

**సూర్యాపేట, 13-1-2026**



అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్మించుటకు భూములిచ్చిన రైతులందరికీ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ధన్యవాదములు తెలిపారు. హుజూర్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ముగ్దం నగర్ లో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు కు భూములు ఇచ్చిన రైతులతో మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అర్హతలు మేరకు భూములు కోల్పోయిన కుటుంబ సభ్యులకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇల్లులు అలాగే ఈ ప్రాంతానికి స్మశాన వాటిక మంజూరు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు.కలెక్టర్ మాట్లాడుతూ ఈప్రాంతంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్మించడం ద్వారా రైతులకు తక్కువ భూమిలో ఎక్కువ ఆదాయం వచ్చేలా ఆధునాతన వ్యవసాయం కొరకు అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించవచ్చని అలాగే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని భూములు కోల్పోయిన వారందరికీ న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులు కోరిన ఉద్యోగ అవకాశాలు యూనివర్సిటీ అధికారులతో మాట్లాడుతానని అలాగే ఇందిరమ్మ ఇల్లులు,స్మశాన వాటిక మంజూరు కొరకు తప్పకుండా నా వంతు ప్రయత్నం చేస్తానని సానుకూలంగా కలెక్టర్ స్పందించారు. అక్కడే ఉన్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, కంపాక్స్ బాక్స్ లు ఇచ్చి బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి, వుదయం జిల్లా ప్రతినిధి :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రవాణా, టీజీఎండీసీ తదితర శాఖల అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గతంలో మాన్యువల్ కూపన్ల ద్వారా ఉచితంగా ఇసుక అందించామని, ఇకపై ఆ విధానాన్ని పూర్తిగా నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇకపై జిల్లాలో ఇసుక అవసరమైన లబ్ధిదారులు తప్పనిసరిగా మన ఇసుక వాహనం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఇసుక పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.త్వరలోనే తహసీల్దార్లు, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై విశ్లేషణ చేస్తామని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లను గుర్తించేందుకు ఇరిగేషన్, టీజీఎండీసీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి ఓవర్‌లోడింగ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించినా, అక్రమ డంపులు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని తెలిపారు. పోలీసులతో కలిసి నిరంతరం తనిఖీలు చేపడతామని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఇసుక రీచ్‌లు, వాగుల నుంచి ఇసుక తరలించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని, అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా అధికారి సంధాని, ఆర్డీఓ హరి కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఈఈ బసవ ప్రసాద్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి, వుదయం జిల్లా ప్రతినిధి :** జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ భోగి, సంక్రాంతి మరియు కనుమ పండుగలను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలుగువారి అతిపెద్ద పండుగ అయిన సంక్రాంతి ప్రతి ఇంటిలో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రకృతిని ప్రేమించే, రైతన్నను గౌరవించే గొప్ప పండుగ సంక్రాంతి అని ఆయన తెలిపారు. కొత్త ఆశలు, కొత్త వెలుగులతో ప్రజలు జీవితాలను ప్రారంభించాలని కోరారు.పంట చేతికి వచ్చిన ఆనందంలో రైతులు జరుపుకునే ఈ పండుగ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత పునరుత్తేజాన్ని అందించాలని ఆకాంక్షించారు.పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా జరుపుకుంటూనే భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కొత్త ఏడాదిలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు జిల్లా ప్రజలందరి జీవితాల్లో కొత్త కాంతులు నింపాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలి



**జయశంకర్ భూపాలపల్లి, వుదయం (ప్రతినిధి):** ప్రమాదాలు చోటు చేసుకోకుండా రహదారి పక్కన సేఫ్టీ గార్డర్స్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్త బీసీ నాయకుడు పర్యావరణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాధుని సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ దగ్గర రోడ్డు మైసమ్మ అమ్మవారి దేవాలయం ప్రక్కన ఉన్న బ్రిడ్జి పక్క సేఫ్టీ గార్డర్స్ ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లు అంటించి రాత్రి సమయంలో వెలుగులిచ్చేలా ప్రమాదాలు చోటు చేసుకోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ నెలలో మేడారం జాతర ఉన్నందున భక్తులు ప్రయాణికులు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా వెంటనే ప్రభుత్వం పనులు మొదలుపెట్టి వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

## ఎన్నికల్లో పోటీకి జనసేనపార్టీ సిద్ధం

**ఉమ్మడి వరంగల్ ఎన్నికల ఇంచార్జ్ మాదిరెడ్డి దామోదర్ రెడ్డి**




**వరంగల్, జనవరి 13 (వుదయం జిల్లా ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని జనసేనపార్టీ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నికల ఇంచార్జ్ మాదిరెడ్డి దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో అభ్యర్థులు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జనసేన పార్టీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రతిబింబించేలా ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనం కలిగిన పాలన అందించడమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. గెలుపే లక్ష్యంగా జనసేన పార్టీ బరిలో దిగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ పట్ల, వరంగల్ చరిత్ర పట్ల అపార గౌరవం ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర అడ్ హాక్ కమిటీ సభ్యులు, స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గాదె పృథ్వీ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ సంస్థాగతంగా బలోపేతమైందని, మున్సిపల్ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు ఆకుల వెంకటేష్, నర్సంపేట నియోజకవర్గం ఇంచార్జ్ శివకోటి యాదవ్, తూర్పు, పశ్చిమ పీఏసీలు గద్దల రాకేష్, శేషారెడ్డి సందీప్, ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు సతీశ్ కుమార్, బద్ది శివ, ముస్కు రమేష్, కొలిపాక వంశీ కృష్ణ, ప్రదీప్, రవితేజ, ఎండీ అనీఫ్, బైరి వంశీ, తాళ్లపల్లి బాలు గౌడ్, జన్ను ప్రవీణ్, సంతోష్, ఓర్సు రాజేందర్, డేవిడ్, స్వర్గం హరిదర్, కొల్లూరి ఆనంద్, ఏక్ అస్గర్, ఇల్లందుల రాజు, జీవన్ పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం

**డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్**



**జయశంకర్ భూపాలపల్లి, వుదయం జిల్లా ప్రతినిధి :** నేటి ఉరుకులుపరుగుల జీవితంలో క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ అన్నారు. మంగళవారం మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకరి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపాద క్రికెట్ టోర్నమెంట్ మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ముందుగా కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి మనిషి మొబైల్ ఫోన్లకు అలవాటు పడి శారీరక శ్రమ తగ్గి మానసికంగా శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో క్రీడల ఏర్పాటుతో యువత తో పాటు గ్రామ ప్రజలు ఉల్లాసంగా గడుపుతారని అన్నారు. అనంతరం సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకొని విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నతంగా ఎదగడానికి అవకాశాలు ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ సీనియర్ నాయకుడు వామన్ రావు జిల్లా ప్రధాన కార్యదర్శి కామెడీ శ్రీనివాస్ రెడ్డి గంధసిరి సత్యనారాయణ మైనార్టీ అధ్యక్షుడు అస్రార్ ఖురేషి మధుసూదన్ యూత్ నాయకులు అరుణ్ కిరణ్ జానీ కొండల రాజబాబు షకీల్ వార్డు సభ్యులు రాజాశేఖర్ ఇమ్రాన్ పోతర్ల ప్రేమ్ కుమార్ అప్పల శ్రీనివాస్ మట్టెవాడ సురేష్ జన్ను శేఖర్ తిలక్ చారి చిట్యాల అఖిల్ కీర్తి రాజు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓసీ పత్రం అందజేత



**జయశంకర్ భూపాలపల్లి , వుదయం జిల్లా ప్రతినిధి:** బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ లక్ష రూపాయల ఎల్ఓసి పత్రాన్ని అందజేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు క్యాంపు కార్యాలయం నుండి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన ఎలాది ఇంద్రసేన అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ఒక లక్ష రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించి మంత్రి ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగిందని తెలిపారు బాధిత కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబు కు ధన్యవాదాలు తెలిపారు.

## విలేకరి తండ్రి సంవత్సరికానికి హాజరైన సర్పంచ్



**ఖానాపురం, వుదయం ప్రతినిధి :** మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన విలేఖరి తడుగుల స్వామి తండ్రి తడుగుల సర్వయ్య సంవత్సరీకానికి గ్రామ సర్పంచ్ ఎలగందుల రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెళ్లి మృతిని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కావటి రమేష్, మాజీ ఉపసర్పంచ్ మీసం రవీందర్, నాయకులు దుగ్యాల రాజేశ్వరరావు, బొమ్మరబోయిన మహేష్, బొమ్మెరబోయిన ప్రవీణ్, కొయ్యాడి వినోద్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ముదురు రవి, అనిల్ పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయానికి తాళం

- అద్దె చెల్లించకపోవడంతో యజమాని నిర్వాహకం
- 29 నెలలుగా భవనానికి అద్దె చెల్లించని వైనం
- రూ.1.50 లక్షలకు పైగా విద్యుత్ బిల్ పెండింగ్
- వెంటనే చెల్లించాలని యజమాని వేడుకోలు



**పెద్దవంగర, వుదయం ప్రతినిధి :** ఎంపీడీవో కార్యాలయ భవనానికి అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో యజమాని తాళం వేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకోగా... అతి త్వరలోనే అద్దె చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో తాళం తీసి, కార్యాలయం తెరిచారు. ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. పెద్దవంగర మండలం ఏర్పడినప్పటి నుంచి ఎంపీడీవో కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 29 నెలల భవనానికి అద్దె రూ.2,03,000 చెల్లించడం లేదు. దాంతో పాటుగా రూ. 1,54,145 వేల విద్యుత్ బిల్లులు బకాయి ఉంది. గతంలో 8 నెలల అద్దెకు సంబంధించి రూ.56 వేలు చెక్కు ఎస్టీవోకు పంపించారు. కానీ ఇప్పటి వరకు ఆ డబ్బులు యజమానికి అందలేదు. దీంతో 29 నెలల అద్దె బకాయిలు అందకపోవడంతో యజమాని రాంపాక నారాయణ మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేశారు. ఉదయం 10 గంటల సమయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయానికి చేరుకున్నారు. తాళం వేసి ఉండటంతో కొద్దిసేపు ఆరుబయటే వేచిఉన్నారు. ఎంపీడీవో వేణుమాధవ్ యజమానితో మాట్లాడి, అద్దె చెల్లింపు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో యజమాని కార్యాలయం తాళం తీయడంతో వివాదం సద్దుమణిగింది. దీనిపై ఎంపీడీవో ను వివరణ కోరగా.. ఎస్టీవోకు పంపిన 8 నెలల అద్దె ఇంకా యజమానికి అందలేదని, దాంతో పాటుగా 21 నెలల అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. త్వరలోనే అద్దె చెల్లింపుకు కృషి చేస్తామని తెలిపారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**హనుమకొండ టౌన్, వుదయం ప్రతినిధి :** హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగుల హనుమకొండ జిల్లా క్యాలెండర్ 2026 ను జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్ చేతుల మీదగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఏలిమినేట్ గణేష్ మరియు హనుమకొండ జిల్లా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.




# రోడ్డు భద్రతపై అవగాహన

**పెద్దవంగర, వుదయం ప్రతినిధి :** మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు ఎస్సై చిలువేరు ప్రమోద్ కుమార్ అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో వేణుమాధవ్, తహసీల్దార్ బలభద్ర వినోద్ కుమార్, సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్‌తో కలిసి ఎస్సై మాట్లాడారు. అరైవ్ అలైవ్ అనేది కార్యక్రమం కాదని, ఇదొక సామాజిక ఉద్యమమని అభివర్ణించారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానానికి చేరాలనేదే (అరైవ్ అలైవ్) ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి వినియోగించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎండీ హిదాయత్ అలీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఆర్ఐ భూక్యా లష్కర్, ఏఈవో యశస్విని, పంచాయతీ కార్యదర్శి రమేష్, నాయకులు పూర్ణచందర్, ఎండీ జానీ, సుంకరి ఓంకార్, రాములు, రమేష్, అంజయ్య, రవి, రాము, శేఖర్, యాకన్న, అఫీజ్ పాల్గొన్నారు.

## తక్కెళ్ళపల్లిని కలిసిన ఓం సాయి రియల్ ఎస్టేట్ బృందం



**ఖానాపురం, వుదయం ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి రవీందర్ రావు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన తక్కలపెల్లిని ఓం సాయి రియల్ ఎస్టేట్ బృందం మరియు బిల్డర్స్ మర్యాదపూర్వం కలిసి పూల బొకే అందించి శాలువా కప్పి ప్రత్యేకతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓం సాయి రియల్ ఎస్టేట్ అండ్ ఉమ్మడి జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాహిడి రవీందర్ రెడ్డి, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు నాగేలి వెంకట నారాయణగౌడ్, రియల్ ఎస్టేట్ బృందము యాదగిరిరావు, ప్రవీణ్, సంపత్, రాజు, బిల్డర్స్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఆలయాలలో గోదారంగనాయకస్వామి కళ్యాణోత్సవం

**ఖానాపురం, వుదయం ప్రతినిధి :** నేడు బుధవారం ఉదయం గోదారంగనాయకస్వామి కళ్యాణ మహోత్సవమును మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చక స్వామి పర్వతపు శివప్రసాద్ శాస్త్రి, ఆలయ చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు తెలిపారు.మండల కేంద్రం తోపాటు బుధరావుపేట గ్రామంలోని శ్రీ భూనిలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలోని, ధర్మరావుపేట గ్రామంలోని శివరామ క్షేత్రంలోని, పగడాల వెంకటేశ్వర స్వామి ఆలయంలోని, రంగాపురం గ్రామంలో ని కోదండ రామాలయంలోని, అశోక్ నగర్ గ్రామంలోని రామాలయంలో గోదారంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం ను నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల బాధ్యులు తెలిపారు.

## విద్యుత్ వినియోగదారులకు లేఖల పంపిణీ



**పెద్దవంగర, వుదయం ప్రతినిధి :** ప్రభుత్వం పేదలకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత కరెంటును సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్కో ఏఈ రమేష్ బాబు అన్నారు. మండలంలోని బొమ్మకల్, గంట్లకుంట గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు మంగళవారం లేఖల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారులతో విద్యుత్ అధికారులకు ప్రత్యక్ష సంబంధాలు మెరుగుపడాలనే ఉద్దేశ్యంతో వినియోగదారుల ఇంటింటికి వెళ్లి తమ సిబ్బందితో కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలతో కూడిన సందేశ లేఖలను గృహ జ్యోతి, వ్యవసాయ వినియోగదారులకు అందజేస్తున్నట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి సైదులు గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్తినేని సోమన్న, ఎండీ ముక్తార్ పాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



**వర్ధన్నపేట, వుదయం ప్రతినిధి :** మండలం నల్లబెల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలను నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ప్రారంభించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలో మహిళలకు సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు మహిళలు ఉత్సాహంగా ఉల్లాసంతో పాల్గొని తీరు తీరు రంగులతో అందమైన ముగ్గులను వేయడం జరిగింది. సంక్రాంతి యొక్క ప్రతిష్టతను తెలియపరిచేలా ముగ్గులను మహిళలు అలంకరించడం జరిగింది. గ్రామంలో జరిగే శ్రీ రుక్మిణి సత్యభామ సహిత వేణు గోపాలస్వామి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రజలందరూ పండగను ఉత్సాహంగా జరుపుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు గ్రామ ప్రజలకు పండుగలను వాటి విశిష్టతను తెలియపరచడం కోసం ముగ్గుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మహిళలు పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారని అందరూ పండగ వాతావరణం లో సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ముగ్గులు వేసిన వారికి ప్రథమ బహుమతి బోళ్ల సింధు, ద్వితీయ బహుమతి ఆకారపు శివాని రమ్యశ్రీ, తృతీయ బహుమతి పసునూరి రవీనా మౌనిక గెలుపొందిన. ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రామంలో ప్రతి పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, వార్డు సభ్యులు మహమ్మద్ జమీలాభి, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ హుస్సేన్, గ్రామ ఏఈఓ శిరీష, గ్రామ కుల సంఘ పెద్దలు పోలసాని దేవేందర్‌రావు గొల్లపల్లి యాదగిరి, మహమ్మద్ జాఫర్, మరుపట్ల బాబు దుగ్యాల దుర్గారావు దోలి యాకయ్య బిర్రు యాకయ్య బొమ్మెర శ్రీనివాస్ బొజ్జ కృష్ణమూర్తి బొజ్జ నాగయ్య , తక్కలపల్లి శ్రీకాంత్ రావు బిర్రు రాములు బిర్రు చిన్న యాకయ్య బుర్ర చంద్రయ్య ,ప్రకాష్ కాంభోజయ్య యాకయ్య, గజ్జల దేవేందర్ పొన్నం వేణు కర్రె ఓంకార్ వెంకన్న పాల్గొన్నారు

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన



**హనుమకొండ, వుదయం ప్రతినిధి :** రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ వారు సర్వే ఆలివ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళ వారం రోజున దామెర పోలీసు వారు దామెర గ్రామ పరిధిలోని గురుకుల గ్రౌండ్ వద్ద రోడ్ సర్వే ఆలివ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, పరకాల ఏసిపి సతీష్ బాబు, పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై కొంక అశోక్, దామెర పోలీసు సిబ్బందితో పాటు 300 మంది దామెర మండలానికి చెందిన సర్పంచులు, నాయకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి, ఏసిపి రోడ్డు భద్రత యొక్క ప్రాధాన్యత అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడిపితే కలిగే నష్టాల గురించి, హెల్మెట్ యొక్క ప్రాధాన్యత గురించి, తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు డ్రైవింగ్ అనుమతి ఇస్తే జరిగే నష్టాల గురించి మరియు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని మరియు మోటారు వాహనాల చట్టం గురించి వివరించారు.

# గృహ జ్యోతితో తగ్గిన ఆర్థిక భారం



**జయశంకర్ భూపాలపల్లి , వుదయం జిల్లా ప్రతినిధి :** గృహ జ్యోతి పథకంతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గిందని మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నూతన సంవత్సర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు గ్రీటింగ్ కార్డ్స్ లను అందించే కార్యక్రమం చేపట్టగా మంగళవారం విద్యుత్ శాఖ మహాదేవపూర్ మండల ఏఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల కేంద్రంలో గ్రీటింగ్ కార్డులను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహాదేవపూర్ సర్పంచ్ హసీనా భానొ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకంతో పేద మధ్యతర గతి కుటుంబాల ప్రజలకు ఆర్థికంగా భారం తగ్గిందని ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షల పత్రాన్ని విడుదల చేశారని అన్నారు. బిల్లు కు ఉపయోగించే డబ్బును ఇంటి అవసరాలు,పిల్లల విద్యకు ఖర్చు చేసుకోవచ్చని దాని ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు అనంతరం విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ గృహ జ్యోతి పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం శుభాకాంక్షలు తెలిపే గ్రీటింగ్ లను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని అన్నారు మహాదేవపూర్ మండలంలో గృహ జ్యోతి పథకం కింద 5400 మంది లబ్ధిదారులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు మండలంలోని దాదాపు 1,000 మంది లబ్ధిదారులకు గ్రీటింగ్స్ అందజేయడం జరిగిందని అన్నారు నూతన ఇందిరమ్మ గృహాలు నిర్మించుకున్న వారు కొత్తగా రేషన్ కార్డు పొందిన వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతి పథకం అమలు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఇమ్రాన్ ఖాన్, సాయి, రేషన్ డీలర్ సంఘం జిల్లా నాయకుడు అజ్మత్, తోపాటు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు**



**ఖానాపురం, వుదయం ప్రతినిధి:** మండల కేంద్రానికి చెందిన పలువురు అనారోగ్యం బారిన పడి కోలుకొని తిరిగి ఇంటికి వచ్చిన వారికి నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు 2 లక్షల 83 వేల 500ల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులను అందుకున్న లబ్ధిదారు వేముల సారయ్య 97వేల 500లు, చల్ల రమ 60వేలు, ఆరికట్ల కోటేశ్వరమ్మ 60వేలు, కామన్ రాజలింగం 54వేలు, చూడి మోహన్ రెడ్డి 12వేల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తఫా, గ్రామ పార్టీ అధ్యక్షుడు యడ్ల బిక్షంరెడ్డి, వార్డు సభ్యులు చలిగంటి మల్లికార్జున్, వేములపెల్లి వెంకటప్రసాదరావు, శాఖమూరి ముకేశ్ చౌదరి, నాయకులు నీలం శోభన్, కామని శంకర్, దేవినేని వేణుగోపాల్ రావు, జటంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన తక్కెళ్ళపల్లి నాయకులు



**ఖానాపురం, వుదయం ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లా అధికార ప్రతినిధి మాజీ ఎంపీపీ మాజీ సొసైటీ చైర్మన్ తక్కలపల్లి రవీందర్ రావు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల రామారావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన తక్కెళ్ళపల్లికి కేటీఆర్ చేతుల మీదుగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పినారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన తక్కలపెల్లినీ ఉమ్మడి జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్, ధర్మారావుపేట గ్రామ సర్పంచ్ మాద్రాజు వెంకన్న, శివరామక్షేత్రం ఆలయ చైర్మన్ నడిపెల్లి రాజేశ్వర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి తక్కలపల్లిని మర్యాదపూర్వం కలిసి పూల బొకే అందించి శాలువా కప్పి కరెక్ట్ సమయంలో బిఆర్ఎస్ పార్టీలో చేరినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పేరుమండ్ల సత్యంగౌడ్, నాయకులు వెన్ను సమ్మయ్య, మేడి సమ్మయ్యగౌడ్, కోదాటి రవీందర్ రావు, కత్తుల వెంకటేశ్వర్ రావు, అడ్డూరి మోహన్‌రావు, కత్తుల మాధవరావు, తక్కలపెల్లి కరుణాకర్ రావు, తక్కలపల్లి ప్రభాకర్ రావు, ఆరెల్లి సంపత్ రావు, బొంపల్లి వెంకటేశ్వర్ రావు, పల్లెపాటి సంపత్ రావు, భాషబోయిన ఐలయ్య, చంచల కృష్ణ, జంగిలి బిక్షపతి, జక్కుల యాకయ్య, పోతరాజు కృష్ణ, కూస కుమార్, సొరప్ నవీన్, ఆరకాల ఎల్లస్వామి, గాదే కుమారస్వామి, జూకురి మల్లికార్జున్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై దాడి

**జయశంకర్ భూపాలపల్లి , వుదయం జిల్లా ప్రతినిధి:** పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు మహాదేవపూర్ ఎస్సై కె పవన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహదేవపూర్ మండలకేంద్రంలోని గడి హనుమాన్ నగర్ వాడలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి గడి హనుమాన్ వాడలో పెట్రోలింగ్ చేస్తుండగా కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారు అని తెలిపారు పోలీసులను చూసి పారిపోతుండగా మొత్తం 7 గురి వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 8,370,/ రూపాయలు, మరియు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# చక్కని ఆరోగ్యం

## తిండిని బట్టే నడక..

మనం రోజూ తినే వివిధ రకాల ఆహారాలలో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి ఎంతసేపు నడవాలి అనే విషయం చాలా మందికి తెలియదు. ఒక గంటకు 5 కి.మీ. బరువును బట్టి.. గంటకు 5 కి.మీ. వేగంతో నడవడం వల్ల నిమిషానికి 4-7 కిలో కేలరీలు ఖర్చవుతాయి. ఉదాహరణకు.. మీరు 400 కేలరీల భోజనం తింటే, ఆ కేలరీలను



వేగంతో నడిస్తే నిమిషానికి 4-7 కేలరీలు ఖర్చవుతాయి. ముఖ్యంగా రెండు సమోసాలలో ఉండే కేలరీలను కరిగించడానికి ఏకంగా 135 నిమిషాలు నడవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం తీసుకునే ప్రతి ఆహారం జీర్ణం కావడానికి లేదా దానిలోని కేలరీలను కరిగించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విషయంలో పోషకాహార నిపుణులు మనం తినే వివిధ రకాల ఆహారాలలో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి ఎంతసేపు నడవాలనే దాని గురించి వివరణాత్మక సమాచారాన్ని అందించారు. మీ వేగం, శరీర బర్న్ చేయడానికి దాదాపు 60-90 నిమిషాల నడక అవసరం అవుతుంది. బియ్యం..చపాతీ.. పరోటా.. బిర్యానీ: రోజువారీ ఆహారంలో తీసుకునే ప్రధాన వంటకాలైన అన్నం, చపాతీల విషయానికి వస్తే.. అన్నంలో ఉండే కేలరీలను జీర్ణం చేసుకోవడానికి 53 నిమిషాలు నడవాలి. అదే విధంగా మూడు చపాతీలలో ఉండే కేలరీలను బర్న్ చేయడానికి 70 నిమిషాల నడక అవసరం. ఆరోగ్యకరమైన చిరుతిండిగా భావించే రెండు గోధుమ పరాఠా తింటే 70 నిమిషాలు నడవాల్సి వస్తుంది. ఇక చాలా మంది ఇష్టపడే చికెన్ బిర్యానీలో దాదాపు 420 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి సుమారు 80-90 నిమిషాల నడక అవసరం అవుతుంది. స్నాక్స్ - ఫాస్ట్ ఫుడ్స్.. సమోసా.. పూరీ.. బర్గర్: నోరూరించే స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్స్ విషయంలో కేలరీల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు.. రెండు సమోసాలలో ఏకంగా 522 కేలరీలు ఉంటాయి. వీటిని కరిగించడానికి సుమారు 135 నిమిషాలు నడవాల్సి వస్తుంది. రుచికరమైన ఆలూ పూరీలో 444 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి 85 నిమిషాల నడక అవసరం. ఒక బర్గర్‌లో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి 75 నిమిషాలు నడవాలి. అయితే తేలికైనదిగా భావించే శాండ్‌విచ్‌లో ఉండే కేలరీలను కరిగించడానికి 53 నిమిషాలు నడవాలి. ఫ్రెంచ్ ఫ్రైస్‌లో ఉండే కేలరీలను బర్న్ చేయడానికి ఒక గంట పాటు నడవాల్సి వస్తుంది. దహీ చాట్.. నూడుల్స్: సాధారణంగా ఆరోగ్యకరమైనదిగా భావించే దహీ చాట్‌లో దాదాపు 450 కేలరీలు ఉంటాయి. వీటిని జీర్ణం చేసుకోవడానికి ఏకంగా 115 నిమిషాలు నడవాల్సి వస్తుంది. అదేవిధంగా తక్కువ సమయంలో తినే ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో 400 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి 80 నిమిషాల నడక అవసరం. కాబట్టి మనం ఇష్టంగా తీసుకునే ప్రతి ఆహారంలో ఉండే కేలరీలపై అవగాహన కలిగి ఉండటం, వాటిని బర్న్ చేయడానికి సరైన మొత్తంలో వ్యాయామం చేయడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు.

## లివర్‌ను కడిగిన ముత్యంలా మార్చే ఆయుర్వేద చిట్కా..



సమయం ఏదైనా అవకాశం దొరికినప్పుడల్లా చాలా మంది తినేందుకు ఆసక్తి చూపే పండ్లు.. అరటిపండ్లు. ఈ పండు కడుపు నింపుతుంది. పైగా పోషకమైనది. కానీ అరటిపండ్లతో పాటు వంటగదిలో ఉండే మరో మసాలా దినుసు కలిపి తినడం ద్వారా కాలేయ వ్యాధులను తరిమి కొట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నేచర్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. అరటిపండ్లు, మిరియాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి భలేగా పనిచేస్తాయని వెల్లడించింది. దీనిని తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా కొవ్వు కాలేయ సమస్యలతో బాధపడేవారికి ఇది అద్భుత సంజీవని. ఈ సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా అరటిపండ్లను మిరియాలతో కలిపి తీసుకోవడం వల్ల సమస్య నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఫ్యాటీ లివర్ అనేది ప్రాథమికంగా నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్. మద్యం తాగని వారిలోనూ ఈ రకమైన సమస్య పెరుగుతోంది. ఇటీవల, ఢిల్లీలోని ఎయిమ్స్ నిర్వహించిన సర్వే ప్రకారం మన దేశంలో 38.6 శాతం మందికి ఈ రకమైన ఫ్యాటీ లివర్ సమస్య ఉందని తేలింది. వ ద్ధులతోపాటు యువకులు కూడా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. చాలా మందికి ఫ్యాటీ లివర్ ఉన్నట్లు నిర్ధారణ అవుతున్నట్లు వైద్యులు సైతం చెబుతున్నారు. చాలా మంది సకాలంలో ఈ వ్యాధి గుర్తించడం లేదు. అరటిపండ్లలో విటమిన్ బీ6, విటమిన్ సి, డోపమైన్ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవన్నీ కాలేయంలో పేరుకుపోయిన హానికరమైన పదార్థాలను తొలగిస్తాయి. అంతే కాదు అరటి పండ్లలోని స్టార్చ్ కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. అరటిపండ్లలోని కరిగే ఫైబర్ పెక్టిన్ పేగులలోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచుతుంది. మిరియాలతో కలిపినప్పుడు అరటిపండ్ల ఈ లక్షణాలు మూడు రెట్లు పెరుగుతాయి. మిరియాలలో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలోని అన్ని ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కాలేయానికి చేరినప్పుడు కణాలను ఉత్తేజపరుస్తుంది. కాబట్టి అరటిపండ్లతో మిరియాలను కలిపి తినడం వల్ల కాలేయంలోని ప్రతి భాగం శుభ్రం అవుతుంది. అయితే రక్తంలో చక్కెర లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తినకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారా..? అయితే ఈ చిట్కాలను పాటించండి..!

ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది నిద్రలేమి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మనం మన నిద్ర నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు. నిద్రించే ముందు డిజిటల్ పరికరాలను ఎక్కువగా చూడడం వల్ల నిద్ర రావడం తగ్గుతుంది. కనుక నిద్ర పోవడానికి కనీసం అరగంట నుండి గంట ముందు డిజిటల్ పరికరాలను చూడడం ఆపేయాలి. దీంతో నిద్ర నాణ్యత పెరుగుతుంది. మరుసటి రోజు ఉత్సాహంగా పని చేసుకోవచ్చు. అదే విధంగా రోజూ ఒకే సమయానికి నిద్రించే అలవాటు చేసుకోవాలి. వారాంతంలో కూడా అదే సమయానికి నిద్రించేలా అలవాటు చేసుకోవాలి. నిద్రించే సమయం రోజూ మారే కొద్ది శరీరంలో ఉండే అంతర్గత గడియారం నిద్రను తిరిగి సమకాలీకరించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. కనుక రోజూ ఒకే సమయానికి నిద్రించడం మంచిది. అలాగే నిద్రించే గది వాతావరణం కూడా సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. ఉష్ణోగ్రత..మెదడుకు సంకేతాలు ఇవ్వడంలో భౌతిక వాతావరణం కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. గది ఉష్ణోగ్రత 18 డిగ్రీల నుండి 22 డిగ్రీల మధ్య ఉండేలా చూసుకోవాలి. గది ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. దీంతో గాఢ నిద్ర మన సొంతమవుతుంది. అలాగే గదిలో కాంతి ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. నిశ్శబ్ద వాతావరణం ఉండడం వల్ల నిద్రకు భంగం లేకుండా ఉంటుంది. నిద్రలేమితో బాధపడే వారు వారి సాయంత్రం సమయాన్ని తక్కువ సృజనాత్మక కలిగిన కార్యకలాపాలల్లో గడపాలి. దీంతో ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు తగ్గుతాయి. లోతైన నిద్రకు మనసు తేలికగా ఉండడం కూడా చాలా అవసరం. అలాగే మరుసటి రోజు చేయాల్సిన పనులను ముందుగానే అనుకుని నిద్రించాలి. ఇలా చేయడం వల్ల ఆలోచనలు తగ్గి నిద్ర బాగా పడుతుంది. కషాయాలు..నిద్రించడానికి ముందు మూలికా కషాయాలను తీసుకోవడం మంచిది. ఇవి నాడీ వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇక పగటి పూట మనం తీసుకునే ఆహారం కూడా రాత్రి నిద్రను ప్రభావితం చేస్తుంది. కెఫిన్ కలిగిన ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల రాత్రి నిద్ర తగ్గుతుంది. కనుక కెఫిన్ ఉండే పానీయాలను తక్కువగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, గింజలు అధికంగా తీసుకోవాలి.



శరీరంలో విటమిన్ డి, విటమిన్ బి12 లోపాలు లేకుండా చూసుకోవాలి. ఈ విధమైన చిట్కాలను పాటించడం వల్ల నిద్రలేమి సమస్య తగ్గుతుంది. మనం నాణ్యమైన నిద్రను సొంతం చేసుకోగలం. దీంతో మన శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

## నెల పాటు పూర్తిగా అన్నం తినడం మానేస్తే..

మనలో చాలామందికి అన్నం తినందే రోజు గడవదు. రోజుకు మూడు పూటలూ అన్నం తినే వారు ఉన్నారు. కానీ చాలా మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అన్నం తినకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అవును.. కొంతమంది రోజుకు ఒకసారి మాత్రమే అన్నం తింటారు. మనలో చాలామందికి అన్నం తినందే రోజు గడవదు. రోజుకు మూడు పూటలూ అన్నం తినే వారు ఉన్నారు. కానీ చాలా మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అన్నం తినకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అవును.. కొంతమంది రోజుకు ఒకసారి మాత్రమే అన్నం తింటారు. మరికొందరు అసలు అన్నమే ముట్టుకోరు. కాబట్టి ఇలా అన్నం మానేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందా, ఇది నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా అని చాలా మందికి సందేహం రావచ్చు. మన శరీరానికి త్వరగా శక్తినిచ్చే ప్రధాన వనరులలో అన్నం ఒకటి. మీరు అకస్మాత్తుగా అన్నం తినడం మానేస్తే, మీ శరీరం ఈ మార్పుకు అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది. మొదటి కొన్ని రోజుల్లో, మీకు ఆకలి పెరగడం, బలహీనత లేదా కొద్దిగా చిరాకు అనిపించవచ్చు. అందువల్ల, అన్నం బదులుగా మిల్లెట్, బార్లీ, క్వినోవా, గుమ్మడి గింజలు వంటి ఇతర ధాన్యాలను మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. అన్నం కార్బోహైడ్రేట్లతో సమ ద్ధిగా ఉంటుంది. సులభంగా జీర్ణమవుతుంది. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి తక్కువ కేలరీలు లభిస్తాయి. ఫలితంగా ఇది బరువు తగ్గడానికి దారితీస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు అన్నం తీసుకోవడం తగ్గించవచ్చు. తెల్ల బియ్యం త్వరగా జీర్ణమవుతాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. మీరు ఒక నెల పాటు అన్నం తినడం మానేస్తే, మీ రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. ఇది మధుమేహం ఉన్నవారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కొంతమందికి అన్నం తిన్న తర్వాత ఉబ్బరం లేదా మలబద్ధకం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే మీరు అన్నం తినడం మానేస్తే, మీకు మొదట్లో కొంత కడుపు నొప్పి లేదా మలబద్ధకం అనిపించవచ్చు. అయితే మీరు ఎక్కువ పండ్లు, కూరగాయలు, ధాన్యాలు తింటే మీ జీర్ణక్రియ త్వరగా మెరుగుపడుతుంది. బియ్యంలో విటమిన్ బి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. మీరు ఎక్కువసేపు అన్నం తినకపోతే, మీకు ఈ విటమిన్ లోపం ఏర్పడవచ్చు. దీని వలన అలసట, మానసిక స్థితిలో మార్పులు సంభవించవచ్చు. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి అవసరమైన విటమిన్ బి, ఇతర ముఖ్యమైన పోషకాలను ఇతర వనరుల నుంచి పొందవలసి ఉంటుంది. అలాగే ఆహారంలో ఆకు కూరలు, చిక్కుళ్ళు, గుడ్లు, పాలు వంటి ప్రత్యామ్నాయ ఆహారాలను చేర్చుకోవల్సి ఉంటుంది.



## ఉసిరి విటమిన్ సి అద్భుత నిలయం

ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి, చర్మం, జుట్టు ఆరోగ్యానికి.. అలాగే గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే ఉసిరిలో అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. ఇది కొంతమందికి హాని కలిగించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తక్కువ రక్తపోటు: ఉసిరి బీపీని తగ్గిస్తుంది. ఎక్కువ బీపీ ఉన్నవారికి ఇది మంచిది. కానీ మీకు ముందే తక్కువ బీపీ ఉంటే.. లేదా బీపీ తగ్గడానికి మందులు వాడుతుంటే ఉసిరిని ఎక్కువగా తింటే బీపీ ఇంకా తగ్గిపోతుంది. అప్పుడు తల తిరగడం లేదా నీరసం రావడం జరగవచ్చు. ఖాళీ కడుపుతో: ఉసిరిలో పులుపు ఎక్కువగా ఉంటుంది. పొద్దున్నే ఖాళీ కడుపుతో ఉసిరి లేదా ఉసిరి రసం తాగితే, కడుపు సున్నితంగా ఉన్నవారికి యాసిడిటీ, గ్యాస్ లేదా గుండెల్లో మంట రావచ్చు. అందుకే ఉసిరిని ఎప్పుడూ ఏదైనా తిన్న తర్వాతే తీసుకోవాలి. షుగర్ మందులు: ఉసిరి రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. మీరు ఇప్పటికే షుగర్ కోసం మందులు వాడుతుంటే, ఉసిరిని ఎక్కువగా తింటే షుగర్ మరీ ఎక్కువగా తగ్గిపోతుంది . ఇలాంటివారు డాక్టర్‌ను అడిగి మాత్రమే ఉసిరి తినాలి. ఆపరేషన్‌కు ముందు: ఉసిరి బీపీని, షుగర్‌ను ప్రభావితం చేస్తుంది కాబట్టి ఏదైనా ఆపరేషన్ జరగడానికి ముందు ఉసిరిని తినడం ఆపేయాలి. ఆపరేషన్ సమయంలో బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచడానికి ఈ జాగ్రత్త అవసరం. రక్తం త్వరగా గడ్డకట్టే సమస్య: ఉసిరి రక్తాన్ని పల్చగా చేస్తుంది. ఎవరికైతే రక్తం త్వరగా గడ్డకట్టే సమస్య ఉంటుందో, అలాంటివారు ఉసిరిని ఎక్కువగా తింటే, గాయమైనప్పుడు రక్తం కారడం ఎక్కువ కావచ్చు.



## స్లిమ్‌గా మార్చే సూపర్‌ఫుడ్స్..

ఈ మధ్య కాలంలో చాలా మంది స్లిమ్‌గా, అందంగా కనిపించాలని ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. బరువు తగ్గేందుకు జిమ్‌కు వెళ్లడం డైట్స్ ఫాలో అవ్వడం చేస్తున్నారు. మరికొందరూ హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూ బరువు తగ్గేందుకు రకరకాల ట్రీట్‌మెంట్స్ తీసుకుంటున్నారు. కానీ చాలా మంది వీటి నుంచి పూర్తి పరిష్కారం పొందలేకపోతున్నారు. అయితే మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా మీరు సులభంగా బరువుతగ్గవచని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాలీఫ్లవర్: బరువు తగ్గాలనుకునే వారికి కాలీఫ్లవర్ ఒక అద్భుతమైన ఆహారం. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల, దీనిని అన్నానికి బదులుగా తినవచ్చు. 100 గ్రాముల కాలీఫ్లవర్‌లో దాదాపు 25 గ్రాముల కేలరీలు ఉంటాయి. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా మీరు త్వరగా బరువు తగ్గేందుకు ఇది తోడ్పడుతుంది.ఆపిల్స్: ఆపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. 100 గ్రాముల ఆపిల్ లో దాదాపు 52 గ్రాముల కేలరీలు ఉంటాయి. అందువల్ల, ఇది ఆకలిని నియంత్రిస్తుంది అలాగే రోజంతా మీకు అవసరమైన శక్తిని అందిస్తుంది. పనీర్: పనీర్‌ను సోయా పాలతో తయారు చేస్తారు. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ముఖ్యంగా కొవ్వు, కాల్షియం, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల టోఫులో దాదాపు 76 గ్రాముల కేలరీలు ఉంటాయి. ఇది కూడా మీ ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. డ్రై ఫ్రూట్స్: బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, పిస్తా, బ్రెజిల్ నట్స్ , వేరుశెనగ వంటి గింజలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. డ్రై ఫ్రూట్స్‌లో అసంత ప్త కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల గింజల్లో దాదాపు 550-600 కేలరీలు ఉంటాయి. అందువల్ల, బరువు తగ్గాలనుకునే వారికి అవి తగినంత పోషకాలు , శక్తిని అందిస్తాయి. బీన్స్, పప్పులు: బీన్స్ ,పప్పులు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాలు. వీటిలో ముఖ్యంగా ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. 100 గ్రాముల బీన్స్, పప్పులు దాదాపు 333 కేలరీలు కలిగి ఉంటాయి. ఇవి ఆరోగ్యంతో పాటు అవసరమైన మేర బరువు తగ్గడానికి ఉపయోగపడుతాయి.



## వీటిని తిన్నారంటే ఎముకలు నుజ్జు కావడం ఖాయం!

కాల్షియం.. ఒంట్లో ఎముకలు, దంతాలను బలంగా ఉంచడమే కాకుండా రక్తపోటు, కండరాల నియంత్రణ, కణాల పనితీరును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అయితే ఎముకలను బలహీనపరిచే కొన్ని ఆహారాలు ఉన్నాయి. కాల్షియం శరీరానికి చాలా ముఖ్యమైన ఖనిజం. ఇది ఒంట్లో ఎముకలు, దంతాలను బలంగా ఉంచడమే కాకుండా రక్తపోటు, కండరాల నియంత్రణ, కణాల పనితీరును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అయితే ఎముకలను బలహీనపరిచే కొన్ని ఆహారాలు ఉన్నాయి. ముఖ్యంగా శీతల పానీయాలను నేటి కాలంలో చిన్నా పెద్దా అందరూ ఇష్టపడతారు. అయితే ఇవి తాగడం వల్ల ఒంట్లో కాల్షియం లోపానికి కారణమవుతాయి. ఈ పానీయాలలో ఫాస్ఫోరిక్ ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం శోషణను నిరోధిస్తుంది. దీని కారణంగా ఎముకలు క్రమంగా బలహీనపడతాయి. కాబట్టి శీతల పానీయాలు తాగడం తగ్గించాలి. ఎర్ర మాంసం (మేక మటన్), ప్రాసెస్ చేసిన మాంసం (ఉదా. సాసేజ్, బేకన్, హాట్ డాగ్స్) తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ సమస్యలు వస్తాయి. ఇది ఎముకలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఈ పదార్థం శరీరంలో కాల్షియం శోషణను ప్రభావితం చేస్తుంది. దీని కారణంగా ఎముకల ఆరోగ్యం క్షీణిస్తుంది.కేకులు, క్యాండీలు, కుకీలు వంటి తీపి, ప్రాసెస్ చేసిన బేకరీ ఆహారాల్లో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి కాల్షియం శోషణకు ఆటంకం కలిగిస్తాయి. ఈ ఆహారాలు శరీరంలో మంటను కలిగిస్తాయి. అవి ఎముకలను బలహీనపరుస్తాయి. అందుకే తీపి ఆహారాలకు దూరంగా ఉండాలి. టీలో కెఫిన్ ఉంటుంది. ఇది శరీరంలో కాల్షియం శోషణను తగ్గిస్తుంది. మీరు ఎక్కువగా టీ తాగితే మీ ఎముకల ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. టీ లేదా కాఫీ అధికంగా తీసుకోవడం వల్ల ఎముకల నుంచి కాల్షియం తగ్గుతుంది. ఇది ఎముకలను బలహీనపరుస్తుంది. కాబట్టి టీ, కాఫీ తాగడం తగ్గించి, నీళ్లు, ఇతర కాల్షియం అధికంగా ఉండే పానీయాలు తీసుకోవాలి.ఆల్కహాల్ తాగడం వల్ల ఎముకలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆల్కహాల్ శరీరంలో కాల్షియం శోషణను తగ్గిస్తుంది. ఇది మీ ఎముకలను బలహీనపరుస్తుంది. ఇది పెళుసు ఎముకలకు కారణమవుతుంది. ఎముక పగుళ్ల రేటు పెరుగుతుంది. మీకు బలమైన ఎముకలు కావాలంటే మద్యం సేవించడం వెంటనే మానేయాలి. సమోసాలు, వేయించిన చికెన్, బజ్జీ వంటి నూనె పదార్థాలు రుచికి భలేగా ఉంటాయి. వీటిల్లోని కొవ్వు , అసమతుల్య కొవ్వులు శరీరంలో వాపుకు కారణమవుతాయి. దీనివల్ల శరీరంలో కాల్షియం శోషణ తగ్గుతుంది. ఎముకలు బలహీనపడతాయి. ఈ ఆహారాల వినియోగాన్ని కనిష్టంగా తగ్గించాలి. బదులుగా తేలికపాటి ఆహారం తీసుకోవాలి. తద్వారా మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



# ఇరాన్‌తో వ్యాపారం చేస్తే 25శాతం టారిఫ్‌లు..



రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా ఇప్పటికే 50శాతం సుంకాలను ఎదుర్కొంటోన్న భారత్‌కు తాజాగా మరో సవాల్ ఎదురైంది. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనే ఇందుక్కారణం. ఎందుకంటే ఇరాన్ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో భారత్ ఇరాన్-భారత్ వాణిజ్యం ఇలా.. టెహ్రాన్‌లోని భారత ఎంబసీ గణాంకాల ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం 1.24 బిలియన్ డాలర్ల విలు వైన ఉత్పత్తులను ఇరాన్‌కు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో 0.44 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను టెహ్రాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అంటే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ దాదాపు 1.68 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.15వేల కోట్లకు పైమాటే. భారత్ నుంచి ప్రధానంగా బియ్యం, తేయాకు, చక్కెర, ఫార్మా, ఆర్గానిక్ రసాయనాలు వంటివి ఇరాన్‌కు ఎగుమతి అవుతున్నాయి. వీటిలో అత్యధికంగా సేంద్రియ రసాయనాల ఎగుమతుల విలువ 512.92 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇక, టెహ్రాన్ నుంచి మనం పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్, పండ్లు, నట్స్ వంటి వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 311.60 బిలియన్ డాలర్ల విలువైన పిస్తా, ఇతర ఎండు ఫలాలు, నట్స్ ఇరాన్ నుంచి దిగుమతి అయ్యాయి. అయితే ట్రంప్ నిర్ణయం వాణిజ్యపరంగానే గాక, భారత వ్యూహాత్మక ప్రయోజనాల పైనా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. భారత ప్రాంతీ య అనుసంధాన ప్రణాళికలు, సరఫరా గొలుసుకు ఇరాన్‌తో కలిసి చేపడుతోన్న చాబహార్ పోర్ట్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం. గతంలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించిన సమయంలో ఈ పోర్ట్‌కు కొన్ని మినహాయింపులు కల్పించింది. ఇప్పుడు తాజా టారిఫ్‌ల ప్రకటనతో ఈ ప్రాజెక్ట్ భవితవ్యంపై అనిశ్చితి నెలకొంది.75శాతం బాదుడు తప్పదా? రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో ఇప్పటికే భారత ఉత్పత్తులపై ట్రంప్ 50శాతం సుంకాలను వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలోనే రెండు దేశాలు ట్రేడ్ డీల్ చేసుకునేందుకు గత కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నాయి. ఈ పరిణామాల వేళ తాజా టారిఫ్‌ల ప్రకటనతో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై మరోసారి సందిగ్ధత నెలకొంది. అంతేకాదు.. ఇరాన్‌తో వాణిజ్య సంబంధా లు కొనసాగితే.. భారత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 75 శాతానికి పెరుగుతాయి. అది మన దేశంలోని పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. అయితే, ట్రంప్ జాగా ప్రకటించిన టారిఫ్‌లు ఎంత వరకు అమల్లో ఉంటాయనే దానిపైనా స్పష్టత లేదు.

## బిజినెస్

# టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్స్ వెహికల్స్.. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.5.59 లక్షల



(ఎక్స్-షోరూమ) నుంచి ప్రారంభమవుతుంది. నేటి నుంచి (జనవరి 13) బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో హ్యుందాయ్ ఎక్స్‌టర్, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వంటి కార్లతో ఇది పోటీ పడనుంది.టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్.. పంచ్.ఈవీని పోలి ఉంటుంది. కొత్త పంచ్‌లో ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్‌ను రీడిజైన్ చేశారు. డీఆర్ఎల్స్‌ను కొత్తగా తీర్చిదిద్దారు. స్పోర్టియర్ బంపర్స్, సరికొత్త అల్లాయ్ డిజైన్, కొత్త ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్ క్లస్టర్ ఆకట్టుకుంటాయి. ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, రేర్ వాషర్ వైపర్స్‌ను ఇచ్చారు. కొత్తగా సైంటిఫిక్, కారామెల్, బెంగాల్ రూజ్, కూర్గ్ క్లౌడ్స్ వంటి కలర్ ఆప్షన్స్‌తో పంచ్ లభిస్తుంది.ఇంటీరియర్ పరంగానూ పలు మార్పులు చేశారు. ఇందులో 26.03 సెంటిటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోన్‌మెంట్ యూనిట్, 17.8 సెంటిటర్ల డిజిటల్ క్లస్టర్ ఉన్నాయి. 360 డిగ్రీల సరౌండ్ వ్యూ, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, ఆటోడిమ్మింగ్ ఐఆర్‌వీఎం వంటివి ఉన్నాయి. అడల్ట్, చైల్డ్ సేఫ్టీ పరంగా 5 స్టార్ రేటింగ్ ఉంది. 6 ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ 1.2 లీటర్ ఐటర్బో పెట్రోల్ ఇంజిన్, 1.2 లీటర్ రెవోట్రాన్ (పెట్రోల్ ఇంజిన్), సీఎన్‌జీ వంటి ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తుంది. మొత్తం ఆరు వేరియంట్లు అందుబాటులో ఉంటాయి.

# టీసీఎస్‌కు 'కార్మిక' కష్టాలు
# క్షీణించిన మూడో త్రైమాసిక లాభం

### కొత్త లేబర్ కోడ్ అమలు ప్రభావం
### 11,000కు పైగా తగ్గిన ఉద్యోగుల సంఖ్య
### రూ.57 డివిడెండు ప్రకటన

దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఆర్థిక ఫలితాల్లో డీలా పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో కంపెనీ నికరలాభం రూ.10,657 కోట్లకు పరిమితమైంది. 2024-25 ఇదే



కాల లాభం రూ.12,075 కోట్లతో పోలిస్తే, ఇది 13.91% తక్కువ. కొత్త కార్మిక చట్టాలను అమలు చేయడం వల్లే, సంస్థ లాభంపై ప్రభావం పడిందని వివరించింది. ఇవీ కారణాలుసక్షా త్రైమాసికంలో కొత్త లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు రూ.2,128 కోట్లు పక్కనపెట్టింది. ఇందులో రూ.1,800 కోట్లు గ్రాట్యుటీ, రూ.300 కోట్లు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకోకపోతే లాభం 8.5% వృద్ధితో రూ.13,438 కోట్లకు చేరి ఉండేది. ఈ కోడ్‌ల వల్ల మార్జిన్లపై భవిష్యత్తులోనూ 0.10-0.15% ప్రభావం పడొచ్చని సీఎఫ్ఓ సర్ సక్సేరియా పేర్కొన్నారు. 2025 జులైలో ప్రకటించిన పునర్నిర్మాణ కార్యక్రమం వల్ల ఏర్పడ్డ వ్యయాలూ ప్రభావం చూపాయి. అమెరికాలో కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ)తో ఎప్పటి నుంచో కొనసాగుతున్న న్యాయ వివాదం నేపథ్యంలో, పరిహారం కింద రూ.1,010 కోట్లను కేటాయించాల్సి వచ్చింది.మళ్లీ తగ్గిన ఉద్యోగుల సంఖ్య2025 డిసెంబరు 31 నాటికి సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,82,163కు పరిమితమైంది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, అక్టోబరు-డిసెంబరులో ఉద్యోగుల సంఖ్య 11,151 తగ్గింది. 12,000 మందిని లేఆఫ్ చేయనున్నట్లు ఈ ఆర్థిక సంవత్సరం మొదట్లో టీసీఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు త్రైమాసికంలో 19,755 మేర సిబ్బంది సంఖ్య తగ్గిందని తెలిపింది. తాము ప్రకటించిన పునర్నిర్మాణ కార్యకలాపాల వల్ల 6,000 మంది ఉద్యోగులపైనే ప్రభావం పడిందని కంపెనీ తెలిపింది.రెట్టింపు సంఖ్యలో తాజా ఉత్తీర్ణుల నియామకాలు తాజా ఉత్తీర్ణుల (గ్రాడ్యుయేట్ల)ను రెట్టింపు సంఖ్యలో తీసుకున్నామని కంపెనీ చీఫ్ హెచ్ఆర్ఓ సుదీప్ కున్నుమల్ పేర్కొన్నారు. ఆగస్టులో చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమం కారణంగా 1800 నిష్క్రమణలు చోటు చేసుకున్నాయని ఆయన అన్నారు. పెరిగిన ఆదాయాలు 2025-26 అక్టోబరు-డిసెంబరులో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.67,087 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.63,973 కోట్లతో పోలిస్తే, ఇది 4.86% అధికం. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఆపరేటింగ్ లాభాల మార్జిన్ స్థిరంగా 25.2% వద్ద నిలిచింది. 2024-25 ఇదే సమయంలోని 24.5 శాతంతో పోలిస్తే, ఈసారి అధికంగా ఉంది.2 డివిడెండ్ల ప్రకటన: ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండు, రూ.46 ప్రత్యేక డివిడెండు (మొత్తం రూ.57)ను సంస్థ ప్రకటించింది.

# డి-మార్ట్‌లో సరుకుల రేట్స్ ఎందుకు అంత తక్కువగా ఉంటాయి?

డి మార్ట్ ప్రస్తుతం భారతదేశంలో మధ్యతరగతి కుటుంబాలకు అత్యంత విశ్వసనీయమైన సూపర్ మార్కెట్‌లో ఒకటి. చిన్న మ్యాగీ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, ఇలా ఇంట్లోకి ఏ నిత్యావసర వస్తువుల కావాలన్నా డిమార్ట్ వెళ్లాల్సిందే.ఎందుకంటే అక్కడ ప్రతిదానిపై మన డిస్కౌంట్ లభిస్తుంది.. ఇతర మార్కెట్‌లో పోల్చుకుంటే అక్కడ తక్కువ ధరకు సరుకులు దొరుకుతాయి. ఉదాహరణకు, డి మార్ట్ రూ.149 విలువైన పాల ఉత్పత్తులను ఆఫర్ కింద రూ.99లకే పొందచ్చు. అలానే రూ. 99 ఉన్న మ్యాగీని రూ.73కి విక్రయిస్తుంది. అందుకే చాలా మంది డీమార్ట్ వెళ్లి షాపింగ్ చేస్తారు. ఈ ఆఫర్‌ల కారణంగా డీమార్ట్ ఇతర మార్కెట్‌లను వెనక్కి నూకి టాప్‌లో ఉంటుంది.తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలుఅయితే ఇక్కడ చాలా మందికి వచ్చే డౌట్ ఏమిటంటే.. తక్కువ ధరకే సరుకులు ఇవ్వడం ద్వారా డీమార్ట్‌కు నష్టాలు రావా అని.. చాలా మందికి తెలియన విషయం ఏమిటంటే.. డీ మార్ట్ అనే కంపెనీ ఎక్కువ లాభం పొందడం కంటే తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలు చేయడంపై దృష్టి



పెడుతుంది. డి మార్ట్‌లో రోజువారీ నిత్యావసర వస్తువులు ఎక్కువగా అమ్ముడవుతాయి. దీంతో స్టాక్‌ను త్వరగా అమ్మివేసి, దాని పెట్టుబడిపై త్వరగా రాబడిని పొందుతుంది. ఇక్కడ రు తెలుసుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, డీమార్ట్ కంపెనీ సరఫరాదారులతో వ్యవహరించే విధానం. సాధారణంగా ఇతర రిల్ కంపెనీలు విక్రేత బిల్లులను క్లియర్ చేయడానికి తీసుకుంటారు. కానీ డీమార్ట్ మాత్రం ప్రతి నెలా బిల్స్ క్లియర్ చేస్తుంది. దీంతో తయారీ దారుకుల కాస్తా తక్కువ ధరకే డీమార్ట్‌కు వస్తువుల సరఫరా చేస్తారు. ఒకేసారి బల్క్‌లో వస్తువులను కొనుగోలు చేయడంద్వారా కంపెనీకి భారీ లభిస్తుంది. ఖర్చుల విషయంలో జాగ్రత్తలుడి మార్ట్ తన ఖర్చుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంది. డిమార్ట్ ఎక్కువగా సొంతం స్థలంలోనే సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసుకుంటుంది. ఎక్కడైనా రెంట్ తీసుకోవాల్సి వాటిని దీర్ఘకాలిక లీజులకు తీసుకుంటుంది. అందుకే ఖాళీ షెటర్‌లను అద్దెకు ఇస్తుంది.తద్వారా, అద్దె ఖర్చు తగ్గుతుంది. డి మార్ట్ ఖరీదైన ఇంటీరియర్స్, భారీ ఎయిర్ కండిషనింగ్, మ్యూజిక్ సిస్టమ్స్ మొదలైన వాటిపై పెద్దగా ఖర్చు చేయదు దాని వల్ల ఆదా చేసిన డబ్బును డిస్కౌంట్ల రూపంలో కస్టమర్లకు అందిస్తుంది.

# హెచ్‌సీఎల్' ఆదాయం పెరిగినా.. లాభం తగ్గింది

ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరులో రూ.4,076 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4,591 కోట్లతో పోలిస్తే ఇది 11.2% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.29,890 కోట్ల నుంచి 13.3% పెరిగి రూ.33,872 కోట్లకు చేరింది. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, నికర లాభం 3.7% తగ్గినా, ఆదాయం 6% పెరిగింది.'సక్షా త్రైమాసికంలో బలమైన ఆదాయం నమోదు కావడంతో, ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 15 బి.డాలర్లు (సుమారు రూ.1.35 లక్షల కోట్లు) అధిగమించే అవకాశం కనిపిస్తోంది. కొత్త ఆర్డర్లు 3 బి.డాలర్ల (రూ.27,000 కోట్ల) మేర లభించాయి. సాఫ్ట్‌వేర్ ఆదాయం స్థిర కరెన్సీ ప్రకారం త్రైమాసిక ప్రాతిపదికన 28.1%, వార్షిక ప్రాతిపదికన 3.1% పెరిగాయి. క్లయింట్ల ఏఐ గిరాకీకి తగ్గట్లు, మేం రూపాంతరం చెందుతున్నామ'ని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సి.విజయకుమార్ వెల్లడించారు. సక్షా త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ 2,852 మంది తాజా ఉత్తీర్ణుల (ఫ్రెషర్స్)ను తీసుకుంది. డిసెంబరు ఆఖరుకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,26,379కు చేరింది.ఫ్రెషర్లలో అత్యున్నత నైపుణ్యాలుంటే: ఎలైట్ ఇంజినీర్ల నియామక వ్యూహంలో భాగంగా, అధునాతన నైపుణ్యాలున్న తాజా ఉత్తీర్ణులకు వార్షికంగా రూ.18-22 లక్షల వేతనం చెల్లించేందుకు కంపెనీ సిద్ధమైంది. ప్రామాణిక ప్రారంభ స్థాయి ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే ఇది 3-4 రెట్లు ఎక్కువ.విక్రయ వృద్ధి అంచనాల్లో మార్పులుహెచ్‌సీఎల్ టెక్ 2025-26 విక్రయాల్లో గరిష్ఠ వృద్ధి అంచనాను 5%



నుంచి 4.5 శాతానికి కుదించినా, కనిష్ఠ వృద్ధి అంచనాను 3% నుంచి 4 శాతానికి పెంచింది. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, విక్రయాల అంచనాల్లో వృద్ధి స్థిర కరెన్సీ ప్రాతిపదికన 4-4.5 శాతంగా ఉంచింది. సెప్టెంబరు త్రైమాసికం ఆఖర్లో ఇది 3-5 శాతంగా తెలిపింది. సేవల విభాగంలో 2025-26 విక్రయాల వృద్ధి అంచనాను 4-5% నుంచి 4.75-5.25 శాతానికి పెంచింది. డిసెంబరు త్రైమాసికంలో స్థిర కరెన్సీ వద్ద ఈ విభాగంలో ఆదాయ వృద్ధి 5 శాతంగా నమోదైంది.కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను 17-18% వద్ద మార్పు లేకుండా ఉంచింది. కొత్త లేబర్ కోడ్‌ల అమలు నేపథ్యంలో, గ్రూప్‌లోని ఉద్యోగుల ప్రయోజనాల కోసం, ఏక కాల కేటాయింపులు రూ.9,560 కోట్లు జరిపినట్లు .. ఈ ప్రభావాన్ని మినహాయిస్తూ, ఇచ్చిన ఎబిటా మార్జిన్ అంచనా ఇది. అని వివరించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.12 చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించనున్నారు.

## క్రీడలు

### ఆ భారత బ్యాటర్ మరో 34 పరుగులు



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన రికార్డ్‌కు కేవలం 34 పరుగుల దూరంలోనే ఉన్నాడు. రాజ్‌కోట్ వేదికగా బుధవారం న్యూజిలాండ్‌తో రెండో వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌లోనే అతడు ఈ ఘనతను సాధించే అవకాశముంది. శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం వన్డేల్లో 68 ఇన్నింగ్స్‌ల్లో 47.83 యావరేజ్‌తో 2,966 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలున్నాయి. అతడు మరో 34 రన్స్ చేస్తే అత్యంత వేగంగా 3000 పరుగుల మైలురాయిని చేరుకున్న భారత బ్యాటర్‌గా నిలిచే అవకాశముంది. ఈక్రమంలో శ్రేయస్ అయ్యర్.. శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీ రికార్డ్‌ను బ్రేక్ చేసే ఛాన్స్ ఉంది. శిఖర్ ధావన్ 72 ఇన్నింగ్స్‌ల్లో, విరాట్ 75 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఫీట్‌ను సాధించారు. న్యూజిలాండ్‌తో జరగనున్న రెండోవన్డేలో శ్రేయస్‌అయ్యర్ ఈ ఘనత సాధిస్తే.. ప్రపంచంలోనే అత్యంత వేగంగా మూడువేల పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా, వీవీయన్ రిచర్డ్స్‌తో సమంగా నిలుస్తాడు. ఈ జాబితాలో హషీమ్ ఆమ్లా మొదటి స్థానంలో ఉన్నాడు. అతడు కేవలం 57 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయిని చేరుకున్నాడు.

# డబ్ల్యూపీఎల్‌లో నయా మెరుపులు!



టీ20 అంటేనే యువ క్రికెటర్ల ఫార్మాట్. పురుషుల్లో అయినా, మహిళల్లో అయినా టీ20 లీగ్స్ వర్ధమాన క్రీడాకారులు ప్రతిభను చాటుకోవడానికి గొప్ప వేదికలుగా నిలుస్తుంటాయి. భారత్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎంతమంది కుర్రాళ్లను వెలుగులోకి తెచ్చిందో లెక్కే లేదు. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) కూడా అంతే. ఇప్పటికే మూడు సీజన్లతో అలరించిన డబ్ల్యూపీఎల్ (చిఖఒ).. ఇప్పుడు నాలుగో సీజన్‌తో సందడి చేస్తోంది. తొలిసారి డబ్ల్యూపీఎల్ ఆడుతున్న క్రికెటర్లకు తోడు.. ఇప్పటికే లీగ్‌లోకి వచ్చినా, పెద్దగా సత్తా చాటుకోని అమ్మాయిలు.. ఈసారి తమదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వారి మెరుపులు మొదలైపోయాయి.నదైన్ డి క్లెర్క్ మహిళల అంతర్జాతీయ క్రికెట్‌ను అనుసరిస్తున్న వారికి ఈ పేరును కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ దక్షిణాఫ్రికా క్రికెటర్ కొన్నేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్లో రాణిస్తోంది. అయితే తన పేరు మార్మోగింది మాత్రం గతేడాది వన్డే ప్రపంచకప్‌లోనే. భారత్‌తో లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు ఓటమి ఖాయమనుకున్న దశలో ఆమె 84 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు అనూహ్య విజయాన్నందించింది. ఆ టోర్నీలో మరికొన్ని ఉపయుక్తమైన ఇన్నింగ్స్‌లు ఆడడమే కాక, బౌలింగ్‌లోనూ రాణించిన నదైన్‌కు డబ్ల్యూపీఎల్ వేలంలో మంచి డిమాండే ఉంది. బెంగళూరు ఫ్రాంఛైజీ ఆమె ద రూ.65 లక్షలు పెట్టింది. ఈ ధరకు తొలి మ్యాచ్‌ల్లోనే పూర్తి న్యాయం చేసింది నదైన్. ఇంతకుముందే డబ్ల్యూపీఎల్‌లో అవకాశం దక్కించుకున్నప్పటికీ ఒక్క మ్యాచే ఆడిన నదైన్.. ఈ సీజన్ తొలి పోరులో తన విశ్వరూపాన్ని చూపించింది. బౌలింగ్‌లో 4 వికెట్లు తీయడమే కాక, 63 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో ముంబయిపై బెంగళూరుకు అనూహ్య విజయాన్నందించింది. దీంతో ఒక్కసారిగా టోర్నీలో అందరి దృష్టీ నదైన్ వైపు మళ్లింది. యూపీ వారియర్స్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో ఆమె రెండు వికెట్లు తీసుకుంది. ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్లలో లారెన్ బెల్ ఒకరు. ఈ ఇంగ్లాండ్ అమ్మాయి.. అంతర్జాతీయ క్రికెట్లో ఇప్పటికే మంచి పేరు సంపాదించింది. కొన్నేళ్లుగా ఇంగ్లిష్ జట్టుకు ప్రధాన పేసర్‌గా కొనసాగుతోంది. పొడగరి అయిన లారెన్.. మంచి లయ, వేగంతో బౌలింగ్ చేస్తుంది. అయితే డబ్ల్యూపీఎల్‌లో ఆమెకు కొంచెం ఆలస్యంగానే అవకాశం దక్కింది. ఈ ఏడాది ఆర్సీబీ ఆమెను రూ.90 లక్షలకు కొనుగోలు చేసింది. తనకు అంత ధర పెట్టడం న్యాయమే అని ఆమె తొలి మ్యాచ్‌లోనే రుజువు చేసింది. అమేలియా కెర్ లాంటి దూకుడైన బ్యాటర్ క్రీజులో ఉండగా బెల్.. ఈ సీజన్ తొలి ఓవర్లోనే మెయిడిన్ చేసింది. 4 ఓవర్లలో 14 పరుగులే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టింది. యూపీ వారియర్స్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ గొప్ప ప్రదర్శనే చేసింది. 4 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకుంది. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్‌లోకి అరంగేట్రం చేసిన ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ నికోలా కేరీ. ముంబయి తరఫున తొలి రెండు మ్యాచ్‌ల్లో అదరగొట్టింది. తొలి పోరులో 29 బంతుల్లోనే 40 పరుగులు చేసిన కేరీ.. 2 కీలక వికెట్లూ తీసింది. రెండో మ్యాచ్‌లో 21 పరుగులు చేయడమే గాక.. 3 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. నికోలా మెరుగైన ఫీల్డర్ కూడా. రూ.30 లక్షలతో ముంబయి సొంతమైన నికోలా.. తన ధరకు మించిన ప్రదర్శనే చేయబోతోందని తొలి రెండు మ్యాచ్‌ల్లోనే అర్థమైంది. ఇక లేటు వయసులో డబ్ల్యూపీఎల్‌లో అడుగుపెట్టిన దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ లిజెలీ లీ.. తన భారీ అవతారంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. అలాఉండి కూడా చురుగ్గా వికెట్ కీపింగ్ చేస్తూ, బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తూ ఆకట్టుకుంటోంది. గుజరాత్‌తో మ్యాచ్‌లో లిజెలీ 86 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. వేలంలో ఆమెకు దక్కిన ధర రూ.30 లక్షలు. ప్రపంచ మేటి స్పిన్నర్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అలానా కింగ్ (దిల్లీ) కూడా డబ్ల్యూపీఎల్‌పై తనదైన ముద్ర వేయాలని చూస్తోంది. ఇప్పటివరకు ఒక్క ఐపీఎల్ మ్యాచే ఆడిన అలానా.. ఈ సీజన్లో మరిన్ని అవకాశాలు దక్కుతాయని ఆశిస్తోంది.

# విరాట్ 93 పరుగులు చేసినా..
# సెంచరీ చేయలేదు అంటున్నారు: మహమ్మద్ కైఫ్

వడోదర వేదికగా ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో విరాట్ కోహ్లీ 93 పరుగులు చేసి, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో అతడు తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. విరాట్ కోహ్లీపై అభిమానుల కున్న అంచనాల గురించి టీమ్ఇండియా ) మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ *న యూట్యూబ్ ఛానల్ వేదికగా మాట్లాడాడు. ''మ్యాచ్ సందర్భంగా ఓ పిల్లాడు గ్రౌండ్‌లో ప్లకార్డ్ పట్టుకున్నాడు. దానిద.. 'కోహ్లీ సెంచరీ చేయకుంటే.. నేను వారం వరకు అన్నం తినను' అని రాసి ఉంది. విరాట్ కోహ్లీ ప్రస్తావన రాగానే.. అభిమానులు సెంచరీ గురించే చర్చిస్తున్నారు. ఇది విరాట్‌పై అభిమానులకున్న అంచనాలను సూచిస్తోంది. కోహ్లీ 93 పరుగులు సాధించాడు. మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేశాడు. అయినప్పటికీ అభిమానులు మాత్రం విరాట్ సెంచరీ చేయలేకపోయాడని బాధ పడుతున్నారు' అని మహ్మద్ కైఫ్ అన్నాడు. 'గాయం తర్వాత వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌కు రాకుండా ఉండాల్సింది'న్యూజిలాండ్‌తో తొలి వన్డే సందర్భంగా గాయపడిన వాషింగ్టన్ సుందర్ ( బ్యాటింగ్‌కు రాకుండా ఉండాల్సిందని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో అతడు ఏడు బంతులు ఎదుర్కొని ఏడు పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ ఫినిషర్ పాత్ర పోషించి, టీమ్ఇండియాకు విజయాన్ని అందించాడు. అయితే గతంలో గాయం సందర్భంగా శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌కు రాలేదని, వాషింగ్టన్ మాత్రం వచ్చాడని కైఫ్ అన్నాడు. ఆటగాళ్లు గాయపడినప్పుడు రిస్క్ చేయకూడదని, దానివల్ల గాయం మరింత పెద్దదవుతుందని అతడు టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. అతడు అసలే మారలేదు: రవిచంద్రన్ అశ్విన్'కు గుర్తుందా.. కోల్‌కతా టెస్ట్‌లో శుభ్‌మన్ గిల్ గాయపడినప్పుడు, అతడు బ్యాటింగ్ చేయడానికి రాలేదు. అది చాలా హైస్కోరింగ్ గేమ్. ఆ మ్యాచ్‌లో గిల్ బ్యాటింగ్‌కు వచ్చి 20 నుంచి 30 పరుగులు చేసినా



టీమ్ఇండియా గెలిచి ఉండేదని అభిమానులు భావించారు. కానీ టీమ్ మేనేజ్‌మెంట్ అతడి విషయంలో రిస్క్ తీసుకోలేదు. కానీ వాషింగ్టన్ సుందర్ విషయంలో మాత్రం దానికి విరుద్ధంగా జరిగింది. అది సరైన నిర్ణయం కాదని నా అభిప్రాయం. అతడి వల్ల వికెట్ల మధ్య కేఎల్ రాహుల్ పరుగులపై ప్రభావం పడింది. సుందర్ సరిగా పరిగెత్తలేకపోవడం వల్ల 2 రన్స్ రావాల్సిన చోట సింగిల్స్ మాత్రమే వచ్చాయి.

# బంగ్లా భద్రతకే ముప్పు లేదు!

దిల్లీ: భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడడంలో బంగ్లా ఆటగాళ్లకు భద్రత పరంగా ఏ ఇబ్బందీ ఉండదని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విన్నపం పట్ల సానుకూలంగా స్పందించని ఐసీసీ.. భారత్‌కు తమ ఆటగాళ్లను పంపలేమనడానికి బీసీబీ చెబుతున్న కారణాల పట్ల సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. బంగ్లా ఆటగాళ్లకు భారత్‌లో ముప్పు వాటిల్లేందుకు ఆస్కారం పెద్దగా లేదని ఐసీసీ నివేదికలో తేలింది! ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్‌తో పాటు శ్రీలంక కూడా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా తమ దేశానికి రానందుకు.. ఈ టోర్నీ కోసం పాకిస్థాన్ జట్టు భారత్‌లో పర్యటించట్లేదు. తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడబోతోంది. మరోవైపు బంగ్లాదేశ్‌తో భారత్ దౌత్య సంబంధాలు దెబ్బతినడం.. ఆ దేశంలో హిందువులపై తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతుండడంతో బంగ్లా పేసర్‌ను ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ వేలంలో ఎంచుకోవడంపై భారత అభిమానుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో బీసీసీఐ ఆదేశాల మేర కు కేకేఆర్ అతణ్ని విడుదల చేయడంతో.. భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రత ద ఆందోళన వ్యక్తం చేస్తూ తమ మ్యాచ్‌లను సైతం లంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీని కోరింది.




# టైటిల్‌పై భారత షట్లర్ల గురి

చిరాగ్, సాత్విక్, పి.వి.సింధు, ప్రణయ్, ఆయుష్ శెట్టి



దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ గురిపెట్టారు. సొంతగడ్డ ప్రయోజనాన్ని సానుకూలంగా మలుచుకుని ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను సొంతం చేసుకోవాలని సింధు, లక్ష్యసేన్ పట్టుదలగా ఉన్నారు. గతంలో భారత్ తరఫున సైనా నెహ్వాల్ (2010).. కిదాంబి శ్రీకాంత్ (2015).. సింధు (2017).. లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి (2022) ఇండియా ఓపెన్‌లో విజేతలుగా నిలిచారు. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో నుయన్ లిన్ (వియత్నాం)తో సింధు, పాయ్ యు (చైనీస్ తైపీ)తో మాళవిక బాన్సోద్, వాంగ్ యి (చైనా)తో తన్విశర్మ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టితో లక్ష్యసేన్, శ్రీకాంత్‌తో తరుణ్ మన్నెపల్లి, లీ చుక్ (హాంకాంగ్)తో హెచ్.ఎస్.ప్రణయ్ పోటీపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో చెన్ జి- ప్రెస్లీ స్మిత్ (అమెరికా)తో సాత్విక్- చిరాగ్.. మహిళల డబుల్స్‌లో ఓర్నిచా- సుకిత (థాయ్‌లాండ్)తో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.



# 4 రోజుల్లో రూ. 201 కోట్లు

## బాక్సాఫీస్ వద్ద 'ది రాజా సాబ్' జోరు

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ నటించిన లేటెస్ట్ హారర్‌కామెడీ ఎంటర్టైనర్ 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. మారుతి దర్శకత్వంలో జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా మిక్స్‌డ్ టాక్ కలెక్షన్లపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది. తాజాగా ఈ సినిమా నాలుగు రోజుల్లోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో అధికారికంగా అడుగుపెట్టింది. విడుదలైన మొదటి రోజే రూ. 100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ప్రభాస్, తాజాగా నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 201 కోట్ల గ్రాస్ మార్కును అందుకున్నారు. సినిమాపై విమర్శకుల నుంచి, సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, ప్రభాస్ క్రేజ్ ముందు అవేవీ నిలవడం లేదు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభాస్ వింటేజ్ కామెడీ టైమింగ్, డ్యాన్స్ మరియు మారుతి మార్క్ ఎంటర్టైన్‌మెంట్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నాయి.






# 'పరాశక్తి' సినిమాకు చిక్కులు

సంక్రాంతి బరిలో నిలిచిన మరో సినిమా పరాశక్తి. శివ కార్తికేయన్, శ్రీ లీల హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా జనవరి 10వ తేదీన రిలీజ్ అయి సక్సెస్ ఫుల్ గా దూసుకు వెళ్తోంది. సుధ కొంగర దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా 1965 సంవత్సరంలో తమిళనాడులో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో వచ్చిందట. ఇక ఈ సినిమాలో జయం రవి, దగ్గుబాటి రానా ప్రత్యేక పాత్రల్లో కనిపించారు.

వివాదంలో పరాశక్తి.. బ్యాన్ చేయాలంటూ డిమాండ్లు

శివ కార్తికేయన్ హీరోగా నటించిన పరాశక్తి సినిమా వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలంటూ డిమాండ్లు వినిపిస్తున్నాయి. హిందీ వ్యతిరేక ఉద్యమం ఆధారంగా వచ్చిన ఈ సినిమాలో కాంగ్రెస్ పార్టీని కించపరుస్తూ కొన్ని సీన్స్ ఉన్నాయట. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ఇందిరాగాంధీని అవమానించేలా కూడా సీన్స్ పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి.

తమిళనాడు ప్రజలు అంటే ఇందిరాగాంధీకి అస్సలు పడదు అనే అర్థం వచ్చేలా సినిమా తీసినట్లు కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వెంటనే ఈ మూవీపై బ్యాన్ విధించాలంటూ డిమాండ్లు తెరపైకి వచ్చాయి. అయితే దీనిపై చిత్ర బృంద సభ్యులు స్పందించినట్లు తెలుస్తోంది. అప్పట్లో జరిగిన అంశాలనే సినిమాలో పొందుపరచామని, ఎవరినీ కించపరచలేదని చెబుతున్నారట.




# పంజాబ్ సింగర్‌తో దిశా పటానీ డేటింగ్

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ దిశా పటానీ తెలుగు, హిందీ చిత్రాల్లో నటిస్తూ తక్కువ సమయంలోనే భారీ క్రేజ్‌ను సంపాదించుకుంది. గ్లామర్‌తో పాటు నటనలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న ఈ బ్యూటీ, గత ఏడాది విడుదలైన 'కల్కి' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది.

ప్రస్తుతం బాలీవుడ్‌లో రెండు ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉన్న దిశా, సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామరస్ ఫొటోలు, వీడియోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉండగా.. తాజాగా, దిశా పటానీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

# 'టాక్సిక్' టీజర్‌పై వివాదం

## రంగంలోకి మహిళా కమిషన్!






కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ వెంటనే రంగంలోకి దిగింది. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది.

అయితే ఈ విమర్శలపై దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కాస్త ఘాటుగానే స్పందించారు. ఒక మహిళా దర్శకురాలు అయ్యుండి ఇలాంటి సన్నివేశాలను ఎలా చిత్రీకరించారు అంటూ వస్తున్న కామెంట్లను చూసి తాను ఏమాత్రం ఆశ్చర్యపోవడం లేదని, ఆ విమర్శలను తాను చాలా తేలిగ్గా తీసుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు.

# వీఐపీ సంస్కృతిపై నటి ప్రణీత సుభాష్ ఆగ్రహం



రాజకీయ నేతల వీఐపీ సంస్కృతిపై ప్రముఖ నటి ప్రణీత సుభాష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓ రాజకీయ నేత కదలికల కోసం రోడ్లను మూసివేయడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె మండిపడ్డారు. ఈ పరిస్థితిని ఉద్దేశించి 'This is frustrating' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇటీవల బయటకు వెళ్లిన సమయంలో బెంగళూరులోని సిటీ సెంటర్, కోరమంగళ ప్రాంతాల వైపు వెళ్లే రోడ్లను వీఐపీ కదలికల కారణంగా మూసివేయడంతో తీవ్ర అసౌకర్యం ఎదురైందని ప్రణీత తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రజల రోజువారీ జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. రాజకీయ నాయకుల వీఐపీ జీవన శైలి దేశాభివృద్ధికి ఏమాత్రం దోహదపడటం లేదని, దానికి బదులుగా మరిన్ని సమస్యలను సృష్టిస్తున్నాయని ప్రణీత స్పష్టం చేశారు.

**దేశం ముందుకు వెళ్లడం కష్టం**

ఇలాంటి వ్యవస్థ కొనసాగితే దేశం ముందుకు వెళ్లడం కష్టమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విటర్)లో ప్రణీత సుభాష్ స్పందిస్తూ, 'సిటీ సెంటర్, కోరమంగళ వైపు వెళ్లే రోడ్లు వీఐపీ కదలికల కోసం మూసివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ నాయకుల వీఐపీ జీవితాలే దేశాన్ని ముందుకు నడిపించకుండా వెనక్కి నెట్టుతున్నాయి' అని ట్వీట్ చేశారు. ప్రణీత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. వీఐపీ సంస్కృతిపై ఆమె చేసిన వ్యాఖ్యలకు పలువురు నెటిజన్లు మద్దతు తెలిపారు.

# బాలీవుడ్‌లో హద్దులు దాటుతున్న పీఆర్ వ్యూహాలు



బాలీవుడ్ నటి తాప్సీ పన్ను ఇటీవల హిందీ చిత్ర పరిశ్రమలో పెరుగుతున్న పబ్లిసిటీ సంస్కృతిపై తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ వ్యూహాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ప్రమోషన్ అనేది కేవలం తమ సినిమా గురించి మాట్లాడటానికే పరిమితం కాకుండా, ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని పీఆర్ టీమ్స్ తమ సినిమాలకు హైప్ క్రియేట్ చేయడానికి ఇతర నటులు, సినిమాలపై నెగటివ్ కథనాలు ప్లాంట్ చేస్తున్నాయి. ఇది ఒక రకమైన పోటీ కాదు, పూర్తిగా తప్పుదారి పట్టిన విధానం" అని వ్యాఖ్యానించారు. సినిమా కంటెంట్, నటన, కథ బలం గురించి మాట్లాడాల్సిన చోట, వ్యక్తిగత విమర్శలు లేదా ఇతరులపై నిందలు వేయడం ట్రెండ్‌గా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు.

# నటన నేర్చుకునే వారికి ఇదొక పాఠం

బాలీవుడ్ హీరోయిన్ యామీ గౌతమ్ ఇమ్రాన్ హష్మీ జంటగా నటించిన సినిమా 'హక్'. కోర్ట్ రూమ్ డ్రామా చిత్రం, ఇది షా బానో కేసు వంటి నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందించబడింది. ట్రిపుల్ తలాక్ తర్వాత న్యాయం కోసం పోరాడే మహిళ కథను ఇందులో చూపించారు. అయితే విడుదలకు పలు వివాదాల్లో చిక్కుకున్న ఈ సినిమా గత ఏడాది విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. అంతేకాకుండా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ సినీ సెలబ్రిటీల మనసులు గెలుచుకుంటోంది. ఇటీవల ఆలియా భట్ సినిమాపై ప్రశంసలు కురిపించింది.

తాజాగా, టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత 'హక్' చిత్రాన్ని చూసి భావోద్వేగానికి గురైనట్లు తెలుపుతూ.. ఎమోషనల్ నోట్ షేర్ చేసింది. "హక్ సినిమా అయిపోయిన వెంటనే ఈ మాటలు రాయాలనిపించింది. ఎందుకంటే ఆ సినిమా నాలో కలిగించిన భావోద్వేగాలను కొంచెం కూడా కోల్పోకూడదని అనుకున్నాను. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఈ కథ ఎంతో సహజంగా, లోతైన మానవీయ కోణంలో సాగింది. ఎలాంటి పక్షపాతం లేకుండా ఎక్కడా ఎవరినీ తక్కువ చేసి చూపించలేదు. ముఖ్యంగా యమీ గౌతమ్ లాంటి అద్భుతమైన నటి ఈ కథకు ప్రాణం పోశారు. యామీ.. నీ నటన నన్ను మాటల్లో చెప్పలేనంతగా కదిలించింది.





## నా అసలైన ప్రయాణం మొదలైంది

నటి శ్రీలీల ఇటీవల 'పరాశక్తి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శివకార్తికేయన్, సుధా కొంగర కాంబోలో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా.. వచ్చి బాక్సాఫీసు వద్ద పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. కానీ కొన్ని సీన్లు వివాదానికి దారితీస్తున్నాయి. ఈ సినిమాను బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, 'పరాశక్తి' మూవీ టీమ్ సక్సెస్ మీట్ నిర్వహించగా.. ఇందులో పాల్గొన్న శ్రీలీల ఆసక్తికర కామెంట్స్ చేసింది. "ఇప్పటి వరకు, నా పాటలు, డ్యాన్స్‌లపై ఎక్కువగా ప్రశంసలు వచ్చేవి. కానీ ఈసారి, నా నటనకు సత్కారం లభించడం నిజంగా ఆనందంగా ఉంది. 'పరాశక్తి' నా కెరీర్‌లో ఒక పరిపూర్ణమైన మొదటి చిత్రం లాంటి అనుభూతిని ఇస్తోంది. ఇది నా భవిష్యత్ ప్రయాణానికి బలమైన పునాదిని వేస్తోంది. గతంలో ప్రజలు ఎక్కువగా నా పాటలు, డ్యాన్స్‌లకే ప్రశంసలు ఇచ్చేవారు.

ఇందులో ప్రతి సీన్ హిలేరియస్‌గా ఉంటుంది.. సినిమా సంక్రాంతి ఫీస్ట్ లాగా ఉండబోతుంది. కానీ ఈ సారి భిన్నంగా అనిపిస్తుంది. ఇది నటిగా నన్ను మరో స్థాయికి తీసుకెళ్తుంది. ఈ సినిమా కోసం నేను చేసిన రియలిస్టిక్ ఎమోషనల్ కౌంచింగ్, డైలాగ్ ప్రాక్టీస్, సీన్ల కోసం తీసుకున్న టైమ్ అన్ని ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చాయి. ఇప్పుడు నా కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోంది. భవిష్యత్‌లో మరిన్ని సినిమాల్లో, వివిధ రకాల పాత్రల్లో ప్రేక్షకుల ముందుకు రావాలనే ఆశతో ఉన్నాను" అని ఎమోషనల్ అయింది.

# ఆకట్టుకున్న మన శంకరవరప్రసాద్ గారు

**ఈ సంక్రాంతికి బరిలోకి దిగిన రెండో పుంజు 'మన శంకరవరప్రసాద్ గారు'. 'భోళా శంకర్' లాంటి డిజాస్టర్ తర్వాత రెండేళ్ల గ్యాప్ తీసుకొని చిరంజీవి ఈ చిత్రంలో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభించింది. దానికి తోడు ప్రమోషన్స్ కూడా గట్టిగా చేయడంతో ఈ మూవీపై బజ్ క్రియేట్ అయింది. భారీ అంచనాల మధ్య నేడు(జనవరి 12) ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతి అందించింది? చిరు ఖాతాలో భారీ హిట్ పడిందా లేదా? రివ్యూలో చూద్దాం.**

రివ్యూ

**కథ :** శంకరవరప్రసాద్(చిరంజీవి) నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్. ఆయన టీమ్(కేథరీన్, హర్ష వర్ధన్, అభినవ్ గోమఠం) కేంద్ర హోంమంత్రి నితీష్ శర్మ(శరత్ సక్సేనా) రక్షణ బాధ్యలతను చూస్తుంటుంది. వృత్తిపట్ల ఎంతో నిబద్ధతతో ఉండే శంకరవరప్రసాద్.. పర్సనల్ లైఫ్‌ని లీడ్ చేయడంలో మాత్రం ఫెయిల్ అవుతాడు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత భార్య శశిరేఖ(నయనతార) అతనికి విడాకులు ఇచ్చి.. బడా వ్యాపారవేత్త అయిన తన తండ్రి జీవీఆర్(సచిన్ ఖేడ్కర్) దగ్గరకు వెళ్తుంది. పిల్లలను కూడా చూపించపోవడంతో ఆరేళ్లుగా వరప్రసాద్ అదే బాధలో ఉంటాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి నితీష్.. తనకున్న పలుకుబడితో బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న తన పిల్లలకు పీఈటీ టీచర్‌గా వరప్రసాద్‌ని పంపిస్తాడు. తండ్రిపై ద్వేషం పెంచుకున్న పిల్లలకు వరప్రసాద్ ఎలా దగ్గరయ్యాడు? అసలు శశిరేఖ, వరప్రసాద్ విడిపోవడానికి గల కారణం ఏంటి? మైనింగ్ వ్యాపారవేత్త వెంకీ గౌడ(వెంకటేశ్), శశిరేఖకు మధ్య ఉన్న సంబంధం ఏంటి? చివరకు శశిరేఖ, వరప్రసాద్ మళ్లీ కలిశారా? లేదా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



**ఎలా ఉందంటే :**

అనిల్ రావిపూడి సినిమాల్లో కథ పెద్దగా ఉండదు. ఆయన సినిమాలో కొత్తదనం, ట్విస్టులు, లాజిక్కుల గురించి వెతకడం అంటే.. ప్యూర్ వెజ్ రెస్టారెంట్‌కి వెళ్లి చికెన్ బిర్యానీ ఆర్డర్ ఇచ్చినట్టే ఉంటుంది. పాత కథతోనే ఫ్యామిలీ ఆడియన్స్‌ని థియేటర్స్‌కు రప్పించడం ఆయన స్టైల్. కథ కథనం కంటే.. హీరోకి ఉన్న ప్లస్ పాయింట్స్‌ని ఎలా వాడుకోవాలనేదానిపైనే ఎక్కువ ఫోకస్ పెడతాడు. హీరోని ఎలా చూపిస్తే.. ఆడియన్స్ కనెక్ట్ అవుతారు? ఎక్కడ ఏ సీన్ పెడితే నవ్వుకుంటారు? అనేది అనిల్‌కి బాగా తెలుసు. ఇప్పటి వరకు ఆయన తీసిన సినిమాలన్నింటికీ ఇదే మ్యాజిక్ వర్కౌట్ అయింది. ఇప్పుడు మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి కూడా అనిల్ ఆ పనే చేశాడు. మెగాస్టార్ చిరంజీవి కామెడీ టైమింగ్‌ని గట్టిగా వాడుకొని.. ఫ్యాన్స్ ఆయన్ని తెరపై ఎలా చూడాలని కోరుకుంటున్నారో అలాగే చూపించాడు. అలా అని చిరులో ఉన్న మాస్ యాంగిల్‌ని పక్కన పెట్టలేదు. మధ్య మధ్యలో యాక్షన్ సీన్లను పెట్టి మాస్ లుక్‌ని కూడా చూపించాడు.

**ఎవరెలా చేశారంటే:**

ఈ సినిమాకు ప్రధాన బలం మెగాస్టార్ చిరంజీవినే. ఆయన లుక్స్, ఎక్స్‌ప్రెషన్స్, డైలాగులు.. ఇవన్నీ చూస్తే ఒకప్పటి మెగాస్టార్ మన కళ్లముందు కనిపిస్తాడు. ఒకవైపు తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంటూనే.. యాక్షన్ సీన్లను ఇరగదీశాడు. ఇక డ్యాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హుక్ స్టెప్ పాటకు ఆయన వేసిన స్టెప్పులకు థియేటర్స్‌లో విజిల్స్ వేయడం గ్యారెంటీ. శశిరేఖగా నయనతార తనదైన నటనతో ఆకట్టుకుంది. తెరపై అందంగా కనిపించింది. హీరో మామగారిగా సచిన్ ఖేడ్కర్ చక్కగా నటించాడు. వెంకీ గౌడ పాత్రలో వెంకటేశ్ ఒదిగిపోయాడు. చిరు వెంకీ కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటాయి. హీరో తల్లిగా జరీనా వాహబ్ తెరపై కనిపించేది కాసేపే అయినా.. నయనతారతో ఆమె చెప్పే సంభాషణలు ఆలోచింపజేస్తాయి. వరప్రసాద్ టీమ్ సభ్యులుగా నటించిన కేథరిన్, హర్షవర్ధన్, అభినవ్ గోమఠంతో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రల పరిధిమేరకు చక్కగా నటించారు.

**సాంకేతికంగా :**

సినిమా చాలా బాగుంది. భీమ్స్ సంగీతం సినిమాకు మరో ప్రధాన బలం. మీసాల పిల్ల, హుక్ స్టెప్ సాంగ్ తెరపై మరింత ఆకట్టుకునేలా ఉన్నాయి. సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. ఎడిటింగ్ పర్వాలేదు. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్లు ఉన్నతంగా ఉన్నాయి.

# హైదరాబాద్‌లో గాలిపటాల తయారీ పరిశ్రమ

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా కృషి
- హైదరాబాద్‌లో అట్టహాసంగా ప్రారంభమైన అంతర్జాతీయ పతంగులు, మిఠాయిల పండుగ
- 18 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్ హాజరు
- 15 రాష్ట్రాల నుంచి 55 మంది జాతీయ కైట్ ప్లేయర్స్



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్‌లో గాలిపటాల తయారీని ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచే ప్రయత్నం చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ పతంగుల, మిఠాయిల పండుగ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు. పతంగుల పండుగకు శతాబ్దాల చరిత్ర కలిగి ఉందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణ కోసం తమ ప్రభుత్వం ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా వివిధ దేశాల, రాష్ట్రాల నుండి తరలివచ్చి ఎగురవేస్తున్న రంగురంగుల పతంగులు ఆకాశాన్ని మురిపిస్తున్నాయని పేర్కొన్నారు. తన చిన్నతనంలో పతంగులు ఎగురవేసిన మధుర జ్ఞాపకాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమ బిజీ జీవితంలో కనీసం నెలకు రెండు రోజులైనా పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని మంత్రి సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ టూరిజం శాఖ పక్షాన హైదరాబాద్ సంప్రదాయాలకు ఆచారాలకు అనుగుణంగా కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్ 3 రోజుల పాటు జరుగుతుందని అన్నారు. హైదరాబాద్ ఆతిథ్యానికి మారుపేరన్న మంత్రి.. ఇక్కడ జరుగుతున్న కైట్ ఫెస్టివల్ కు 18 దేశాల నుండి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్ వచ్చారన్నారు. అలాగే 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ప్లేయర్స్ వచ్చారని చెప్పారు. కైట్స్ అండ్ స్వీట్ ఫెస్టివల్ సందర్భంగా విభిన్నమైన కైట్స్ ఎగురుతున్నాయని ప్రతి ఒక్కరూ తిలకించి ఆస్వాదించాలని మంత్రి పేర్కొన్నారు. 1200 స్వీట్స్ తో పాటు 60 స్టాల్ లో తెలంగాణ పిండి వంటలు ఏర్పాటు చేశామన్నారు. గచ్చిబౌలి లో హాట్ బెలూన్ కార్యక్రమం జరుగుతుందని ప్రజలందరూ పాల్గొని ఆస్వాదించాలని తెలిపారు. మెట్రో ఫెసిలిటీ ఉండటం, మహిళలు ఆర్టీసీ లో ఉచితంగా రావచ్చని తెలిపారు. కైట్ ఫెస్టివల్ కు వచ్చి ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ జంటనగరంతో పాటు తెలంగాణ ప్రజలు వీక్షించవచ్చన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రాష్ట్రాల మిఠాయిల స్టాళ్లను మంత్రి జూపల్లి సందర్శించి, రుచులను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎం.డి క్రాంతి వల్లూరి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహ రెడ్డి, హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్ డి సోలంకి, క్లిక్ ప్రతినిధులు లింబీ బెంజిమన్, పరమానంద శర్మ , అభిజిత్ పాల్గొన్నారు.






# ప్రతి కుక్క కాటుకు రాష్ట్రాలపై జరిమానా

మొదటి పేజీ తరువాయి..



సదరు సంస్థ బాధ్యత వహించదా? వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలి'' అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**పాతికేళ్లు పూర్తయ్యాయా.. మీ శిక్షాకాలాన్ని ఎలా లెక్కిస్తున్నారు?**

ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. ''మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం'' అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# విజయ్‌తో కర చాలనం

మొదటి పేజీ తరువాయి..

సినిమా వివాదానికన్నా పెద్దది అయింది. ఈ సినిమా సర్టిఫికేషన్‌లో అడ్డంకు లను, న్యాయపరమైన పరిశీలనను, దాని విషయాంశం పట్ల అనేక అభ్యంతరాలు, వివా దాలు నెలకొన్న క్రమంలో క్లియరెన్స్‌లో జాప్యం జరిగాయి. ఈ విషయంలో అధికారులు, నిర్మాతల నడుమ కోర్టులో వాద ప్రతివాదనలు జరిగి, దానిని చివరికి రాజకీయ అంశాన్ని చేశాయి. ఇంతకు ముందు,సృజనాత్మక స్వేచ్ఛను అణచివేయకూడదంటూ కాంగ్రెస్ నాయకులు నిర్మాతలకు అనుకూలంగా మాట్లాడారు. తమిళ నాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా ఈ సూత్రాన్ని సమర్థిస్తూ, సినిమాలను అన్యాయంగా లక్ష్యంగా చేసుకోకూడదన్నారు. రాజకీయ వత్తిడి కళాకారుల పని ప్రదేశాన్ని ప్రభావితం చేస్తోందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విస్తృతమైన నేపథ్యమే రాహుల్ గాంధీ పూర్తిగా దానికి రాజకీయ రంగు పులమడానికి తోడ్పడింది. కాంగ్రెస్ పార్టీలో కూడా ఈ పోస్టు అనంతరం తమిళనాడులో పార్టీ వ్యూహంపై తాజా చర్చకు దారి తీసింది. టివికెతో సంబంధాన్ని నిర్మించుకునే విషయాన్ని పార్టీ పరిగణి ంచాలని ఒక వర్గం నాయకులు భావిస్తున్నారు. ముఖ్యంగా యు వతరంలో – తొలిసారి ఓటు వేసేవారిలో విజయ్ కున్న పాపులారిటీ అన్నది కాంగ్రెస్‌కు ఒక నూతన రాజకీయ లాభాన్ని చేకూరుస్తుందని వారి భావన. అటు విజయ్ ఇటు రాహుల్ గాంధీ నాయ కత్వంలో ప్రచారాలు క్షేత్ర స్థాయిలో ప్రజలతో బలంగా అనుసంధానమై రాష్ట్రం మూడ్‌ను మారుస్తుందని పార్టీ భావిస్తోంది.

అయితే, కాంగ్రెస్‌లోని అందరూ ఈ అభిప్రాయాన్ని సమర్థించడం లేదు. డిఎంకెతో ఉన్న సుదీర్ఘకాలం సంబంధాన్ని కొనసాగించాలని అనేకమంది సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ భాగస్వామ్యం గత కొన్నేళ్లలో స్థిరత్వాన్ని, ఔచిత్యాన్ని, రాజకీయ లబ్ధిని చేకూర్చిందని వారి అభిప్రాయం. వారి ప్రకారం, ఎంత ఉత్సాహంగా అనిపించినా, కొత్త పార్టీతో ప్రయోగంతో ప్రమాదం కూడా ఉంటుందని వారి అభిప్రాయం. డిఎంకె నుంచి తప్పుకోవడం కన్నా, ప్రస్తుత పరిస్థితిని ఉపయోగించుకొని, ఉనికిలో ఉన్న కూటమిలో బలమైన పాత్రను, మరింత జాగాను కోరవచ్చని వారి వాదన.

కాంగ్రెస్, డిఎంకె సుదీర్ఘమైన, కొన్నిసార్లు సంక్లిష్టమైన సంబంధాన్ని కలిగి ఉన్నారు. అయితే, అది ఎక్కువగా స్థిరంగానే ఉంది. అదే సమయంలో తమిళనాడు రాజకీయాలు జె. జయలలిత, ఎం. కరుణానిధిల మరణానంతరం నుంచి నిరంతరం మారుతున్నాయి. ఈ పరిస్థితే నూతన రాజకీయ శక్తులకు స్థానాన్ని ఇస్తోంది. తన స్టార్ పవర్‌తోనూ, రాజకీయ సందేశంతోనూ విజయ్ ఓటర్లను ప్రభావితం చేసే సంభావ్య నూతన నాయకుడిగా విజయ్‌ను చూస్తున్నారు.ఆయనలో పెరుగుతున్న దృఢ సంకల్పం ఆయనను అనూహ్యమైన వ్యక్తిగా మార్చింది, కానీ గమనించ దగ్గ ముఖ్యమైన వ్యక్తిని చేసింది. ప్రజాభిప్రాయాలు, కూటమి ప్రాధాన్యతలు, వాస్తవాలను అర్థం చేసుకోవడానికి కాంగ్రెస్ రాబోయే వారాల్లో ఒక వివరణాత్మక సర్వే నిర్వహించనుంది.

# 52,43,023 మంది 'పుర' ఓటర్లు

మొదటి పేజీ తరువాయి..

117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లు ఎన్నికలకు సిద్ధమయ్యాయి. మొత్తం 2,996 వార్డుల్లో ఓటర్ల నిర్ధారణ పూర్తయిందన్న సీఈసీ.. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మొత్తం 52,43,023 మంది ఓటర్లు వెల్లడించింది. అందులో పురుష ఓటర్లు 25,62,639 మంది, మహిళా ఓటర్లు 26,80,014 మంది ఉన్నారని తెలిపింది. ఇక ట్రాన్స్‌జెండర్లు 640 మంది ఉన్నట్లు పేర్కొంది. ఇందులో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే అధికంగా ఉండటం విశేషం. ఇందులో పురుషుల కంటే దాదాపు 1.18 లక్షల మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మొత్తానికి గతంతో పోలిస్తే పట్టణ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. కాగా, నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన వెంటనే త్వరలోనే మున్సిపల్ పోరుకు నోటిఫికేషన్ విడుదల చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం.. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో మొత్తం 3,40,580 మంది ఓటర్లతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఇక అత్యల్పంగా కొత్తగూడెం కార్పొరేషన్‌లో 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. మున్సిపాలిటీల విషయానికి వస్తే.. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉన్నారు. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు.

**నోటిఫికేషనే తరువాయి..**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల తుది జాబితా ప్రకటించిన నేపథ్యంలో జనవరి 20న మున్సిపల్ ఎలక్షన్స్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు.. ఇతర ప్రధాన పార్టీల నేతలు ఈనెల 16 నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ ఓటర్ల జాబితా ఆధారంగా వార్డుల వారీగా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ చేపట్టనుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనుంది. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

# అందరి జీవితాల్లో భోగభాగ్యాలు, కొత్త కాంతులు

- తెలుగు ప్రజలకు సీఎం.. సంక్రాంతి విషెస్
- గడప, గడపకు అభివృద్ధి, సంక్షేమం సర్కార్ బాధ్యత

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

తెలుగు ప్రజలందరికీ సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి చేరాలనేది తమ సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, ఉత్పత్తులు, సేవల రంగంలో తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగతి సాధిస్తుందనే నమ్మకం తనకుందని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబరాలు జరుపుకోవాలన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# నాలుగోసారి వాత తప్పదు..

**వుసయం, అశ్వారావుపేట :**

అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కర్రుకాల్చి వాత పెట్టినా.. గత పాలకులకు ఇంకా జ్ఞానం రాలేదని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ఒళ్లంతా విషం నింపుకొని రోడ్ల మీద కారుకూతలు కూస్తున్న ఆనాటి 'ప్రభువుల'కు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నాలుగోసారి వాత తప్పదని జోస్యం చెప్పారు. అశ్వారావుపేటలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ మద్దతుదారులైన 60 మంది సర్పంచుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో పేదవాడికి ఇల్లు కట్టించాలనే జ్ఞానం కూడా లేని అప్పటి పాలకులు, ఇప్పుడు అధికారం పోయిందన్న అక్కసుతో సోల్లు వాగుడు వాగుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో నియోజకవర్గానికి కనీసం 10 ఇళ్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే మూడుసార్లు చెంప చెళ్లుమనిపించిన ప్రజలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే తీర్పును పునరావృతం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

అశ్వారావుపేట గిరిజన ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధతో తమ ప్రభుత్వం ఇక్కడకు 4,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందన్నారు. ఇది గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. మేడారం జాతరను 200 ఏళ్ల వరకు చెక్కుచెదరని రీతిలో అద్భుతమైన రాతి కట్టడాలతో పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలను ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా, గ్రామాల్లో నిస్వార్థంగా సేవ చేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పాల్గొన్నారు.

# మేడారం జన సాగరం



మొదటి పేజీ తరువాయి..

వారి బలిదానాలనే నేడు "మేడారం మహా జాతరగా" నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఎట్లున్న మేడారం ఎట్ల మారింది. నేడు మేడారం స్వరూపం పూర్తిగా మారిపోయింది. నాటి మేడారానికి నేటి మేడారానికి ఎంతో తేడా కనిపిస్తోంది. భక్తులు మెచ్చేలా.. మురిసేలా... రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర నిర్వహణకు అవసరమైన అభివృద్ధి పనులు భారీ స్థాయిలో చేపట్టారు. ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే మేడారం అభివృద్ధి పునర్నిర్మాణ పనులకు ప్రజా ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. జాతర నిర్వహణకు అవసరమైన వసతుల కల్పన, అభివృద్ధి పనులు అద్భుతంగా చేపడుతోంది. మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. మేడారం ధగ ధగా మెరుస్తోంది. ఏర్పాట్లు, అభివృద్ధి పనులను చూసి భక్తులు మురిసిపోతున్నారు. కొత్త సొగబులు.. కాంతులు వారిని కట్టిపడేస్తున్నాయి. గత పాలకులు ప్రతి సారి జాతర వచ్చిందంటే కోట్లాది రూపాయలు వెచ్చించి తాత్కాలికంగా అభివృద్ధి పనులు, వసతులు కల్పించేవారు. ప్రతీ సారి ఇదే జరుగుతుండేది.

**శాశ్వత నిర్మాణాలు..**

వందల ఏళ్లపాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెల శాశ్వత పున: నిర్మాణం పనులు చేపట్టింది. జనవరి ఐదో తేదీ నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు రాత్రింభవళ్లు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. గద్దెల విస్తరణ, ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రానైట్ రాతి ప్రాకార నిర్మాణం, స్వాగత తోరణాల ఏర్పాటు పనులు తుది దశలో వేగంగా సాగుతున్నాయి.

**పిల్లర్లపై సంస్కృతి, ఆచారాలు, చరిత్ర..**



మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ పిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, చరిత్రను తీర్చిదిద్దారు. మార్బుల్ శిలలతో గద్దెలూ జంపన్న వాగు సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థలు, ఫ్లడ్ మేనేజ్‌మెంట్, 60 అడుగుల నుంచి నాలుగు లైన్లకు రోడ్ల విస్తరణ, క్యూ లైన్లు, సత్రాలు, వాచ్ టవర్లు, గ్రీనరీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరోవైపు జాతర సజావుగా సాగేందుకు మహా కుంభమేళాలో భాగస్వాములైన నిపుణుల బృందం మేడారానికి చేరుకుని.. జాతర జరిగే ప్రాంతం, అక్కడికి దారి తీసే మార్గాలు, జాతర రద్దీ ఉండే ఉప ఆలయాలను సందర్శించి.. అధికారులకు తగిన సూచనలు..సలహాలు చేసింది. ఈసారి జాతరకొచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా గద్దెల సమీపంలోనే ఏకకాలంలో వేల వాహనాల పార్కింగ్‌కు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ నాలుగు రోజులూ డ్రోన్‌షో ప్రత్యేక ఆకర్షణ కానున్నది. ఎక్కడ నిర్వహించాలో త్వరలో నిర్ణయం తీసుకుంటారు. జాతరపై సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాక్యుమెంటరీ కూడా రూపొందిస్తున్నారు.

# పది నిమిషాల్లో డెలివరీకి..

మొదటి పేజీ తరువాయి..

ఇది కీలకమైన చర్య ఎందుకంటే, రైడర్ టీషర్టు, జాకెట్ లేదా బ్యాగ్‌పై 10 నిమిషాలు అని ముద్రించి ఉంటుందని, అంతే కాదు, కస్టమర్ స్క్రీన్‌పై కౌంట్‌డౌన్ నడుస్తుందని, కనుక, ఈ ఒత్తిడి వాస్తవం, నిరంతరం, ప్రమాదకరం అని ఆయన అన్నారు. ఈ మార్పు డెలివరీ రౌడర్లకే కాదు రోడ్డును ఉపయోగిస్తున్న ఇతరుల భద్రతకు తోడ్పడుతుందని చద్దా అన్నారు. గత కొన్ని నెలలుగా తాను వందలాదిమంది డెలివరీ భాగస్వాములతో మాట్లాడానని, వారిలో అధికులు తక్కువ జీతానికే అధికంగా పని చేయడమే కాక, అవాస్తవ వాగ్దానాన్ని నెరవేర్చడానికి తమ ప్రాణాలను పణంగా పెడుతున్నవారిని చూశానని ఆయన అన్నారు. ఈ ప్రచారానికి మద్దతు ఇచ్చిన పౌరులకు కృతజ్ఞతలు చెప్తూ, వారు మానవ జీవితం, భద్రత, గౌరవం పక్షాన నిలిచారని అంటూ, గిగ్ కార్మికులు వంటరి వారు కాదని, తామంతా వారికి అండగా ఉన్నామని అన్నారు. వేగవంతమైన వాణిజ్యం, ఆప్ ఆధారిత డెలివరీ వేదికలను నియంత్రించాలని ఆప్ ఎంపీ ప్రతిపాదిస్తూ వస్తున్నారు. పార్లమెంటులో కూడా ఆయన వేగంగా పెరుగుతున్న ఈ రంగానికి బలమైన రక్షణలు ఉండాలని పేర్కొంటూ, గిగ్ కార్మికులకు సామాజిక భద్రత, గౌరవం, భద్రత,తగిన వేతనాలు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు.

# ఇంకా బుద్ధి రాలేదా?

మొదటి పేజీ తరువాయి..



నాయకులకు మైండ్ బ్లాక్ అయ్యిందన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని చురకలంటించారు. రోడ్డు మీద పిచ్చి కుక్క కరిస్తే ఎలా పిచ్చెక్కినట్లు వాగుతారో.. అదే పద్ధతిలో గత పదేళ్లు పాలించిన వారు బ్లఫ్ చేస్తున్నారని చెప్పారు 10 మంది సర్పంచులను గెలిపించుకుని, కార్యకర్తలందరినీ నిలబెట్టి మేమే గెలిచామని చెప్పుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

**మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే గతి!**

గతంలో ఎన్నికల ఫలితాలను సెమీఫైనల్స్‌గా అభివర్ణించిన మాజీ మంత్రులపై పొంగులేటి నిప్పులు చెరిగారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 69 శాతం సీట్లు గెలిచి కాంగ్రెస్ తన జైత్రయాత్రను చాటింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇది 80 శాతానికి మించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు.




Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.